ఆంధ్రపత్రిక

సచిత్ర వారపత్రిక




వెల
4 అణాలు

సంపుటము 42 సంచిక 9

ANDHRA PATRIKA
ILLUSTRATED WEEKLY

అక్టోబరు 26 1949

భారత ప్రధానికి అమెరికా స్వాగతం




లండనునుండి పండిట్ నెహ్రూను తోడ్కొనివచ్చిన 'ఇండిపెండెన్సు' వాషింగ్టన్ విమానాశ్రయంలో దిగుతూఉంది.



ట్రూమన్ సభాపతి స్వాగతానికి పండిట్ నెహ్రూ సమాధానం ఇస్తున్నారు



విమానం దిగడంతోనే ట్రూమన్ అధ్యక్షుడు ప్రధానమంత్రిని కలుసుకొని కరచాలనం చేస్తున్నారు. నెహ్రూసోదరి విజయలక్ష్మీపండిట్, కుమార్తె ఇందిరాగాంధి, ట్రూమన్, నెహ్రూప్రక్కల నిలబడి ఉన్నారు.



ట్రూమన్ పండిట్ నెహ్రూను విమానంవద్ద కలుసుకొని సైనికాభివందనల స్వీకరించడానికి తోడ్కొని వస్తున్నారు.



వైట్ హౌస్ బాల్కనీనుండి అక్కడ చేరిన ప్రజాసమూహాన్ని తిలకిస్తున్నారు.



అమెరికా సైన్యానికి చెందిన మూడుశాఖల దళాల అభివందనములను స్వీకరిస్తున్న పండిట్ నెహ్రూ.

ఆంధ్రపత్రిక

సంవత్సరచందా. రు. 12-0-0

విడిప్రతిక అణాలు 0-4-0

ప్రతి బుధవారమున ప్రకటింపబడును


ఒరు లేయవి యొనరించిన నరవర, యప్రియము తన మనంబున కగు దా
నొరులకు నవి సేయకునికి పరాయణము పరమధర్మ పథముల కెల్లన్. (మహాభారతము)

సంపుటము 42


సంచిక 9

Founder : K. NAGESWARA RAO

విరోధి సంవత్సర కార్తిక శుద్ధ పంచమి బుధవారము



అమెరికాప్రతినిధులసభలో భారత ప్రధానమంత్రి



ఆంధ్రపత్రిక

1949-వ సం॥ అక్టోబరునెల 26-వ తేది బుధవారము

భద్రతా మండలికి భారతదేశం ఎన్నిక

ప్రధానమంత్రి పండిట్ జవహర్లాల్ నెహ్రూ తమ ప్రభుత్వవిదేశాంగవిధానమును విస్పష్టముగ, అసందిగ్ధముగ వివరించిన అనంతరము భారతదేశము భద్రతామండలికి 56 వోట్లతో ఎన్నికగుట గమనింపతగిన విషయము. పాకిస్తాన్ విదేశాంగమంత్రి సర్ మహమ్మద్ జఫ్రుల్లాఖాన్ అదేపనిగ భారతదేశము భద్రతామండలికి ఎన్నిక కారాదని ప్రచారము చేసినను, అరబ్ రాజ్యములన్నియు భారతదేశ సభ్యత్వమును బలపరచుట విశేషము. అట్లే భారతదేశము అమెరికాబలపరచిన యుగస్లావియాకు గాక, రష్యా నిలపెట్టినచకస్లవేకియాకు భద్రతామండలి ఎన్నికలలో వోటుచేసినను, అమెరికా, అమెరికాఆశ్రిత రాజ్యాలు అన్నియు భారతదేశమునకు అనుకూలముగ వోటుచేయుట విశేషము.

గత సంవత్సరము భద్రతామండలికి జరిగిన ఎన్నికలలో భారతదేశము యుక్రేన్‌తో పోటీపడి, ఫలిత మెటు తేలనందువలన తుదకు తన అభ్యర్థిత్వమును ఉపసంహరించుకొనవలసి వచ్చెను. ఈ సంవత్సరము అట్లు గాక మొదటి ఎన్నికలోనే భారతదేశము విజయమును పొందెను. గత రెండు సంవత్సరములుగ భద్రతామండలి సభ్యత్వము గల కామన్వెల్తురాజ్యము కెనడాస్థానమునకు మరొక కామన్వెల్తు రాజ్యము ఎన్నిక యగుట విధాయకమని పలువురు భావించిరి. గత సంవత్సరము జరిగిన ఎన్నికలలోకూడ ఈ విషయము ప్రస్తావనకు వచ్చెను. ఆ సందర్భమున భారతదేశము ప్రాంతీయ ప్రాతినిధ్యమునుకూడ గమనింపవలసి యుండునని, శాశ్వతసభ్యత్వముగల ఐదు రాజ్యములలో ఒకటైన చైనాను మినహాయించిన దూరప్రాచ్యమునకు ఆసియాకు భద్రతామండలిలో ప్రాతినిధ్యమే లేకుండ పోవునని, అది అన్యాయమని వాదించియుండెను. కాని ప్రయోజనము లేకపోయెను. ఈ సంవత్సరము అట్లుగాక, కెనడాస్థానమునకు భారతదేశము ఎన్నికగుటవలన కామన్వెల్తుకు సభ్యత్వము లభించుటేగాక, ఆసియాకు గత రెండు సంవత్సరములుగ లేనట్టి ప్రాతినిధ్యము లభించినది.

ప్రపంచరాజకీయరంగమున ఇంతవరకు ఆసియాఖండమునకు వుండవలసిన ప్రాతినిధ్యము వుండుటలేదని, పాశ్చాత్యదేశము లన్నియు ఆసియాను అలక్ష్యము చేయుచున్నవని పండిట్ నెహ్రూ గత సంవత్సరము పారిస్‌లో జరిగిన ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశమునందు హెచ్చరించియుండిరి. ఆసియాలో భారతదేశము నిర్వహింపవలసిన బాధ్యత గురుతరమైనది. పండిట్ నెహ్రూ తమ అమెరికాపర్యటనలో ఈ విషయమును అనేక పర్యాయములు స్పష్టముగ ప్రకటించిరి. అంతేగాక ఐక్యరాజ్య సమితి ప్రయోజనములో అత్యంత విశ్వాసముగల కొద్ది దేశములలో భారతదేశ మొకటి. భారతదేశము ఏమిచేసినను సమితిని బలిష్ఠ మొనర్చుటకే. కాశ్మీరు వ్యవహారములో సమితి మధ్యవర్తిత్వమును భారతదేశము అంగీకరించుటవలన ఐక్యరాజ్యసమితి ప్రతిష్ఠ హెచ్చినది. సర్ మహమ్మద్ జఫ్రుల్లాఖాన్ ఆ కాశ్మీరుసమస్యయే భారతదేశ ఎన్నికకు ప్రతిబంధకమని ప్రచారము చేసిరి.

ప్రపంచము నేడు యుద్ధభయముతో బాధపడుచున్నది. ఆ భయమే యుద్ధమునకు దారి తీయునని ప్రధానిమంత్రి హెచ్చరించుచున్నారు. ఆ భయ నిర్మూలనకు గాంధీమహాత్ముడు ప్రబోధించిన సత్యాహింసల అనుష్ఠానమే శరణ్యమని పండిట్ నెహ్రూ అమెరికా ప్రజలకు విశదము చేసెను. భద్రతా మండలిలో భారతప్రభుత్వమనుసరించు విధానముకూడా ప్రపంచప్రజల నిర్భయుల చేయుటకే ఉపయోగపడగలదు. మండలిలో శాశ్వత సభ్యత్వము గల ఆసియారాజ్యము చైనా ఎటూగాకుండా ఉన్నది. ఈ పరిస్థితులలో నవ ఆసియాలో ప్రముఖస్థానాన్ని ఆక్రమించి, గురుతర బాధ్యతలను నిర్వహింపవలసిన భారతదేశమును భద్రతామండలికి ఎన్నుకొనుటలో సమితిసభ్యులు తమ విధ్యుక్తధర్మమును నిర్వర్తించిరని చెప్పవచ్చును.

విషిన్‌స్కీ వివరణ

సోవియట్ రష్యా యుగస్లావియాపై దండయాత్ర సాగించిన, అట్టి దురాక్రమణ తృతీయప్రపంచసంగ్రామమునకే దారితీయునని మార్షల్ టిటో చేసిన హెచ్చరికను, భద్రతామండలిలో యుగస్లావియాకు స్థానము లభించిన ఐక్యరాజ్యసమితిలో స్పర్థలు ఏర్పడి ఆ సంస్థ దుర్బలమైపోగలదని సోవియట్ విదేశాంగమంత్రి విషిన్‌స్కీ చేసిన హెచ్చరికను పరిశీలించిన రెంటా తథ్యమేనను భావము కలుగక మానదు. యుగస్లావియా భద్రతామండలికి ఎన్నిక కాగల యవకాశములు క్షణక్షణమునకు, సోవియట్ రష్యా ధర్మమాయని అధికమగుచున్నవి. కొన్ని దేశములు తటస్థముగ నుండుటవలన యుగస్లావియాకు రావలసిన మూడింట రెండువంతుల వోట్లు రాకపోయినా "యుద్ధ ప్రమాదము" సద్యః నివార్యము కావచ్చును. యుగస్లావియా ఎన్నిక కాకపోవుట, మ్యూనిక్ ఒడంబడికకంటె ఎక్కువ ప్రయోజనకరము కాజాలదు. మ్యూనిక్ ఒడంబడిక యుద్ధనివారణను గాక యుద్ధాగమనమునే సూచించెనని ఆ సందర్భమున భావించినట్లే ఇప్పుడును యుగస్లావియా ఉదంతము రానున్న యుద్ధమునకు సూచనే నని భావింపవలసి యుండును.

గత మంగళవారం సోవియట్ విదేశాంగమంత్రి విషిన్‌స్కీ లేక్ సక్సెస్ లోని పత్రికావిలేఖరుల ప్రశ్నలకు ఇచ్చిన సమాధానములు భావగర్భితములైనవి. "యుగస్లావియా భద్రతా మండలికి ఎన్నిక అయిన, రష్యా మండలిసమావేశములను బహిష్కరించునా?" యని ఒకవిలేఖరి ప్రశ్నింపగా "ఆ ఎన్నికను న్యాయసిద్ధమైనదిగను, ధర్మబద్ధమైనదిగను మేము గుర్తించము. అంతే. అంతకుమించి నేను ఇది చేయుదును; అది చేయుదును అని సోవియట్ యూనియను ముందుగ ఎన్నడు చెప్పదు." అని సోవియట్ విదేశాంగమంత్రి ఇచ్చిన సమాధానము రష్యా విదేశాంగ విధానమును ఒక వాక్యములో వివరించినది.

సోవియట్ రష్యా దేశాంగ, విదేశాంగ విధానము ఎప్పుడు ఏ దారి త్రొక్కునో చెప్పుట దుస్సాధ్యము. ఫాసిస్టుఇటలీ అబిసీనియాపై దురాక్రమణజరిపినపుడు, ఫ్రాంకోస్పానిష్ రిపబ్లిక్‌పై యుద్ధమును కొనసాగించినపుడు, ఫాసిజం, నాజిజం నిర్మూలనకు ప్రజాస్వామ్యము లన్నియు కత్తికట్టవలెనని నానాజాతిసమితిసమావేశమునందు ఘోషించిన రష్యా, యుద్ధము ప్రారంభమగునరికి నాజీజర్మనీతో దురాక్రమణ నిరోధక పరస్పర సహాయ, మైత్రిఒడంబడికను కుదుర్చుకొనిన సంఘటనను గుర్తించుకొనినవారెల్లరకు విషిన్‌స్కీ ప్రకటనఅంతరార్థము అవగతము కాగలదు.

'బాల్కన్స్' విషయములో రాజీకుదిరేపక్షములో అమెరికా యుగస్లావియావిషయమై పట్టుబట్టక పోవచ్చునని, తద్వారా ప్రాక్-పశ్చిమ విభేదములు తాత్కాలికముగనైన పరిష్కారము కాగలవని ఆమధ్య కలిగిన ఆశ విషిన్‌స్కీ వివరణవలన పటాపంచలైనది.

1939 యుద్ధమునకు పోలెండ్ హేతువైనట్లు, '1950 యుద్ధము'నకు యుగస్లావియా హేతువు కావచ్చు నను యభిప్రాయము నానాటికి ప్రబలమగుచున్నది. చైనావిషయములో పశ్చిమ రాజ్యములు సమాధానపడినను, యుగస్లావియావిషయములో రష్యా సమాధానపడునని ఆశింపవీలు లేదు. విషిన్‌స్కీ వివరణ సమితి పరిష్కరింపవలసియున్న వివిధసమస్యల పరిష్కారమునకు ఏ మాత్రము తోడ్పడుట లేదు. రష్యావిధానములో అనుకూలమైన మార్పు రాగలదని ఆశించిన వారికి, అట్టిది అసంభవమని మాత్రము స్పష్టము చేసినది.

నూతనరాజ్యాంగంతో ఆంధ్రరాష్ట్రం

నూతన రాజ్యాంగచట్టద్వితీయప్రతిపాదనను రాజ్యాంగపరిషత్తు ఆమోదించి స్వతంత్రభారత రిపబ్లిక్కుకు రూపురేఖలు దిద్దినది. 1950 జనవరి 26 న నూత్న రాజ్యాంగము అమలు జరుగుటకు వీలుగ, చట్టమును మూడవమారు ఆమోదించు కార్యక్రమమును పరిషత్తు నవంబరు 26 లోపుగ పూర్తి చేసుకోనున్నది. 1950 జనవరి 26 లోపున ఆంధ్రరాష్ట్రమేర్పడవలెనన్న, ఈ నవంబరు 26 లోపుననే ఆంధ్రరాష్ట్రముసాయి బయల్పడవలసియున్నది. నిశ్చితమైన సరిహద్దులతో రాష్ట్రస్వరూపము నిర్ణయమైనగాని రాష్ట్రములజాబితాలో ఆంధ్రరాష్ట్రమును జేర్చు సవరణప్రతిపాదనకుకూడ అవకాశ ముండదు.

ఈ ప్రాతిపదిక నవంబరు 26 లోన ఏర్పడగలుగుటకే, నవంబరు 15 లోగా, మద్రాసుప్రభుత్వము, ఆంధ్ర, తమిళ, కాంగ్రెసు సంఘములు, నాయకత్రయనివేదికపై

కిటి ప్రపంచం

★ భద్రతామండలిలో భారతదేశ సభ్యత్వం

ఐక్యరాజ్యసమితి ఉపశాఖఅయిన భద్రతా మండలిలో సభ్యత్వం భారతదేశానికి లభించకుండా చేయటానికి పాకిస్థాన్ శతవిధాలా ప్రయత్నించింది. గత సంవత్సరందాకా ఈ ప్రయత్నాలు ఫలించాయి. ఈ సంవత్సరం కూడా పాకిస్థాన్ విదేశాంగమంత్రి జఫ్రుల్లా ఖాన్ సమితి సభ్యదేశాల ఇల్లిల్లూ తిరిగి చేసిన దుష్ప్రచారమంతా వమ్మైపోయింది. సభలో మొత్తం 58 ఓటలలోనూ 56 ఓట్లు భారతదేశానికి వచ్చాయంటే బ్రిటిష్ ప్రతినిధి విక్టర్ మాక్నీలుకుకూడా అత్యాశ్చర్యం కల్గింది. రాని రెండు ఓట్లూ ఎవరెవరివో తెలియక పోయినా పాకిస్థాన్ ఓటు ఎటుఉండిందీ ఆలోచించటానికి మేధాశక్తితో పనిలేదు.

భద్రతామండలి సభ్యత్వాలకు జరిగిన మొదటి ఎన్నికలో, కామన్వెల్తు రాజ్యాల తరఫున కెనడాకు బదులు నిలిచిన ఇండియాకు 56 ఓట్లు వచ్చాయి. ఆ మొదటి ఎన్నికలోనే ఈక్వెడార్‌కు 57, యుగోస్లావియాకు 37, జకోస్లావియాకు 20 ఓట్లు వచ్చాయి. మొత్తం ఓట్లల్లో మూడింట రెండువంతులకుపైగా ఓట్లు వచ్చినవారు ఎన్నికయినట్లుగా లెఖ్ఖకాబట్టి, భారతదేశం, ఈక్వెడార్లు, మొదటి ఎన్నికలోనే ఎన్నుకోబడ్డట్టు ప్రకటించబడ్డాయి. జకోస్లావాకియా యుగోస్లావియాలకు మళ్లీ పోటీ జరిగి ఎన్నిక జరిగింది. యుగోస్లావియాకు 37, జెకోస్లావాకియాకు 20 ఓట్లు వచ్చాయి.

భారతదేశం, ఈ ఎన్నికలో జకోస్లావాకియాకు అనుకూలంగా ఓటు ఇచ్చింది. భారత విదేశాంగ నీతిని అనేకమార్లు వివరిస్తూ పండిట్ నెహ్రూ, "భారతదేశం, ఏకూటమిలోనూ భాగస్వాములుగా ప్రపంచవిషయాలను పరికించదనీ, ఏ సమస్యకు ఆ సమస్యను విడిగా, ఆ సమస్యలోని ధర్మాధర్మాలను సమన్వయించుకొని, పక్షపాత ప్రాబల్యాలవల్ల కాక, తనకు సముచితంగా తోచిన విధానంలోనే, తన ఆచరణను నిర్ణయిస్తుందనీ" చెప్పారుగదా. యుగోస్లావియాను రష్యాకు ప్రతికూలంగా, ప్రబలరాజ్య చాణక్యాలకు తార్కాణంగా అమెరికా నిలిపింది. రష్యా యుగోస్లావియాను భద్రతామండలికి ఎన్నుకుంటే - న్యాయసిద్ధంగా దానిని తాము గణించబోవటం లేదని రష్యన్ విదేశాంగమంత్రి విషిన్స్కీ ఈమధ్యనే ప్రకటించియున్నాడు. సమితి ఎన్నికలోకూడా, ఆ సభ్యత్వానికి తమకు గల అభ్యంతరాలనూ, యుగోస్లావియా, సాటి దేశమైన రష్యాపట్ల దుష్ప్రచారం సాగించడంవల్ల సభ్యత్వానికి నిలచే అర్హత ఎల్లాగోల్పోయిందీ తెలుపుతూ పాయింటు ఆఫ్ ఆర్డరు లేవదీసి, యుగోస్లావియా సభ్యత్వ అనర్హతను విశదీకరించాడు. కాని ఆయన ప్రసంగం అంతా అసందర్భము, అనుచితము, అని అధ్యక్షుడు తోసివేశాడు. యుగోస్లావియా ఎన్నిక అయిందని ప్రకటించాడు. కాని విషిన్స్కీ, ఆ ఎన్నిక ఐక్యరాజ్యధర్మ ప్రణాళికలోని 23 వ అంశానికి, ప్రాదేశిక ప్రాతినిధ్యవిషయం వివరిస్తూన్న అంశానికి, విరుద్ధంగా ఉందని వాదించాడు. సంప్రదాయంప్రకారం చూసినా కూడా, విరమించిన సభ్యదేశప్రాంతీయంనుంచే మళ్లీ సభ్యత్వానికి ఎన్నిక, జరగటం ఆచారంగా వస్తూందని, దానికికూడా ఇది విరుద్ధంగా ఉందనీ వాదించాడు. అదే కాకుండా, యుగోస్లావియా, అమెరికా, ఇంకా ఇతరప్రతినిధి దేశాలూ కలిసి తెరవెనుక భాగవతం ఆడి, యుగోస్లావియాను భద్రతామండలికి ఈడ్వటంద్వారా, రష్యా యుగోస్లావియాల మధ్యగల అభిప్రాయభేదాలను స్వార్థప్రయోజనాలకై ఉపయోగించుకోటానికి చేస్తూన్నతంతు తప్ప, ఐక్యరాజ్యసమితికి తగినట్టి రాజమార్గం కాదని నిందించాడు. ఇప్పటికే ఈ సభ్యత్వాన్ని ఏమాత్రమూ గుర్తించబోవని స్పష్టం చేశాడు.

ఆమోదమును తెలుపవలెనని కాంగ్రెస్ కార్యవర్గము కోరినది. వీరు ఆమోదించిన, ఆతర్వాత పదిరోజులలోగా ఆంధ్రరాష్ట్రము రూపొంది రాజ్యాంగ చట్ట తృతీయప్రతిపాదనసమయములో రాష్ట్రముల జాబితాలో నమోదు జరుగవలసియుండును. ఈ కూడ నిర్ణయము జరగనిచో, ఆంధ్రరాష్ట్ర నామమును సవరణద్వారా చేర్చుటకు రచనాసంఘము సిద్ధముగ లేదు. క్రొత్త రాజ్యాంగముతోబాటు ఆంధ్రరాష్ట్రము అవతరించవలెనన్న, ఇప్పటి రాజ్యాంగవిధానములోనే రాష్ట్ర మేర్పడవలసియున్నది. నవంబరు 26 లోపుననే గవర్నరు జనరలు ఉత్తరువు ద్వారా ప్రత్యేకాంధ్రరాష్ట్ర మేర్పడవలసియున్నది. ఈయుత్తరువు, నాయకత్రయనివేదికను, రాష్ట్రప్రభుత్వ, ఆంధ్ర, తమిళ, రాష్ట్ర సంఘములు యథాతథంగా ఆమోదించుటలో తప్ప, లభించు సాధనము లేదు. అనగా చెన్నపట్టణముపై హక్కు ఆంధ్రులు వదులుకొననిగాని గవర్నరు జనరలు ఉత్తరువు లభ్యము కాదు. ఆంధ్రనాయకులు రాష్ట్ర ఇతర సరిహద్దులకన్న చెన్నపట్టణమువిషయముననే ఎక్కువ పట్టుదలగ నున్నట్లు కన్పించుచున్నది. చెన్నపట్టణము భవిష్యత్తు ఇంతతో తేలునది కాదు. ఒకనాడు తెలుగులపట్టణమే అయినను ఇప్పుడు బహుభాషాప్రాంత పట్టణము. చెన్నపట్టణమును ఛీఫ్ కమిషనర్ రాష్ట్రముగా చేయుటకు ఆంధ్రులు చాలమంది సుముఖులే. నవంబరు 26 లోపున ఆంధ్రరాష్ట్ర మేర్పడినను, ముందెప్పుడో వేరు రాజధానీనగర మేర్పడువరకును చెన్నపట్టణమే ఆంధ్రరాష్ట్రమునకు కూడా రాజధానీనగరముగ నుండక తప్పదు. ఆ రాజధానిని తెలుగువారు సమకూర్చుకొనులోపల చెన్నపట్టణముభవిష్యత్తుకూడ బహుభాషాయుతమైన ప్రజల అభిమతముప్రకారము పరిష్కారము కాగల అవకాశ మున్నది. ఆంధ్రకాంగ్రెస్‌సంఘము, కాంగ్రెస్ కార్యవర్గతీర్మానమును, ఈ దృష్టిలో పునఃపరిశీలన మొనర్చి తీర్మానించుకోవలసియున్నది. అట్టి నిర్ణయముపైననే ఆంధ్రరాష్ట్రనిర్మాణము ఆధారపడియున్నది. సాధ్యమైనంతత్వరలో ఈ నిర్ణయము జరుగుట అత్యవసరము.



భారతదేశానికి ఆర్థికసహాయం

అమెరికాలో పండిట్ నెహ్రూ అనేక వర్గాలవారిని కలుసుకొని భారతదేశానికీ అమెరికాకు మధ్య స్నేహబాంధవ్యాలను అన్నిరంగాలలోనూ ఇతోధికంగా వృద్ధిచేశారు. అమెరికన్ వాణిజ్యసంస్థలు పండిట్ నెహ్రూను స్వయంగా విందులిచ్చి, ఆయనతో ముఖాముఖి సంప్రదించ గలిగినతర్వాత భారతదేశం పరదేశాలనుండి సహాయం కోరుతూన్నవిధానానికి సంతోషమే వెలిబుచ్చసాగారు. న్యూయార్కు టైమ్సు పత్రిక పండిట్ నెహ్రూ విదేశీపెట్టుబడుల విషయంలో చేసిన వివరణలు, అమెరికన్ పెట్టుబడులు భారతదేశంలో ప్రారంభించటానికి చాలా ఉత్సాహం కల్గించేటట్లున్నాయని, తక్కినదేశాలుకూడా, నెహ్రూ ఆర్థికవిధానం అవలంబించటంశ్రేయస్కరమనీ అభినందించినది.

ప్రపంచబాంకు అధ్యక్షుడు యూజిన్‌బ్లాక్ భారతదేశానికి అంతర్జాతీయ నిధి సహాయం చేయటం కర్తవ్యధర్మం అని విశదీకరించాడు.

"ఎంతటి శక్తిసామర్థ్యాలుగల ప్రభుత్వమైనా భారతదేశం ఎదుర్కొన్న సమస్యల తాకిడికి ఒడిదుడుకైతూలిపోయేదే; అందులో పూర్వానుభవం ఏమాత్రమూ లేక కొత్తగా అధికారంలోకి వచ్చిన ప్రభుత్వంమాట చెప్పనే అక్కరలేదు. అయినప్పటికీ, అంతటి క్లిష్టపరిస్థితుల్లోకూడా, అంతటి కొత్తదైనా, భారతప్రభుత్వం, తన పాలనావ్యవస్థ విశ్లేథం కాకుండా, కాపాడుకొనివచ్చిందంటే, ప్రభుత్వ స్థైరసామర్థ్యాలు ఎటువంటివో, ప్రజలకు ప్రభుత్వమందున్న ఆదర మెంత గొప్పదో, సులభంగా ఊహించుకోవచ్చును.

విదేశీపెట్టుబడిని ప్రోత్సహించడంలో గల లాభాలను భారతప్రభుత్వం గ్రహిస్తూందనే నమ్మవచ్చును. విదేశీపెట్టుబడిదారులకు ఆకర్షణీయమైన సదుపాయాలు కూడా కల్పించగలట్టే ఉన్నది.

విదేశపెట్టుబడులను నష్టపరచటానికి భారతదేశం ప్రయత్నించటంలేదు. పైపెచ్చు, విదేశపెట్టుబడులకు రక్షణ కల్పించి ప్రోత్సహించటం తన అనుమతమని పండిట్ నెహ్రూ చాలా మాట్లు వివరించాడు.

భారతదేశ ఆర్థికపరిస్థితిని జాగ్రత్తగా కనిపెడుతూ, అవసరసహాయం చేయడానికి బాంకు (అంతర్జాతీయనిధి) ప్రయత్నించగలదు. బ్యాంకులో సభ్యులుగా ఉన్న దేశాలకు సలహాలు సహాయాలు ఇవ్వడం బ్యాంకువిధ్యుక్తధర్మం. ఇందులో గల కష్టనష్టాలు తక్కినవారితో ఏవేని ఉంటాయి. ఆమాత్రం సామాన్యంగా భారతదేశవిషయంలోనూ ఉండవచ్చును. కాని అవి సహాయం చెయ్యటానికి అడ్డురావు" అంటూ ప్రపంచబ్యాంకు అధ్యక్షుడు బ్లాక్, భారతదేశానికి తక్షణఆర్థికసహాయం చేయటం, బ్యాంక్ విధ్యుక్తధర్మమంటూ ఉద్ఘాటించాడు.

ఆ క్రిందినాడే, భారతదేశ ఆర్థికపునర్నిర్మాణంలో అమెరికా, ఆహార, యంత్ర సామగ్రుల సహాయంతో, చాలా ప్రముఖంగా తోడ్పడగలదని పారిశ్రామికుల సభలో పండిట్ నెహ్రూ వివరించారు.

"భారతప్రజలు తమ స్వాతంత్ర్య ఫలితాలను పొందటానికి ఎంతో త్వరపడుతున్నారు. వాటిని సాధించటానికై తమ జీవితశక్తుల నన్నిటినీ వెచ్చించి, నిర్మాణ కార్యక్రమం కొనసాగించటానికి సిద్ధంగా ఉన్నారు. కాని ఆహారం, యంత్రసామగ్రిసాంకేతిక సహాయం, అన్నవి లభించకపోతే అభివృద్ధి కుంటుపడక తప్పదు. ఈమూడింటినే అమెరికా సప్లయి చేయగలదు. వీటిని సప్లయి చేయటం కేవలం మాసహాయం కోసమే కాక, తమకుకూడా మేలుచేసుకోటమేనని అమెరికా గ్రహించాలి. భారతప్రభుత్వపారిశ్రామికవిధానం అనేకసార్లు స్పష్టంగా ప్రకటించబడ్డది. పెట్టుబడి భద్రంగా ఉండి లాభాలు తీసుకోవచ్చుననే నమ్మకం కలిగినప్పుడే విదేశీయులు పెట్టుబడులు పెడతారని గుర్తించి, దానికి కావలసిన సౌకర్యాలన్నిటినీ భారతదేశం సమకూర్చింది.

అమెరికా మాకు గోధుమలు సరఫరా చేయవచ్చును. రెండు మూడేళ్ళలో స్వయంపోషకత్వం మాకు సిద్ధించేదాక, గోధుమల్వనిలను అమెరికా మాకు సహాయం చేయవలెనని కోరుతున్నాం. నదీ ప్రాజెక్టులనిర్మాణానికి యంత్రసామగ్రి, సాంకేతికి నిపుణులను కూడా అమెరికా మాకు సహాయం చేసి మాకు తోడ్పడటం అవసరం. ఈ విషయంలో మేము అమెరికా సహాయానికే, ప్రపంచబాంకుసహాయానికన్నకూడా, ఎక్కువగా ప్రాధాన్యమిస్తున్నాము.

ఈ సహాయం కేవలం ఏకపక్షమాత్రంగా నిలచిపోతుందని భయపడనక్కరలేదు. ఇండియా అమెరికాల మధ్య ఆర్థికసహకారం స్నేహాలు ఉండటం, ఈ రెండుదేశాల పరస్పర శ్రేయస్సుకే కాక ప్రపంచాభివృద్ధికి కూడా చాలా అవసరం."

భారతీయప్రజలు యుద్ధసమయంలో బ్రిటన్, అమెరికాలకు ఆహారాన్ని, ఇతర అవసర పదార్థాలను తమ అవసరాలనుకూడా త్యాగంచేసి సప్లయిచేశారు. వాటితో ఇండియా తన కార్యక్రమాన్ని వృద్ధిచేసుకునేదే కాని అవసరమైనప్పుడు బ్రిటన్, అమెరికాలు సప్లయిచేయగలవన్న ఉద్దేశ్యంతో వారు త్యాగంచేశారు.

పెట్టుబడి, భద్రత, లాభాలకు అవకాశం ఉండకపోతే విదేశీయులు పెట్టుబడి పెట్టరని ఇండియా గుర్తించి అటువంటి హామీలన్నీ ఇచ్చి ఉన్నది. లాభాలన్నిటినీ డాలర్లలోకి మార్చుకొనటానికీ, పెట్టుబడులలో కొంత భాగాన్ని తరలించుకొనలాకికూడా మేము అనుమతి ఇచ్చి ఉన్నాం. ఈ అంశాలన్నిటినీ మా ప్రకటనలు స్పష్టం చేసినవి. అమెరికన్ పారిశ్రామికులు వాటిని తమకుతామే పరిశీలించుకోవచ్చును. ఇండియా అవసరాలను అమెరికా తీర్చే విషయమై సంప్రతింపులు జరపటానికి మేము సమర్థ రాజకీయవేత్తలను అమెరికాకు పంపిఉన్నాము. విదేశపెట్టుబడులపట్ల మేము విచక్షణ చూపించము. కాని సహజంగా దేశీయ పెట్టుబడులనే ప్రోత్సహిస్తాము.

భారతదేశం ఆహారంకొరకూ, ఇతర అవసరాలకొరకూ పోట్లాడవలసిన క్లిష్టసమయంలో భారతీయకార్మికులు మొత్తంమీద ప్రశంసనీయంగా ప్రవర్తించారని చెప్పవలసి ఉన్నది. కొందరు కార్మికుల ఐక్యతను నాశనంచేయ ప్రయత్నించారు. కాని పరిశ్రమలలో శాంతి కావాలన్న నా విజ్ఞప్తిని కార్మికులు పాటించారు. తాము ఉదారంగానే చూడబడ్డామని కార్మికులు గ్రహించారు.

నవల



రుద్రమదేవి

శ్రీ నోరి నరసింహశాస్త్రి

౧

"జయతి భగవాన్ స్వయంభూః
గణపతినృపతే ర్హృది స్థిత స్సతతమ్
యత్కారుణ్యకటాక్షైః
వృద్ధిం ప్రాప్తాంధ్రదేశశ్రీః"
(మల్కాపురశాసనమ్)

అది మహాలయ అమావాస్య!

ఆకాశము మేఘావృతమై యున్నది. సూర్యోదయమైనను భగవానుడు కనుపడియు కనపడకుండ నున్నాడు. వీరోత్సవములతో పొంగి పొరలుచుండు నేకశిలానగర మానాడు వర్షపాతమునకు బూర్వము గగనాంగనవలె పూర్ణగర్భిణియై యించుక మాంద్యము వహించియున్నది.

రాచనగరిలో మంగళతూర్యపంచకము అనుదినము ప్రాతస్సమయముల మ్రోయుచునే యున్నవి. కాని యిప్పటికి నెలనాళ్ళనుండియు నవి యెప్పటివలె దీర్ఘకాలము శ్రవణపర్వము చేయక ప్రారంభించిన యల్పకాలమునకె సమాప్తి నొందుచు ప్రస్తరింపని రాగస్వరమువలెను, విస్తరింపని వర్ణనవలెను, సవరింపని కావ్యమువలెను, వివరింపని కథావస్తువువలెను ఆనందదాయకములుగా లేవు. పైపెచ్చు అనిర్వాచ్య మగు నశాంతిని భయమును విను వారి కావేశింప జేయుచుండెను.

జన మందరికి మహారాజు నిత్యము దర్శన మిచ్చు నియమితవేళ ప్రాతఃకాలమున గలదు. అంతకు ముందుగనే పురజనులు రాజద్వార సమీపమున మూగుచు నిశ్శబ్దముగా తమ చూపులు రాజమందిరాట్టాలకమందలి గవాక్షముపై వ్యగ్రతతో నిలుపుచుండిరి. ఆ ప్రదేశములనుండి మహారాజు దర్శన మొసంగును. కాని యీ నెల రోజులనుండియు నాయట్టాలకమునుండి కాని గవాక్షమునుండి గాని ప్రజలకు మంగళప్రదమగు రాజదర్శన మగుటలేదు. అందుకు మారు రాజదూత యొకడచ్చట ప్రత్యక్షుడై దీర్ఘగంభీరస్వరముతో నిట్లు ప్రకటించుచుండెను:

"స్వస్తి. సమస్త పంచమహాశబ్ద మహామండలేశ్వర రాజ పరమేశ్వర ఉద్దండ దమండలాగ్ర ప్రచండ నెలవీడు గండభేరుండ హన్మంత శ్రీమన్ గణపతిదేవమహారాజులుంగారు అస్వస్థులైయుండి వారి వాత్సల్యప్రతివచనములు ప్రజలందరకు ఎరుక చేయమన్నారు."

అది యాలకించి ప్రజలు నిర్విణ్ణులై చింతాక్రాంతహృదయములతో వెనుదిరిగి పోవుచుండిరి. రోజులు గడచినకొలదియు నావేళకు చుట్టుప్రక్కల జనపదములనుండియు జనసమూహము లాప్రదేశమున జేరుచున్నందున నానాటికి జన మెక్కువగుచుండెను.

అందుకు ఈనాడు అట్లుచేరిన పౌరులయు జానపదులయు సంఖ్య యపరిమితముగా నున్నది. రేపటినుండి శరన్నవరాత్రోత్సవము ప్రారంభించును. నవరాత్రపూజాదీక్షితుడైన మహారాజుల దర్శించుభాగ్యమైనను మనకీ సంవత్సరము లభ్యమగునా, కాదా? నవరాత్రపూజ జరుపని మహారాజు రాజ్యమున మంగళము లెట్లు సమకూరును? ఆ కూడిన జనముల హృదయములలో నీప్రశ్నయే శల్యమువలె వేధించుచుండెను.

దూరదేశములనుండి సామంతులును మండలేశ్వరులును దండనాథులును రాజబంధువులును జేయు రాకపోకలవలన నానాడు రాజమందిరమున పరిశీలింపుచుండెను. తిక్కచమూపతి రాచనగరు విడుచుటయే లేదు. మహాప్రధానులగు శ్రీమన్ గోవిందనాయకుడు బయ్యనాయకుడు విశేషకాలము రాజమందిరముననే గడుపుచుండిరి. ఏకశిలాపురపాలకుడగు మేచయనాయకుడు శ్రద్ధపూని రాత్రింబవళ్ళు రాజమందిరమును భటసమూహములతో సంరక్షించుచుండెను.

ఈనాడుకూడ రాజదర్శనము కాలేదు. ఈనాడుకూడ రాజదూత మహారాజు నస్వస్థవార్త దీర్ఘగంభీరస్వరముతో ప్రకటించి మహారాజులు తమ ప్రజలకు బంపిన ప్రతిసందేశము నెరిగించెను.

ఆ సందేశము పూర్తియైనది. కాని జన మెప్పటివలె నంటనే జయజయనినాదములు చేయుచు కదలిపోలేదు. అసలు జయజయనినాదములే వారు చేయలేదు. కదలనేలేదు.

వారీనాడు సామాన్యప్రతివచనములు మాత ముఖమున వినుటకు రాలేదు. ఇందరు జనము నవరాత్రపూజావిశేషము లెరుంగవచ్చిరి. రాజమందిరమున పండుగ కాకున్న ప్రజలు పండుగ చేసికొనుట యెట్లు?

వారట్లొక్క గడియపాటు నీరవముగా నిలిచియుండిరి. ఐనను రాజమందిరమునుండి మరి ప్రకటన రాలేదు. అంతట నా మహాజనము నిరాశతో నిశ్శబ్దముగా విచ్చిపోసాగెను. అంతటి జనసమూహము విచ్చిపోవు కదలికవలన కలిగిన శబ్దమే నేల యురిమినట్లు భయంకర మంద్రఘోషమై కోటగోడల నెల్ల ప్రతిధ్వనింపజేసెను.

ఆ శబ్దమునకు అలకించెనో యన్నట్లు ఇంతలో రాజదూత మరల సౌధాట్టాలికమున ప్రత్యక్షమై ఆ సాయంకాలముననే మరియొక ప్రకటన మహారాజులు చేయింపగలరని తెలిపెను. విచ్చిపోవు చున్న జనులు వెనుదిరిగివచ్చి వ్యగ్రులై యాలకించి వికసించిన ముఖములతో నొకరి కొకరు చెప్పుకొనుచు జయ జయ యనినాదములు చేయుచు వెడలిపోయిరి.

శ్రీ కాకతిగణపతిదేవమహారాజునకు డెబ్బది యైదేండ్లున్నవి. ఈ వార్ధకములో నాతడిప్పుడు వ్యాధిపీడితుడై మంచముపట్టియుండెను. పాదములను ముఖమునను నీరు చూపినది. రాజవైద్యులు ఆయన నే మాత్రము కదలగూడదని నిషేధించిరి.


ఆ మహారాజు చిన్నతనమున పెక్కురాని కష్టము లనుభవించెను. కాకతీయుల కప్పటికి హనుమకొండ రాజధాని. దేవగిరియాదవరాజు దైతుగి దండెత్తివచ్చి హనుమకొండను ముట్టడించి గణపతిదేవుని తండ్రియగు మహాదేవరాజును సంహరించి చిన్నవాడగు గణపతిదేవుని బంధితుని గావించి దేవగిరికి తీసికొనిపోయెను. గణపతి యౌవనమంతయు దేవగిరి చెరసాలలోననే గడచిపోయెను. దేవగిరిలో నన్నయాపద పడకొండేండ్లు నాతడు మహాతపస్సు చేసెను. కులదైవత మగు హనుమంతుని ఇష్టదైవమగు శంకరుని ఆరాధించెను. కొంతకాలమున కాతని గుండెలో హృదయములోని క్రోధవహ్నిని కాలకంఠుడు గరళమునువలెనే దిగమ్రింగి యాదవరాజును శాంతపరచెను. దైతుగి కాతనిపై ననుగ్రహము కలిగి బంధవిముక్తుని జేసి యనుమకొండకు పంపివేసెను.

అత డట్లు స్వరాజ్యము ప్రాపించునాటికి విశాలాంధ్రాని యంతయు కల్లకల్లోలముగ నుండెను. అతని పెదతండ్రి రుద్రదేవమహారాజు దీక్షతో స్థాపించిన రాజ్యమంతయు భిన్నభిన్నమై యుండెను. సామంతులును మండలేశ్వరులును స్వతంత్రులైరి. అనురాతిలో కోటవంశీయులును నెలపట్టిలో నతవాడివారును సారసిపురమున కొలనినాయకులును గుడిమెట్టలో చాగివంశమువారును, కృష్ణానదీముఖద్వారమున అయ్యవంశీయులును పొత్తపి నెల్లూరుమండలములలో తెలుగుచోళులును పాదుకొని వారిలో వారు కలహించుచుండిరి. దానికి తోడుగా నీశాన్యమున కళింగగాంగులును ఆగ్నేయమున చోళులును రాక్షసమున హొయసలులును వాయవ్యమున యాదవులును విజృంభించి ఎవరి కందిన భూఖండములు వారు కబళించుచుండిరి. రేచర్ల రుద్రసేనాని మాత్రము నాగతిభూపాలుడు మొదలగు శత్రుల బారద్రోలి హనుమకొండ ప్రాంతమును శత్రువుల బారి పడకుండ సంరక్షించి గణపతిదేవున కప్పగించి కాకతిరాజ్యభారధౌరేయుడను సార్థకబిరుదము వహించెను.

అప్పుడు గణపతిదేవుడు చేయవలసినది విశేషముండెను. స్వతంత్రులైన సామంతులను శిక్షపరచుకొనవలెను. శత్రురాజు లాక్రమించిన రాజ్యభాగములు తిరిగి సంపాదింపవలెను. అన్నిటికంటె ముఖ్యమైనది, తన తండ్రిని జయించి వధించిన దేవగిరిరాజుపై కడుపులో దాచుకున్న పగ సాధింపవలెను!

గణపతిదేవుడు ఈ కార్యములు సాధించుటకు రుద్రదీక్షతో నుపక్రమించెను. దానికనుకూలముగ నా సమయముననే యాతనికి శ్రీ విశ్వేశ్వరశంభువుల దర్శనము ప్రాప్తించెను. శ్రీ విశ్వేశ్వరశంభువు ఉగ్రతపస్వి యగు శ్రీ ధర్మశంభువులకు కరకమలసంజాతుడు; 'పృథ్వీపాలానమకుటఘృష్టాంఘ్రికమలద్వయుడు; విద్యాశ్రీకలయకలనాకల్పకతరువు? యౌవన సంపదతో శివదీక్షాసంపద యేకమై దివ్యజ్యోతివలె ప్రకాశించు నా మహాయోగి యిహపర రాజ్యవిజిగీషు వగు గణపతిదేవుని నెంతయు నాకర్షించెను. కొలదికాలముననె యాతడా దేశి

(22 వ పేజీ చూడుడు)



ప్రధానామాత్యుడు, నెహ్రూ అమెరికా జాతీయ కళా ప్రదర్శనాలయంలో ఆయా కళాఖండాలను చూస్తున్న దృశ్యం. ఆ ఆలయ అసిస్టెంటు డైరెక్టరు మాగ్గిల్ జేమ్సు స్వయంగా వెంటవుండి ప్రధానామాత్యునికి అన్నీ చూపించారు.

"మా విప్లవం శాంతియుతము ప్రపంచశాంతికి అదే తరణోపాయము"

పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ

(కొలంబియా విశ్వవిద్యాలయంలో, 'డాక్టర్ ఆఫ్ లాస్' గౌరవబిరుదం అందుకొన్నప్పుడు చేసిన ఉపన్యాసం.)

"మీరు యేదో ఒక దేశంతోగాని, యేదో ఒక కూటమితో గాని, యెందుకు చేరరు? అని నన్ను చాలామంది ప్రశ్నించుతూ వున్నారు. ఈ తాటస్థ్యవిధానం గోడమీది పిల్లివాటంగా వున్నదని మరికొందరు విమర్శించుచున్నారు. ఈప్రశ్ననూ, ఈ విమర్శననూ తేలికగా అర్థంచేసుకోవచ్చును. ఏదైనా క్లిష్టసమస్య తటస్థించినప్పుడు దానిలో మునిగి తల మునకలౌతున్నవారు, ఎదుటివారు ఆ సుడిగుండంలో దూకిపోకుండా నిర్లిప్తులై నిలిచి వాస్తవిక దృక్పథాన్ని అవలంబించి ఆ సమస్యను అర్థంచేసుకోవటానికి పూనుకున్నప్పుడు, అలాంటివారిని, యుక్తాయుక్తవివేకం లేనివారినీ, దూరదృష్టిలేనివారనీ, నిజాయతీ లేనివారనీ, సమస్యనుంచి దూరంగా పారిపోవాలని చూస్తున్నారనీ, లేదా పిరికిపందలనీ, ఈరకంగా అనటం సహజం.

'భారతదేశం అనుసరించుచున్నది సమస్యనుంచి దూరంగా పారిపోవాలనే పిరికిపంద విధానం కాదు. నిర్జీవతాటస్థ్యం కాదు. భారతదేశం అత్యంతశక్తివంతమైన వాస్తవిక విధానాన్ని చేపట్టి నడుస్తున్నది. ఈ విధానం మహాత్ముని ధర్మసందేశాన్ని శిరసావహించి భారతదేశం సాధించిన స్వాతంత్ర్యసమరం యొక్క సహజపరిణామమే. అభ్యుదయపురోగమనాలకు శాంతి లభించి తీరవలెననేది, ఒక్క భారతదేశానికి సంబంధించిన విషయమే కాదు. విశ్వకల్యాణవిషయంలోకూడా, శాంతి లభించి తీరవలసిన అగత్యం వున్నది.

దౌర్జన్యానికి లొంగిపోవటంవల్ల శాంతి లభించదు - దుష్టత్వంతోనూ, అధర్మంతోనూ రాజీకి దిగినంతమాత్రంచేత శాంతి లభించదు. యుద్ధసన్నద్ధులు కావటంవల్ల శాంతి లభించదు.

"గత రెండు యుద్ధాల పరిణామాన్ని గుర్తించిన తరువాత ఈ గుణపాఠం మనం నేర్చుకోవలసివుంటుంది.

"సంఘర్షణ తొలగిపోవాలని మనం ప్రయత్నించుతున్నాము. ఈ ఆదర్శాన్ని సాధించేకోసం, ప్రపంచాన్ని ఇలా రెండు శత్రుకూటములలోనికి మోహరించటం కేవలం అవివేకం. ఇదే సర్వసంఘర్షణలకు అది ఆకారణమౌతుంది. ఈ కూటపు రాజకీయాలు లేనిపోని భయభ్రాంతులకు దారితీస్తాయి. భయభ్రాంతులైన మానవుల మనస్సులమీద అంధకారమావరించి తప్పుత్రోవలకు నడిపిస్తుంది. ఈ భయభ్రాంతిని నిర్మూలించటమే, భారతదేశం సాధించదలచిన ప్రధాన సమస్య. ప్రతివారూ యేదో ఒకపక్షాన్ని పూని యుద్ధోత్సాహాలతో ప్రసంగించితే, ఈ భయభ్రాంతి నశించదు. ఆ పరిస్థితిలో యుద్ధం తప్పని సరి అవుతుంది.

"మేము అనేక రాజ్యాలసమిష్టి కుటుంబంలోని సభ్యులం. ఆ సమిష్టికుటుంబంలోని సభ్యులుగా మాకు గల బాధ్యతలను మే మెప్పుడూ విస్మరించం. మాకు యిప్పుడు కావలసినదల్లా మా ఆర్థికస్థితిని చక్కబరుచుకుని, మా ప్రజల స్థితిగతులను బాగుచేసుకోవటం.

"మే మేదో, ఇతరులందరికంటే, సత్సంప్రదాయం కలవారమనీ, పవిత్రులమనీ చెప్పుకోవటం కాదు. మా బలహీనతలన్ని మాకు తెలుసు. మా తప్పులకుసులన్నీ మాకు తెలుసు. మా అపజయాలన్నీ మాకు తెలుసు. కాని ప్రస్తుతం ఈ నిర్లిప్తవిధానంవల్ల, మాకు లభించుతున్న ఈ ప్రయోజనసావకాశాన్ని మేము వ్యర్థంచేసుకోదలచలేదు.

"మే మీ నిర్లిప్తవిధానాన్ని అవలంబించటం, మా కొక్కరికేగాక, సమస్తమానవకోటికీ కల్యాణదాయకం కాగలదని నమ్ముతున్నాం. ప్రపంచశాంతి స్వాతంత్ర్యపరిరక్షణకు కారణభూతం కాగలదని విశ్వసించుతున్నాం.

'ఈ నిర్లిప్తత, సమస్యనుంచి పారిపోవటంగాని, నిర్లక్ష్యతగాని, తాటస్థ్యంగాని కాదు. మానవుని శాంతి స్వాతంత్ర్యములకు ప్రమాదం వాటిల్లినప్పుడు మేము తాటస్థ్యం వహించి ఊరుకోవటం అసంభవం. అలా చేయటానికి సావకాశం లేదు. చేయకూడదు. చేయం. అలా చేస్తే ఇంతకాలం మేము దేనికోసం పోరాడామో ఆ మహాదర్శాన్నే విస్మరించిన అవివేకుల మవుతాం.

"శాంతిని స్థాపించాలనే కృతనిశ్చయం మనకు వున్నట్లయితే యుద్ధసంరంభం ప్రభవించటానికి కారణభూతాలుగా వున్న కూకటివేళ్లేవి వున్నాయో వాటిని ఛేదించాలి. అంతేగాని బాహ్యచిహ్నాలు నరుక్కొని ప్రయోజనం లేదు.

"ఈ నవీనయుగంలో, యుద్ధప్రమాదం ప్రభవించటానికి మూలకారణా లేమిటి?

"మొట్టమొదటికారణం ఒకరు మరొకరిపైన పెత్తనం చేయటం, లేదా పెత్తనం చేయటానికి ప్రయత్నించటం. నిన్న మొన్నటిదాకా, ఆసియా ఖండంలో చాలా భాగం, విదేశాల ప్రధానంగా యూరప్ దేశాల పెత్తనం క్రింద వుంది. కాని అక్కడ స్వాతంత్ర్యపిపాస, జాతీయవికాసం, ప్రభవించటంతో ఆ సామ్రాజ్యాలన్నీ ముంపులలో లయించి కాలగర్భంలోకి నశించవలసివచ్చింది.

"ఇండోనీషియా త్వరలో స్వతంత్ర సార్వభౌమదేశంగా, ప్రభవించగలదని ఆశించుతున్నాము. ఫ్రెంచి ఇండోచైనా కూడా స్వాతంత్ర్యాన్ని సాధించుకుని, శాంతిని పొందగలదని నమ్ముతున్నాను.

"ప్రపంచంలో సగభాగాన్ని పాదాలక్రింద త్రొక్కి బానిసత్వంలో వుంచి, ప్రపంచంలో శాంతి లభించాలంటే, అసంభవమైన కార్యం.

'శాంతి లభించాలంటే ఇదేమీ గోట మీటివేయటానికి తగిన చిన్న సమస్య కాదు. కేవలం కాయితాలమీద జరిగేతీర్మానాలవల్లా పరిష్కారం జరగదు. పరిష్కరించితీరాలనే ఆత్మవిశ్వాసమూ నిజాయితీ వుంటేనేగాని శాంతి లభించటం అసంభవం.

"ప్రపంచంలోని కోటానుకోట్ల ప్రజానీకమనుభవించుచున్న దుర్భరదారిద్ర్యం యుద్ధానికి రెండవకారణం. ముఖ్యంగా ఆసియా ఆఫ్రికాలలోని స్థితిగతులు గమనార్హాలు. ఈ పాశ్చాత్యదేశాలలో యుద్ధంవల్ల కొన్ని బాధలూ ఇక్కట్లూ ఏర్పడినా, ఇక్కడి సామాన్య ప్రజలు కొంత సౌఖ్యంగానే బ్రతకటానికి సావకాశం వున్నది.

"ఆసియాఖండం నేడు నిద్రమేల్కొని, మహోజ్వలచైతన్యంతో ముందుకు సాగుతున్నది. ఆర్థికపరిస్థితుల నన్నిటినీ కూడదీసుకుని పురోగమించాలనే మహావేగంతో ప్రజానీకం ఉత్రూతలూగుతున్నది."

"ఈ మహాఖండం మేల్కొనటం మానవజాతిభవిష్యత్తుకు చాలా ప్రధానమైన విషయమని, దూరదృష్టితో రాజకీయవేత్తలంతా అర్థం చేసుకోవాలి."

"ఈ మేల్కొనటంచూసి, భయభ్రాంతి చెంది చూస్తూ కూర్చుంటే ఇందువల్ల ఉద్భవించే సమస్యలు పరిష్కారం కావు. మనకేం పట్టిందనుకుంటే లాభం లేదు. సన్నేహ సానుభూతులతో ఆ ప్రజలను అర్థంచేసుకోవాలి. వాస్తవికదృక్పథం ఏర్పడాలి. వాటిని పరిష్కరించాలనే కృతనిశ్చయం వుండాలి."

'పాశ్చాత్యదేశాలలోని ప్రజానీకానికి, కొంతవరకు, తిండీ, బట్టా, ఆశ్రయం వున్నాయి. ఈ జీవితావసరాలు ఇప్పుడు ఆసియాప్రజలకు లభించాలి. అలా లభించకపోతే, హతాశులై, విద్వేషాలు పెంచుకుని, విధ్వంసకరూపమైన క్రోధంతో విప్లవోన్ముఖులు కావటం జరుగుతుంది. మనకు శాంతి లభించాలంటే - రాజకీయబానిసత్వాలు నశించాలి - జాతీయనిమ్నోన్నతాలూ, ఆర్థిక నిమ్నోన్నతాలూ నశించాలి. దారిద్ర్యం నశించాలి. ఈ ఈతిబాధలనన్నిటినీ మనం నిర్మూలించాలి.

"వీటిని మనం మాపుచేయలేకపోతే, ప్రజలు ఇతర నినాదాలవేపు మొగ్గటం నిజం.

"ఒకొక్క దేశం, యుద్ధవ్యయంక్రింద, ఎన్నో సహజసంపదలనూ, ధనాన్నీ ధారపోస్తున్నది. వీటిలో యే ఈషణ్మాత్రమో, నిర్మాణాత్మకమైన యితర విధానాలలో ఖర్చుచేస్తే, ప్రపంచంలో శాశ్వతశాంతిసౌఖ్యాలు నెలకొనటానికి పునాది యేర్పడుతుంది.

"ఇది, భారతదేశంయొక్క అభిప్రాయాన్ని ప్రపంచంలోని స్త్రీ, పురుష విజ్ఞులందరి దృక్పథంలోనూ వుంచుతున్నాను. ప్రజాసామాన్యంయొక్క అభిలాషగా నివేదించుతున్నాను. ప్రపంచాన్ని ఎదుర్కొంటున్న



ప్రధానామాత్యుడు నెహ్రూ, అమెరికా నేషనల్ ప్రెస్ క్లబ్బువారు, తమ గౌరవార్థం ఏర్పాటుచేసిన విందులో ఉపన్యసించినప్పటి దృశ్యం. క్లబ్బు అధ్యక్షుడు జాన్ సి. ఓ. బ్రీన్, నెహ్రూ ఎడమచేతివైపున కూర్చుని వున్నారు.

స్వప్న సుందరి

శ్రీ పి. గణపతి శాస్త్రి

౧

(ప్రవేశిక - బృందగానం పాట)

వినండి! సహృదయులారా! ఈ కథ
వీనులార! ఒకమారు
అనంగ సుమాళి పడుగు పేకలై!
అల్లిన ప్రణయ ప్రతిసీర!
అనగనగా నొక రేడాతని నె
మ్మనమొక వలపుల యేరు!
వినండి! సహృదయులారా! ఈ కథ
వీనులార ఒకమారు!

పాట - బృందగానము

బ్రదుకొక పరిహాసముగా -
మెదలు వెలుగు నీడలల్లు మృదుగాథగ నె
మ్మది నెంచెడు సహృదయు లి
య్యది వినగా సవినయముగ నర్థింతు మిడే!
కలగాంచిన సుందరి క
న్నుల కెదురై నిలుచు నా మనోహర మూర్తో
జ్జ్వలవేళం జరిగిన యీ
వలపుల కథ లలితహాస బహుళము సుండీ!
తన చెలికి మోసమున నొక
వనితం బెండిలి యొనర్ప బ్రతిసేయంగా
మనుజేశున కొక పురుషుని
మనువున గూర్పంగ రాజమహిషి తలంచెన్
దేవి యొకరీతి దలపం
దైవమ్మొక రీతి దలచె దానం దీనం
మీవంటి వారి కింపుగ
నేవంవిధ కథకు గాళు లేర్పడె, వినడీ!

౨

(అమాత్య భాగురాయణుని రహస్యాలోచనామందిరము. అమాత్యుడు భాగురాయణుడు, అంతఃపుర పరిచారిక, కళావతీ మాట్లాడుకుంటారు.)

అమా : సరి! సరి! ఇది .ఇంతవరకూ వచ్చింది.

కళా : నేను తమతో ఇంక ఏమని విన్నవించుకోను! మహారాజులుంగారు నన్ననుగ్రహించి, నాకు అంతఃపురపరిచారిక లందరి మీదా అధికారం ఇప్పించిన విజయం...

అమా : అవునవును! విన్నాను! ఆ తరువాత.

కళా : అప్పటినుంచీ దేవిగారికి నామీద పూర్వంనించీ ఉన్న దయ తగ్గింది...ఇంక ఆ మేఖలసంగతి చెప్పనే అక్కరలేదు; తనకి రావలసిన అధికారంఅంతా నేనేదో అపహరించానని, నన్ను చూసినప్పుడల్లా కళ్లనిండా కారం పోసుకుంటూంది...ఇప్పుడు దేవిగారు, అది గీసినగీటు దాటటంలేదు.

అమా : ఏమయితే నేం! నువ్వు బాగా కోటలో పాగా వేశావు. ఇంక నిన్నెవరేం చెయ్యగలరులే!

కళా : ఏమో! ఏం చెప్పను! అస్తమానమూ, ఆ మేఖల నన్ను గురించి, ఆ దేవిగారి చెవిలో ఏవో నూరిపోస్తూనే ఉంటుంది. లేకపోతేనా తమ అనుగ్రహంవల్ల అంతఃపురపరిచారిక లందరి మీదా, అధికారిణి నయ్యానని ఎగిరి గంతులు వేస్తూ ఉందును. తమరు కొంచెం కటాక్షించి, మేఖలను బాగా మందలించాలి.

అమా : నే నుండగా నీ కెందు కీ భయం! అన్నట్టు అంతఃపుర విశేషా లేమిటి? కళావతీ!

కళా : అయితే తమరు విన లేదా!

అమా : ఏమిటి?

కళా : ఈ మధ్యను లాటరాజధానిమీదకు శత్రువులు దండెత్తి వస్తున్నారని తెలిసిందట. వెంటనే దేవిగారి పినతల్లి గారు, తారావళీ అమ్మగారు, దేవిగారికి సందేశం పంపించారట! అది విన్నప్పటినించీ దేవిగారు చాలా కలతచెంది ఉన్నారు.

అమా : ఓహో! అల్లాగా? ఎంతపని జరిగింది?

కళా : మేము ఈ విషయాలన్నీ తమకు సరికొత్త సంగతుల్లాగ మనవి చేసుకుంటూ ఉంటాము. చారనేత్రాలతో తమరు ఇవన్నీ—ఇదివరకే...

అమా : లేదు, లేదు కళావతీ! మా కీ విషయం కించిత్తూ తెలియదుసుమా!

కళా : ప్రభూ! తమ దర్శనానికి మేఖల వస్తూన్నట్లుంది. మరి నాకు-అనుమతి...

అమా : భయంలేదులే! అన్నట్టు-శత్రువుల దండయాత్రమాటేనా నువ్వు అంటున్నది?

కళా : అవును. ఇంకా దానికీ మించిన రహస్యా లున్నాయా?

అమా : ఉన్నాయి. లాటరాజాంతఃపురం సంగతి నీకు తెలియదా ఏమిటి?

కళా : నేను వినవచ్చునా?

మంత్రి : అసలు ఈ నాటకాని కంతటికీ నీవే సూత్రధారిణివి. నీకే తెలియకపోతే ఎలాగ? లాటరాజధానిమీదికి శత్రువులు దండెత్తి రావడానికి కారణం కూడా ఇదే!

కళా : అదే అంతఃపురరహస్యం అంటారా?

మంత్రి : అవును. లాటరాజసంతానాన్ని వివాహమాడినవారికి సార్వభౌమత్వం వస్తుంది.

కళా : అయితే లాటరాజుకి కుమార్తె అయినా కుమారుడయినా ఆ మృగాంక వర్మే గాడూ.

మంత్రి : ఆఁ! అదే పరమరహస్యం. క్రమంగా తెలుసుకుంటావు.

కళా : పరమరహస్యం నాకెందుకు గాని మన మహారాజులుంగారు సార్వభౌము లెప్పు డవుతారు? మరి!

మంత్రి : అది నీ చేతుల్లోనే ఉంది.

కళా : నా చేతుల్లోనా!

మంత్రి : అవును. నీ చేతుల్లోనే! మహారాజులుంగారు సార్వభౌము లయ్యేది. సేనా నాయకత్వం వహించి యుద్ధాలు చెయ్యడంవల్ల కాదు.

కళా : మరి దేనివల్ల?

మంత్రి : దక్షిణనాయకత్వంవల్ల.

కళా : అలా అయితే క్షణంలో అయినా రన్న మాటే! మరి సెలవు.

అమా : వెడుతున్నావా! ఉండు! నీవు మేఖలకు ఎంతమాత్రమూ కనబడకుండా వెళ్లాలిసుమా! ఇదిగో - ఒక్కమాట! ఇది మూడోకంటివాడికి తెలియకూడదుసుమా!

కళా : ముక్కంటికి కూడా తెలియదు ప్రభూ! ఈ పరిచారికని తమ ఎదట ఆత్మశ్లాఘ చేసుకోమంటారా!

అమా : (రహస్యంగా) అసలు కథ యిది!

కళా : చాలా చిత్రంగా ఉందే!

అమా : జీవితమే ఒక చిత్రము! ఇందులో ఇంకా చిత్ర మేమిటి?

కళా : (రహస్యముగా) ఆ తరవాత?

అమా : ఆ తరవాత ఈ దండయాత్ర!...... ఇదీ విషయం తెలిసిందా? అంతా నీ చేతిలోనే ఉంది సుమా! మంత్రాంగం సానుకూలపడితే నీకు మంచి ముత్యాలహారం!

కళా : మహామాత్యుల కరుణాకటాక్షమే నాకు మంచి ముత్యాలహారమయితే ఇంక మిగిలిన వాటితో—

అమా : మంత్రాంగంలోనే గాక మాటల్లో గూడ గట్టిదానవే!

ద్వారపాలిక : (ప్రవేశించి) దేవిగారి పరిచారిక మేఖల తమ దర్శనార్థం ద్వారంవద్ద వేచి ఉన్నది.

అమా : కళావతీ! తొందర లేదు. కాస్త జాగ్రత్తగా ఈ ద్వారంనించి వెళ్లు. జాగ్రత్త సుమా! కాలు జారితే మరి గంగాప్రవేశమే.

కళా : ఎంతమాట సెలవిచ్చారు!

(నిష్క్రమణ.)

మేఖల : (ప్రవేశించి) అమాత్యులవారికి - అనేకసహస్రప్రణామములు!

అమా : శీఘ్రమేవ కళ్యాణపరంపరా ప్రాప్తిరస్తు!

మేఖల : తమ అనుగ్రహం తప్పినప్పుడు ఎన్నివిధాల ఆశీర్వదిస్తే ఏమి ఫలితము.

అమా : చిత్రం, నా అనుగ్రహం తప్పడమేమిటి? మమ్మల్ని అందరినీ అనుగ్రహించే దేవిగారే నీకు పట్టుగొమ్మగా ఉన్నప్పుడు!

మేఖల : పోనీయండి, మీ సమక్షాన నోరు మెదపడానికి నేను ఎంతటిదాన్ని! శ్రీ రత్నసుందరీదేవిగారు తమ కీ సందేశం వినిపించమన్నారు!

అమా : (అతివినయంతో) శ్రీ దేవిగారు ఏమని ఆనతిస్తున్నారు!

మేఖల : శ్రీ దేవిగారు - తమ ఫాలఫలకంపైన పద్మసమానమైన అంజలిబంధం పట్టి, తమ కీ విధంగా విన్నవించుకుంటున్నారు. లాటరాజధానినుంచి, మా పినతల్లిగారు, తారావళీదేవిగారు వార్త పంపించినారు. మహారాష్ట్ర ప్రభువు ప్రచండసైన్యంతో దండెత్తి వస్తూన్నట్లు వార్త వచ్చిందట! మహామాత్యులు తక్షణమే లాటరాజధాని రక్షణకై తగిన సైన్యం పంపవలసిందని కోరుతున్నాము.మరిన్నీ, పిన్నవారైన శ్రీ మృగాంకవర్మ యువరాజులుంగారు, ఇంకా మిగిలిన బాల వృద్ధులు సురక్షితంగా మన రాజధాని చేరుకునేటట్లు చెయ్యవలసింది. ముఖ్యంగా యువరాజులుంగారి రక్షణవిషయంలో శ్రీ దేవిగారు చాలా వ్యగ్రచిత్తంతో ఉన్నారు.

అమా : మేఖలా! దేవిగారు సిద్ధసంకల్పులు సుమా!

మేఖ : ఎందుచేతనో!

అమా : వారికి సవినయంగా నే నీ విధంగా విన్నవించుకుంటున్నానని చెప్పు! మాకు చారులవల్ల ఇదంతా పూర్వమే తెలిసింది. ఇంతకు పూర్వమే లాటరాజధానిరక్షకై బలాలు పంపించాము. మరిన్నీ, మృగాంకవర్మ యువరాజులుంగారు, ఇంకా మిగిలినవారు, ఇక్కడికి సురక్షితంగా చేరుకునే ఏర్పాటులన్నీ చేశాము. వారీ పాటికి ఇక్కడకు చేరుకునే ఉంటారు. వారికి రాజప్రాసాదానికి సమీపంలో ఉన్న రత్నప్రాసాదంలో విడిది ఏర్పాటుచేశాము. లాటరాజధానికి గూడా ప్రస్తుతం ప్రమాదం తప్పినట్టు తెలిసింది.

మేఖల : అమ్మయ్య ఈ వార్తలు వింటే దేవిగారికి పంచప్రాణాలు లేచివస్తాయిగదా!

అమా : అయితే శీఘ్రంగా వెళ్లి నా మనవి వారికి విన్నవించు.

మేఖల : మహాప్రసాదము! (నిష్క్రమణ)

(అంతఃపురోద్యానవనం - అప్పుడప్పుడు చిన్న చిన్న పక్షుల కోలాహలంలో దూరాన్నించి పాట వినిపిస్తుంది. రాజు, అతని మిత్రుడు విదూషకుడు నారాయణుడు, ఆప్రాంతాలనే విహరిస్తూంటారు.)

పాట

నిమిషమైన నిను విడువలేను - నెర
నీటుకాడ! నీ వల జిక్కితి లేరా!
నీళ్లకేగ నీపై వలపున క
న్నీళ్ల కడవయే నిండెగదరా!
మత్తు నిదుర నే కలవరింప మా
యత్త యెరిగి, నను తిట్టి కొట్టె రారా!
ఏల గంటి, ని న్నేల వలచితిని!
జాలిమాలి, శిలవోలె పలుకవేరా!......

[నిమిష మైన

(రాజు, నారాయణుడు, ఉద్యాన వనంలో ప్రవేశిస్తారు.)

రాజు : నారాయణా! ఎవ రా పాట!

విదూ : వయస్యా! ఉండు. ఒక్కనిమిషం ఆగు!

(మళ్లీ పాట వినిపిస్తుంది—'ఏలగంటి ని న్నేల వలచితిని, జాలిమాలిశిలవోలె పలుకవేరా.') నీ కింకా తెలియలేదు.

రాజు : ఇంకా స్పష్టంగా అవగతం కాలేదు.

విదూ : ఇంకా కనుక్కోలేవు, మేఖల! - వయస్యా! అబ్బా! ఈ మేఖలతో వేగలేకుండా ఉన్నానోయి బాబూ!

రాజు : ఏం! అది ఏమి చేసింది నిన్ను!

విదూ : ఏమి చెయ్యడమేమిటి? అస్తమానమూ నన్ను, వెంటాడించడమే దానిపని! దేవిగారికి నీమీద ఈ మధ్య చాలాగట్టి అపనమ్మకం ఏర్పడింది. దేవిగారు దీన్ని నీమీద, నామీద, గూఢచారిణిగా ఏర్పాటుచేసినట్టు తోస్తుంది.

రాజు : నారాయణా! ఊరికే ఉత్తపుణ్యానికి ఎందుకీ అనుమానం దేవికి నామీద!

విదూ : వయస్యా! ఆ విషయం. చెప్పమన్నావా?

రాజు : చెప్పు! నాదగ్గర దాపరికమెందుకు?

విదూ : వయస్యా! ఈ చలికాలంలో మానవ మాత్రుల్ని ఎవర్నీ నమ్మడానికి వీల్లేదుగదా! తత్రాపీ, నీసంగతి బాగా తెలిసిన దేవిగారు, నిన్ను ఎలాగ నమ్మగలదు? చెప్పు!

(సంగీతం అస్పష్టంగా వినబడుతుంది)

ఉండు, ఉండు, మళ్లీ మేఖల ఏమో పాడుతూన్నట్టుంది!

పాట

నీతి సమిధలు కాల్చి! నియమాలు ముట్టించి
చలివేళ, వలపు, వెచ్చని మంట రగిలించె!
చెలికాడ! వేవేగ! చలి కాచుకొనరమ్మ!
వెలలేని వయసు! మాటల వమ్మసేయకుము!
అధరామృతమ్మ! మధు మధురమై రేయమ్మ
మధియించి, మహిత జీవధనమ్మె దోచెదము
కనలేనివారు పలికినది! రేపను పదము
వినుము, కవిసూక్తి యీ క్షణమొక్కటే నిజము
చెలికాడ! వేవేగ చలికాచుకొనరమ్మ!
వెలలేని వయసుమాట వమ్మసేయకుము!

విదూ : విన్నావా! వయస్యా!

రాజు : వింటున్నాను - వింటున్నాను!

విదూ : ఏమంటావు!

రాజు : అనడాని కేముంది. ఎక్కడో గుండె గాయపరచుకొన్నట్టుంది పాపం!

విదూ : 'పాపం' అని జాలిపడుతున్నావా, దానిమీద!

రాజు : ఏమిటి! నువ్వు మేఖలపేరు చెప్పేసరికి నల్లేరుమీద బండి వెళ్లినట్టు వెడుతున్నావేమిటి!

విదూ : అది రోజూ నన్ను పెడుతూన్న తిప్పలు నీ కేమి తెలుసును!

రాజు : ఏం చేస్తూందేమిటి?

విదూ : ఏం చేస్తూందా? మనం అనుకునే మాటలన్నీ అక్కడా అక్కడా పొంచుండి, విని నెమ్మదిగా దేవిగారికి చేరవేస్తూంది. దేవిగారు, నిన్నేమీ అనలేక ఆ కోపం అంతా నామీద చూపిస్తున్నారు. ఈ మేఖల పని నేను పడతానులే.

రాజు : నారాయణా! దేవికి మేఖల అంటే ప్రాణంగదా! ఆమె దానిమీద ఈగైనా వాలనిస్తుందా!

విదూ : సరే! ఇందులో దేవిగారే జయిస్తారో! నేనే జయిస్తానో చూద్దువుగాని.

(20-వ పేజీ చూడుడు)

ఇబ్బందు లన్నిటినీ సమగ్రంగా యోజించి ఏకైకసంతరణమార్గమనే విశ్వాసంతో కృత పరుచుకున్నాను. అంతేగాని ఇందులో స్వాభిలాష రవ్వంతైనా లేదు.

'మీవి మాకంటే, ఎంతో అనుభవం గడించుకుని అభివృద్ధిలోవున్న దేశాలు. మీకు లేనిపోని సలహా లివ్వటం నా ఉద్దేశం కాదు. కాకపోతే, భారతస్వాతంత్ర్యసంగ్రామంలో అహింసా విధానాన్ని అవలంబించి మహాత్ముడు సాధించిన విజయాన్ని యెత్తిచూపటం వొక్కటే నా పరమాభిలాష" అన్నారు.

నేటిప్రపంచం:

పండిట్ నెహ్రూ, అమెరికా సందర్శనోద్దేశం

★

భారత ప్రధానిపండిట్ జవహర్లాల్ నెహ్రూ ఉత్తరమెరికా సందర్శనం దిగ్విజయంగా కొనసాగుతున్నదని దేశమంతా ఆనందోత్సాహాలలో మునిగిఉంది. కెనడాలో రాజకీయ వేత్తలు, నాయకులు, ప్రభుత్వం ఆదరప్రేమలతో నెహ్రూను ఆహ్వానించారు. కామన్వెల్తు ప్రధానుల సమావేశంలో నెహ్రూపాత్ర నెరిగిన కెనడాప్రభుత్వనాయకులు నెహ్రూ మైత్రి మూల్యాన్ని గ్రహించి, భారతదేశంతో సహకారం నెరపగలరని వాగ్దానా లిచ్చారు.

జగద్విఖ్యాతిపొందిన చికాగోనగరం పండిట్ నెహ్రూకు అఖండసన్మాన మిచ్చింది. మన దేశంలో హైడ్రో ఎలక్ట్రిక్ ప్రాజక్టులకు ఒక రీతిగా మార్గదర్శియైన టెన్నెసీవాలీ ఆధారిటీ తంత్రాన్ని పండిట్ నెహ్రూ పరిశీలించారు.

భారతప్రభుత్వ విదేశాంగ నీతి:

పండిట్ నెహ్రూ అమెరికా సందర్శనోద్దేశంగురించి అమెరికన్ పత్రికలు అనేకరీతుల ఊహాగానం చేశాయి. కొలంబియా విశ్వవిద్యాలయంలోనూ, చికాగోసన్మానసందర్భంలోనూ పండిట్ నెహ్రూ భారతప్రభుత్వ విదేశాంగవ్యవహారనీతిని వివరించారు. భారతదేశం రష్యా అమెరికాల తగవుల్లో జోక్యం కలుగ చేసుకోజాలదని స్పష్టపరిచారు. కాని దురాక్రమణను భారతదేశం ప్రతిఘటించగలదు. భారత దేశం ఆర్థికసమస్యలకే యావచ్ఛక్తినీ వినియోగించవలసి ఉంటుంది. యుద్ధానంతరం చీనా జాతీయప్రభుత్వం విదేశాంగవ్యవహారాల్లో పూర్తిగా అమెరికాఅడుగుజాడల్లో నడిచింది. అమెరికా ఆర్థిక సహాయమంతా కమ్యూనిస్టులపై యుద్ధంలో నేలపా లయింది. చీనా దేశీయ ఆర్థిక వ్యవస్థ మళ్లీ కొంత మారిపోయింది. చివరికి చీనా కమ్యూనిజం విజృంభణకు సుక్షేత్రమయింది.

పశ్చిమ యూరప్‌లో అమెరికా ఆర్థికసహాయం పరిశ్రమాభివృద్ధికి తోడ్పడిన కారణంగా కమ్యూనిజం నిరోధింపబడిందని ప్రాశ్చాత్య వర్గం అంచనా వేసింది.

అయితే అంతర్జాతీయ వ్యవహారాల్లో పశ్చిమ యూరప్ దేశాలన్నీ అమెరికానే అనుసరిస్తున్నాయి. కాని ఆ దేశాల పరిశ్రమాభివృద్ధికి కమ్యూనిస్టులపట్ల విరోధం ఆటంకపడకుండా జాగ్రత్త వహించారు.

ఆసియా అంతటా అలముకున్న ఆర్థిక సంక్షోభం నివారణయితేగాని కమ్యూనిజాన్ని అరికట్టడం అసంభవమని చీనాఅనుభవంతో అమెరికాకు తెలిసివచ్చింది. ప్రపంచంలో యుద్ధం తరవాత ఆర్థికంగా బలపడి అన్యదేశాలకు సహాయం చెయ్యగలిగిన దేశం అమెరికా ఒక్కటే. కమ్యూనిస్టులపట్ల ప్రబల విరోధం వహించని కారణంవల్ల నైతేనేమి, శ్వేతవర్ణులపట్ల భారతీయులకు గల అవిశ్వాసంవల్ల నైతేనేమి భారతదేశ ఆర్థికాభివృద్ధికి అమెరికా ఇంతవరకూ వీసమైనా తోడ్పడలేదనే చెప్పాలి. కాని చీనాపతనంతో ఆసియాలో కమ్యూనిజం ధాటికి నిలవగలదేశం భారతదేశ మొక్కటే. కాని అమెరికన్ ప్రజలకు ఆసియావాసులపట్ల ఇంతవరకూ పూర్తిగా సుహృద్భావం కలదని చెప్పడం కష్టం. అమెరికాకు వలసపోయే వారిలో ఆసియావాసులపట్ల అన్యాయంజరుగుతూ వచ్చింది. అమెరికాలో వర్ణద్వేషం ఇంకా ప్రబలంగా ఉందని అందరికీ తెలసిన విషయమే. అమెరికాలోకి వలస రాగోరిన ఆసియావాసులపట్ల అమెరికన్ ప్రజల వైఖరి తెలియగోరినవారికి సెల్లర్ తీర్మానంగతే నిదర్శనం. అప్పటినుంచీ అమెరికన్ కాంగ్రెస్‌ను భారతదేశవాసులపట్ల సముఖం చెయ్యడానికి ప్రజలనాయకులు, ప్రభుత్వవర్గం చేస్తున్నకృషి అంతగా ఫలించలేదు. ఈనాడు మిగిలిన భారత దేశాన్ని ఆర్థికంగా బలపరిచి కాపాడుకోజాలని పక్షంలో అంతర్జాతీయవ్యవహారాల్లో అమెరికాకూ పశ్చిమ యూరప్‌కూ రాగల ప్రమాదం అపారం.

ఇంతవరకూ యూరప్‌లోగాని ఆసియాలోని ఏదేశంలోగాని, (ఉ॥ చీనా ఆరబ్ దేశాలు) అమెరికన్ పారిశ్రామికదారుల పెట్టుబడి ఉన్న చోటనే అమెరికన్ ప్రభుత్వం శ్రద్ధ వహించ గలిగింది. అమెరికన్ పెట్టుబడి లేని దేశంపట్ల అమెరికన్ కాంగ్రెస్ ఎప్పుడూ ఉదాసీనంగానే ఉంది.

ఇప్పుడు భారతదేశాన్ని కమ్యూనిజం వాత పడకుండా సుస్థిరపరుచుకోవాలంటే అమెరికన్ ప్రభుత్వం ఆర్థికసహాయం ఇచ్చేముందు అమెరికన్ పారిశ్రామికవాదుల్నీ, పెట్టుబడిదారుల్నీ, తద్వారా అమెరికన్ కాంగ్రెస్‌నీ కూడగట్టుకోవాలి. పండిట్ నెహ్రూ సామ్యవాదియనీ, పాశ్చాత్య పారిశ్రామికదారుల నెప్పుడూ అనుమానంతో ఒక కంట కనిపెట్టి ఉంటాడనీ, నెహ్రూపరిపాలనలో విదేశ పారిశ్రామిక పెట్టుబడివారులకు క్షేమం లేదనీ అమెరికాలో ఒక అభిప్రాయం బలపడిపోయిఉంది. ఈ అభిప్రాయాన్ని తొలగిస్తేగాని అమెరికన్ ప్రభుత్వం ఏమీ చెయ్యలేదు. అందువల్ల అమెరికా పండిట్ నెహ్రూతో స్వయంగా పరిచయం ఏర్పరచుకొని, నెహ్రూ ప్రభుత్వ విధానాన్నీ భారతదేశసమస్యల్నీ అర్థం చేసుకోడానికి అవకాశ మివ్వబడింది. భారతదేశ స్వాతంత్ర్యసమరవీరుడనీ, అమెరికన్ జాతీయ వీరులపట్ల భక్తి, శ్రద్ధలు గలవాడనీ, అమెరికన్ ప్రజాస్వామ్యంపట్లనూ వ్యాపార స్వేచ్ఛావిధానంపట్లనూ ఆదరాభిమానాలు కలవాడనీ నిరూపించడానికి అవకాశం ఇవ్వబడింది. పండిట్ నెహ్రూ అమెరికాసందర్శనం ఈ విషయంలో జయప్రదమైనదని నిస్సంకోచంగా చెప్పవచ్చును. అమెరికా జాతీయస్వరూపాన్ని పండిట్ నెహ్రూ సాక్షాత్కరింపచేసుకొన్నాడు. అమెరికన్ ప్రజానీకం పండిట్ నెహ్రూ తమకు మిత్రుడేగాని శత్రువు కాడని గ్రహించింది. భారతదేశ కామన్వెల్తు సభ్యత్వంకూడా ఇందుకు తోడ్పడిందని చెప్పాలి.

అయితే ఉభయులూ పూర్వదోషాల్ని గుర్తించారుకూడా. ప్రపంచరాజ్యాలలోని కమ్యూనిస్టురాజ్యవర్గంతో ప్రత్యక్షవిరోధం సాగించి భారతదేశం కార్యసాధన చెయ్యడం అసంభవం. ప్రపంచవర్గవైషమ్యాలలో తలదూరిస్తే, భారతదేశాన్ని తక్షణసమస్యలు బలి తీసుకొనక విడిచిపెట్టవు. దురాక్రమణశక్తుల్నీ ఆంతరంగిక విచ్ఛిన్నశక్తుల్నీ నిర్జించడానికి వెనుకాడదుకాని భారతదేశం అన్యదేశాలలో ఏవర్గంతోనూ ప్రత్యక్షవిరోధం తెచ్చిపెట్టుకోజాలదని పండిట్ నెహ్రూ స్పష్టపరిచారు. ఈ వివరణను అమెరికన్ పత్రికలు హర్షించాయి.

ఈ సందర్భంలో న్యూయార్కు హెరాల్డ్ ట్రిబ్యూన్ సంపాదకీయం గమనించతగినది: "అమెరికా సందర్శన సందర్భంలో భారత ప్రధాని తన ఉపన్యాసాలలో కమ్యూనిస్టుల్ని తీవ్రంగా విమర్శించ లేదన్న మాట నిజమే. దీనివల్ల కొందరు అమెరికన్ అంతర్జాతీయ రాజకీయ విమర్శకులకు తృప్తి కలగదు. ఈవిషయాన్ని జ్ఞప్తిలో ఉంచుకునే, చికాగో ఉపన్యాసంలో సోవియట్ రష్యాలో వ్యక్తిగత స్వాతంత్ర్యం పూర్తిగా లోపించిందని నెహ్రూ విమర్శించి ఉండాలి.

"భారతదేశంలో ప్రబల విరోధులైన కమ్యూనిస్టుల ఆరాచకాల్ని అణచడానికి అతికఠిన చర్యలు తీసుకోడానికి పండిట్ నెహ్రూ వెనుకాడలేదు.

"స్వదేశంలో కమ్యూనిస్టులపట్ల వహిస్తున్న వైఖరికీ, విదేశాలలో ఉపన్యాసాలలోని అప్రమత్తతకీ ఎంతో భేదం ఉంది. దీనికి కారణం ఏయుద్ధంలోగాని, సామాన్యరాజకీయ వైషమ్యాలలోగాని తలదూర్చడానికి భారతదేశాని కిష్టం లేక పోవడమేనని చెప్పాలి.

"వాస్తవంగా యుద్ధం వచ్చే పక్షంలో భారతదేశం కేవలం దాస్య మనస్కతతో పాశ్చాత్యవర్గానికి లోబడిపోయిందని అనిపించుకోడానికి బొత్తిగా ఇష్టం లేదనే విషయం పండిట్ నెహ్రూ ఇచ్చిన కొన్ని ఉపన్యాసాలలో గోచరమౌతున్నది. దీనికి హేతువు భారతదేశం పరిష్కరించుకోవలసిన ఆంతరంగిక సమస్యలకోసం దేశంలో శాంతి అవసరం.

"రాజకీయపరిస్థితులు, ఆర్థికపరిస్థితులు ఎలా ఉన్నప్పటికీ భారతదేశంలో పాశ్చాత్య ప్రజాస్వామ్య ప్రభుత్వాలపట్ల గౌరవాసక్తులు ఇనుమడిస్తున్నాయన్నమాట రూఢి. ఉత్తమ ప్రజాస్వామ్యాదర్శాలపట్ల భారతీయుల శ్రద్ధ అధికమౌతున్నది.

"ప్రపంచ రాజకీయాల్లో భారతదేశం ఇరుపక్షాలలోనూ చేరకుండా గోడమీద పిల్లివాటముగా కూచుంటుందని ఎవరైనా భారత నాయకులు చెప్పినప్పటికీ, భారతదేశపరిస్థితిని సమగ్రంగా అవగాహన చేసుకుని చూసినట్లయితే ఎట్టి సంశయానికీ తావులేదనీ, భారతదేశం పాశ్చాత్య వర్గపక్షమే అవలంబిస్తుందనీ ఘంటాపథంగా చెప్పవచ్చును."

దీనివల్ల పండిట్ నెహ్రూ అమెరికా సందర్శనోద్దేశం నెరవేరిందని చెప్పవచ్చును.

అమెరకన్ ప్రజల సంకోచాలను తీర్చి

(21 వ పేజీ చూడుడు)



న్యూయార్కులో సిటీహాల్ వెలుపల పండిట్ నెహ్రూ

విదేశవిఖ్యాత ఆంధ్రమహాపురుషుడు

డాక్టరు జ్ఞానానందస్వామి

శ్రీ గోపరాజు వెంకటానందం

మన ఆంధ్రదేశంలో విదేశవిఖ్యాతి పొందిన ఆంధ్రమహాపురుషులు చాల అరుదు. అట్టి మహాపురుషులలో డాక్టరు జ్ఞానానందస్వామి ఒకరు. ప్రస్తుతం ఈయన స్వతంత్రభారత దేశంలో కేంద్రప్రభుత్వంయాజమాన్యమున నడుపబడుతూన్న "నేషనల్ ఫిజికల్ లేబరేటరీ"యొక్క యాటమిక్ డిపార్టుమెంటు (పరమాణుపరిశోధనశాఖ) అధికారిగానూ, సీనియర్ సైంటిఫిక్ ఆఫీసరుగానూ యున్నారు.

ఆగర్భశ్రీమంతుడైన ఈ మహావ్యక్తి సిద్ధారుని వలె సుఖభోగములన్నియు కాలదన్ని పిన్నవయస్సుననే దేశాంతరుడై భగవత్ చింతనములో మునిగి సదా దీర్ఘాలోచనపరుడై ఎన్నియో శ్రమలకోర్చి ఆధునికయుగమునకు సంబంధించిన ఒక నూతనసందేశమును బయటపెట్టెను.

జ్ఞానానందస్వామి అను పేరు ఆశ్రమస్వీకారము చేసినతరువాత పొందిన నూతన నామధేయము. సాధారణముగా సన్యాసాశ్రమము స్వీకరించిన యిట్టి వ్యక్తులు పూర్వాశ్రమములోని తమ పుట్టుపూర్వోత్తరములు చెప్పుటకును, వినుటకును, అంగీకరించనందున ఇచ్చట వారి పూర్వాశ్రమవివరములు పేర్కొనుట భావ్యముగాదు. అదీగాక, మహాపురుషు లెప్పుడును బహిరంగంగా గాకుండా అజ్ఞాతయుతంగా తమ జీవితమును గడపడంలోనే ఎక్కువ ఆనందించగలరు. ఇట్టి మహాపురుషుల జీవితవిధానమునుగురించి తెలుసుకొని వారి అడుగుజాడలలో సంచరించుటకు ప్రయత్నించడం ప్రజల విధి. అందులో ప్రపంచప్రఖ్యాతిగన్న ఆధునిక విజ్ఞానశాస్త్రఆంధ్రపరిశోధకులైన స్వామి జ్ఞానానందనుగురించి ఆంధ్రులు తెలుసుకొనడంలో ఒక ప్రత్యేకత యుంది.

వీరు పశ్చిమగోదావరి జిల్లా భీమవరం తాలూకా "గొరగనమూడి" గ్రామంలో పారుపజాతికి ప్రసిద్ధికెక్కిన కులములో శ్రీమంతుల ఇంటిలో 1896 సంవత్సరము డిశంబరు నెల 8వ తేదీని జన్మించిరి. వీరి తండ్రి ఆంగ్ల విద్యయందు ఆరితేరినవారేగాక సదా వేదాంతగోష్ఠిపరులై యుండెడివారు.

పువ్వు పుట్టగానే పరిమళం తెలుస్తుందన్నట్లుగా శ్రీ స్వామివారు తన చిన్నతనములో ఆంగ్లవిద్యాభ్యాసము చేయుచున్నప్పటికిని భూతదయ, సత్య, శౌచాదిగుణములతోనూ, భక్తి, వైరాగ్యభావములతోనూ, భౌతికవిజ్ఞాన వేదాంతశాస్త్ర కుతూహలంతోనూ యుండెడివారు. చిన్నప్పటినుండియు మెడ ప్రక్కకు వాల్చి, తల పైకెత్తి ఊర్ధ్వదృష్టితో ఏదో తీరని ఆలోచన చేయుచుండెడివారు. ఈయన అప్పటి ఈ ధ్యాస చాలమందిని ఆశ్చర్యచకితులను చేసెడిది. ఆగర్భశ్రీమంతుడైన ఈయన, తన గొప్పతనమునకు తగినట్లుగా జీవితమును గడపక పేదవిద్యార్థులందు కడు సానుభూతితో, వారికి మధ్యమధ్య తగినట్లుగా సహాయము చేయుచూ, తన విద్యార్థిదశ గడుపుతూ యుండడం చాలామంది స్వామివారి బంధువులకు అయిష్టతగా నుండెడిది.

అది అమావాస్య. కటికి చీకటి ఆవరించిన కాళరాత్రి. ఆరోజున స్వామికి ఏదో పరిపక్వరూపము చెందిన ఆత్మసందేశము చిన్నతనముననే వచ్చినది. మనిషిని పూర్ణవిరాగము ఆవరించినది. హృదయము నూతన సందేశ పరిశోధనకై తహతహలాడినది. శిబోధూమికి దారిద్ర్యమని మనస్సు హెచ్చరించినది. 1917 సం॥ కార్తీక బహుళ అమావాస్యరోజున నిశిరాత్రి లేచి స్వామీజీ ఆత్మవిజ్ఞానపిపాసతో ఇంటివద్ద ఎవరికీ తెలియకుండ కాలినడకను హిమాలయప్రాంతములకు తపస్సు చేయుటకు నడచెను.

కొంతకాలము నేపాళమునందును, అబూలోని పర్వతగుహలందును, కొంతకాలము హరిద్వారము, హృషీకేశప్రాంతములందును, మరి కొంతకాలము కాశ్మీరుపర్వతకందకముల చెంతను నివసించి పలురకములైన కష్టములకును, కఠిననియమములకును ఓర్చి కొన్ని సమయములందు పండ్లు, ఆకులుకూడ భక్షించుచు ఆహారనియమముతో ఎట్టి సంబంధమూ లేకుండగ, కఠోరతపము సలిపిరి. కాశ్మీరదేశమునందు స్వామీజీ యున్నపుడు అచ్చటి కాలేజి విద్యార్థులకు ఉన్నత విజ్ఞానశాస్త్రవిషయములను గూర్చియు, గణితవేదాంతవిషయములను గూర్చియు అంతకుపూర్వము ఎట్టి అనుభవము లేకపోయినా ఆశుధారగా చెప్పియుండిరి. కేవలం ఆత్మప్రబోధముచేత ఆంగ్లమున పద్యకవిత్వము, భిన్నప్రబోధగీతములను వ్రాయ మొదలిడిరి. వీరు నేపాల్ దేశము వెళ్లినపుడు నిద్రాహారములులేక దీర్ఘాలోచనపరులై ఒకనాడు ఒక రోడ్డు ప్రక్క పడిపోవుట సంభవించగా, ధనికుడైన ఒక మార్గస్థుడు ఈయనను చూచి తగినవిధముగా ఉపచారములు గావించి, తన దేశమునకు కొన్నూరుకు తీసికొని వెళ్లి స్వామీజీని అక్కడ తనవద్ద నుండమని బలవంతపెట్టెను. కాని తన ఆస్తిపాస్తులకే స్వస్తిచెప్పి సన్యసించ దలచుకొన్న స్వామీజీని ఆధనికుని ధనాగారములు, ఆశ్రయింపులు మొదలగునవి ఏమియూ ఆకర్షింపలేక పోయినవి. స్వామీజీ ఢిల్లీనగరములో తిరుగుచుండగా పోలీసులు, సి. ఐ. డి శాఖవారు ఈయనను అనుమానముపై సోదా చేయుటయేగాక, ఈయనను వెంబడించి చాల శ్రమలుపెట్టిరి. ఇంతలో ఈయనను అనేక యిక్కట్లు పాలుచేసిన ఒక పోలీసు ఆఫీసరు కుమారునికి ప్రమాదకరమైన జబ్బుచేయుటచే, ఆతడు యిది యంతయూ ఈ స్వామిమహిమయని తలచి స్వామీజీని ప్రాధేయపడసాగెను. స్వామీజీ తనకీ విషయములో ఏమియూ తెలియదన్ననూ పోలీసుఆఫీసరు నమ్మక, స్వామీజీని గౌరవించి, సత్కరించి ఈయనకు ముందు ముందు పోలీసుబాధ, సి. ఐ. డి ల పీడ వదులునట్లుగా ఒక యోగ్యతాపత్రము నిచ్చెను. అబూలోకూడ స్వామీజీ సి. ఐ. డి. పోలీసులబాధకు గురికావలసి వచ్చినది.

ఒకనాడు అబూలో ఒక విచిత్ర సంఘటన జరిగినది. స్వామీజీ అబూలోని ఒక గుహలో ఆహారపానీయాదులు మాని కొన్నివారముల తరబడి తదేకదీక్షతో తపస్సు చేసుకొనుచుండగా ఈయన పరిస్థితిని పరీక్షించి గమనించుటకు అనేకమంది ఆ ప్రాంతమందలి ప్రజలు ఈయన గుహవద్దకు వచ్చి పరీక్షించి ఆ సమయములో ఈయన తపోధ్యానమును చూచి, పలుకరించనైనను పలుకరించక తిరిగి వెళ్ళిపోయిరి. అబూలో నున్నపుడే వీరికి శ్రీకృష్ణచైతన్యము కలిగి, హృషీకేశము బయలుదేరి వెళ్లవలసినదనియూ, అక్కడ తనకు ఒక గురువు లభించగలడనియూ అంతర్వాణి ప్రబోధము కలిగెను. 1920 లో ఈయన నిర్వికల్పఆత్మానుభూతిని చెంది అటుపిమ్మట హృషీకేశము, అహమ్మదాబాద్, కాశీ, ఢిల్లీ, మొదలగు మైదాన ప్రాంతములకు తిరిగివచ్చి ఆధ్యాత్మిక జిజ్ఞాసగల భక్తులకు, సాధువులకు ఆత్మసాధనానుష్ఠానములను బోధించెను. అహమ్మదాబాదులోని వీరి శిష్యులు చాలమంది వీరి ప్రబోధములను సేకరించి ప్రచారము చేయుటకు ప్రయత్నించుచున్నారు.

మంచుకొండలలో మనుష్యులు నివసించడం సామాన్యవిషయము కాదు. అందులో శీతకాలములో నివసించుట మరీ దుర్ఘటము. అందులో వివస్త్రులై దిగంబరముతో హిమాలయప్రాంతములలో యుండుట సామాన్యులు సాహసించలేని కార్యము. 1922 లో హిమాలయములోని గంగోత్రి, బదరీనారాయణ ప్రాంతముల మంచుమైదానములందు శీతకాలముల నైతము దిగంబరులై నిరంతరసమాధినిమగ్నులై స్వామి జ్ఞానానంద సుమారు 2 సం॥ల కాలము వెళ్లబుచ్చెను.

ఈ సమయములో ఆప్రాంతపు కొహారి, ఘూర్వార్ సంస్థానాధిపతి శ్రీస్వామి ఘనతను గుర్తించి, నాటినుండియు ఈయనకు సర్వవిధ సేవలను చేయుచుండిరి. పిమ్మట స్వామి ఉత్తరదేశమునగల ముఖ్యపట్టణములకును, ఆంధ్రప్రాంతములకును విచ్చేసి జిజ్ఞాసులకు ఆత్మసాధనానుష్ఠానములను బోధించుచు, తిరిగి హిమాలయమున కేగుచూ అచ్చటనైతము తన శిష్యబృందమును దగ్గరకు చేర్చి వారికి ఆత్మానుభూతికి తగు బోధనలను సల్పుచుండెడివారు.

మహర్షులచే వ్రాయబడ్డ కొన్ని శాస్త్రములు కేవలమూ ఆత్మప్రేరితములుగాని అతిశయోక్తులేమియూ లేదు. వేదములు, ఉపనిషత్తులు, పురాణేతిహాసములు మొ॥ విషయములుండ, ఆధునికమానవశ్రేయస్సునకు ఉపయోగించు ఆయుర్వేదశాస్త్రము వాత్స్యాయన కామసూత్రములు, మనుధర్మశాస్త్రము, గౌతమ బౌద్ధధర్మసూత్రములు మొదలైనవన్నియూ కేవలము ఆత్మప్రేరితమైన ఋషివాక్కులే. అటులనే జ్ఞానానందస్వామికికూడ విజ్ఞానశాస్త్రములో మానవశ్రేయస్సు కనుగుణంగా కృషి సల్పవలెనని ఆత్మప్రబోధమైన ఉత్సాహము జనించెను. అంతట 1927 మార్చిలో విజ్ఞానశాస్త్రపరిశోధనకొరకు పాశ్చాత్యఖండమైన జర్మనీకి ప్రయాణమై "డ్రెస్‌డెన్" అను పట్టణమున పరిశోధనలు జరుపుట మొదలిడెను. పాశ్చాత్య రసాయన శోధనాగారములు అతిరహస్యములగుటచే, సాధారణంగా అందులో ప్రవేశము దొరకుట దుర్లభము. అందుచే స్వామీజీ "డ్రెస్‌డెన్" పట్టణములోని ప్రజలకు భారతీయ వేదాంతశాస్త్రప్రబోధమును సల్పుచు, అచ్చటి భిన్నవ్యక్తులను ఆకర్షించి వారి సహాయమున అచ్చటి విజ్ఞాన పరిశోధనాగారములందు ప్రవేశించగలిగి పరిశోధనలు జరుపుచుండెడివారు. ఇంతలో స్వామీజీ చేతిపై ఒక యంత్రము పడి బలమైన దెబ్బ తగిలి శరీరారోగ్యము పూర్తిగా చెడినందున, స్వామీజీ తన శిష్యుల కోరికపై హిందూదేశమునకు మరలివచ్చెను. మరల 1933 లో జెకోస్లోవేకియా వెళ్లి ప్రేగ్ యూనివర్శిటీయందు ఉన్నత విజ్ఞానశాస్త్ర పరిశోధనలను గావించి వారి మన్ననలను ప్రశంసలను పొంది "డాక్టరు ఆఫ్ సైన్సు" అను బిరుదును బడసెను. స్వామీజీ 1936 సం॥లో తిరిగి భారతదేశం వచ్చెనుగాని 1938 లో మరల వారి పరిశోధనలను పూర్తిచేయుటకొరకై ద్వితీయ ప్రపంచయుద్ధప్రారంభసమయమున జెకోస్లోవేకియా వెళ్లిరి.

జెకోస్లోవేకియా అంతా అప్పుడు యుద్ధవాతావరణములో మునిగి తేలుచున్నందున, అచ్చట పరిశోధనలు సల్ప వీలులేక అనేక యిక్కట్లకు లోనై తుదకు ఎటులనో ఇంగ్లాండు చేరగలిగిరి. యుద్ధకాలమంతయు లివర్‌పూల్‌నందు "యాటమిక్ రిసెర్చి" (అణుశాస్త్ర పరిశోధన) సల్పి కొన్ని నూతనఫలితములను ప్రకటించి పి. హెచ్. డి. బిరుదును పొందగలిగెను.

అచ్చటి నుండి 1945 సం॥ ప్రాంతములో అమెరికా వెళ్ళి అక్కడ మిచిగాంగ్ యూనివర్శిటీయందు ఉన్నత అణుశాస్త్రపరిశోధనలయందు తీవ్రకృషిచేసెను. ఈ పరిశోధనకై స్వయముగ స్వామీజీ ఒక యంత్రమును కూడ నిర్మించిరి. ఇప్పుడీ యంత్రమును వీ రకడ్డ విడిచిరాగా పాశ్చాత్యులు దీనిని ఉపయోగించుకొనుచున్నారు. ఇంతవరకు పరమాణుశాస్త్ర పరిశోధనకు సంబంధించిన సమస్త వివరములతో గల ఒక సమగ్రమైన "హైవేకౌ" (*High-Vacau*) అను ఉద్గ్రంథమును అమెరికానుండి ప్రచురించిరి. పిదప 1948 ఫిబ్రవరి ప్రాంతములో భౌతికవిజ్ఞానాభిలాషులగు కొంతమంది గుజరాతు మిత్రులయొక్క కోరికపై స్వామీజీ భారతదేశమునకు తిరిగివచ్చెను.

జ్ఞానానందస్వాములవారియొక్క తనమును, శక్తిసామర్థ్యములను ప్రొఫెసర్ లంకర్ మొదలగుకొందరు ప్రముఖులు గుర్తించి, భారతప్రధాని పండితజవహర్లాల్ గారికి ఎరుకపరచిరి. అంతట పండిత నెహ్రూ నేడు ప్రపంచమును కలవరపెట్టుచున్న ఈ పరమాణుశాస్త్రమును పరిశోధన సలుపుటకు ఒక శోధనాగారమును ఏర్పరచి దానికి శ్రీ జ్ఞానానందస్వామిని అధినేతగా కోరి నియమించెను. వీరు ఇండియన్ ఫిజిక్సు సొసైటీ సభ్యులుకూడా.


ఈ పరమాణుపరిశోధనయొక్క మహత్తర ఫలితములద్వారా స్వామీజీ భారతప్రజల ప్రస్తుత జీవితావసరములను పరిష్కారము చేయుటకు ప్రయత్నించుచున్నారు. పరమాణుశాస్త్రములో వెనుకబడియున్న మనదేశం జ్ఞానానందస్వాములవారి పరిశోధనలద్వారా కలిగిన ఈ సదవకాశమును పొందగలిగినందుకు ప్రతివారు ఆనందించుచున్నారు.

స్వామీజీయొక్క అనుభవమును భారత ప్రజలకు వినియోగించుటలో ఆయనను ఆహ్వానించి ఉన్నతపదవి నిచ్చి గౌరవించుటలో పండిత నెహ్రూ చాల ఉదారతను ప్రదర్శించెనని విషయజ్ఞులు తలచుచుండిరి. ఈ పరమాణుశాస్త్రపరిశోధనలద్వారా ఇప్పుడు భారతదేశంకూడ పాశ్చాత్యదేశములతో సరిసమానంగా తూగగలశక్తి కలిగినదని భారతప్రజలు భావించుచున్నారు.

యాటంశక్తిని విదేశీయులు నేడు హోమానికి, మానవవినాశానికి ఉపయోగించుటకు ప్రయత్నించుచుండగా, స్వామీజీ ఆ పరమాణుశక్తినే ప్రపంచకళ్యాణానికి, మానవాభ్యుదయానికి ఉపయోగపడడానికి వీలుగా ప్రయత్నములు సలుపుచుండిరి.

స్వామీజీజీవితంలో గొప్పవిషయమేమన, తన 19వ ఏట స్కూలు ఫైనల్ చదువుతూయున్న సమయంలో వివాహమైన పిమ్మట తన ఇరువదవ

(21-వ పేజీ చూడుడు)



తిరుపతివేంకటేశ్వరాలయ హేమమండపగోపుర ప్రాకారాలు

"కలౌ వేంకటనాయకః"

శ్రీ పుల్లాభొట్ల వేంకటరామశర్మ

శ్రీ శ్వేతవరాహకల్పము మొదట శ్రీమన్నారాయణుడు, వరాహావతార అనంతరము బ్రహ్మాదులచే ప్రార్థితుడై ఈభూమియందుండుటకు సమ్మతించి - శ్రీవైకుంఠమున శేషాహిరూపమున ఉండు తన క్రీడాచలమును శ్రీదేవిసహితముగా గరుడాళ్వారులచే తెప్పించుకొని స్వర్ణముఖిసమీపమున ఉండు ప్రాంతమున వేంచేసిరి. ఆదిన వరాహక్షేత్రమైన ఈ దివ్యక్షేత్రము కొంతకాలమునకు శ్రీనివాసమూర్తి ఉనికి కల్పించుకొనుటచే స్వామివారి క్షేత్రమైనది. కాని ఈనాటికీ తిరుపతిలో ప్రథమమర్యాదలు అర్చనాభిషేకములు ఆదివరాహస్వామికే. అనంతరమే వేంకటేశ్వర పెరుమాళ్ళునకు అర్చన - ఆరగింపు.

"మాత స్సమస్తజగతాం మధుకైటభారే
వక్షోవిహారిణి మనోహరదివ్యమూర్తే
శ్రీ స్వామిని శ్రితజనప్రియదానశీలే
శ్రీ వేంకటేశదయితే తవ సుప్రభాతమ్."

"తంత్రీప్రకర్ష మధురస్వనయా విపంచ్యా
గాయత్యనంతచరితం తవ నారదోపి
భాషాసమగ్ర మసకృత్కరచారురమ్యం
శేషాద్రిశేఖరవిభో తవ సుప్రభాతమ్."

"శ్రీ శేషశైలగరుడాచలవేంకటాద్రి-
నారాయణాద్రివృషభాద్రివృషాద్రిముఖ్యామ్
ఆఖ్యాం త్వదీయవసతే రనిశం వదంతి
శ్రీ వేంకటాచలపతే తవ సుప్రభాతమ్."

తూర్పుదిశను అరుణరేఖలు శ్రీ వేంకటేశ్వరాలయశిఖర సువర్ణకలశములపై ప్రభాకాంతు లీనుచుండగా, అప్పుడే మేలుకొను విహంగసంతతులు కలకలారవము లొనర్చుచుండ, తమ పాపతతిని బాపుకొనుటకు భక్తబృందములు 'గోవిందా' 'గోవిందా' అనుచూ పాపనాశనము దెస బోవుచుండ, కైంకర్యపరులు ఆలయప్రాంగణమున ప్రాభాతసంకీర్తనముతో శ్రీ స్వామివారిని మేల్కొల్పుచుందురు. ఈ సమయమునకే శ్రీవారి పాన్పు, ఆస్తరణము మొదలగునవి బయటకు తీసుకువెడుతూఉంటారు. ఈ సమయముననే స్వామివారి ముఖమండపమున ముడుపులసమర్పణమునకుగాను ఉవ్వెత్తున 'కొప్పెర' కడుతూ ఉంటారు. సుప్రభాతానంతరం శ్రీ వేంకటేశ్వరునిగూర్చి పఠించే స్తోత్రశ్లోకాలు ఎవ్వరినిగాని పులకితగాత్రుల చేసితీరును.

"కమలాకుచచూచుకకుంకుమతో
నియతారుణితాతులనీలతనో
కమలాయతలోచన లోకపతే
విజయీభవ వేంకటశైలపతే."

ఇట్టి శ్రీ వేంకటేశస్తోత్రతరంగములందు భక్తిపరులమానస రాజహంసములు తేలియాడుతూ ఉండగా శ్రీ వేంకటేశ ప్రపత్తిశ్లోకాలు భక్తుల కర్ణరసాయనములు.

"పార్థాయ తత్సదృశసారథినా త్వయైవ
యౌ దర్శితౌ స్వచరణౌ, శరణం వ్రజేతి
భూయోపి మహ్య మిహ తౌ కరదర్శితౌ తే
శ్రీ వేంకటేశచరణౌ శరణం ప్రపద్యే."

"శ్రియః కాంతాయ కల్యాణ
నిధయే నిధయేర్థినాం
శ్రీ వేంకటనివాసాయ
శ్రీనివాసాయ మంగళం."

ఈ సంకీర్తనముతో సుప్రభాతసేవ పరిపూర్తి అగును.

కల్యాణమూర్తి

శ్రీ వేంకటేశ్వరుని సుప్రసన్న సుందర నిజవిగ్రహమును చూడవలెనన్న శుక్రవారం ఉదయమే చూచితీరాలి. నాటి పంచామృతాభిషేకములు, స్వామివారి అర్చన ఒకసారి చూచినట్లయితే చిరస్మరణీయంగా ఉంటుంది. విశ్వరూపసందర్శన పూర్వరాత్రి దేవాలయ ద్వారము లన్నియు మూసివేసినప్పుడు త్రింశత్కోటిదేవతలతో బ్రహ్మ విచ్చేసి స్వామివారిని అర్చిస్తారనీ, ఆ ఆరాధనసంబంధమైన తీర్థమే విశ్వరూపసందర్శనకాలమున భక్తులకు లభిస్తుందనీ భక్తుల విశ్వాసము. స్వామివారి ఉత్సవము చూడవలెనంటే బ్రహ్మోత్సవము, వసంతోత్సవము, కల్యాణోత్సవమూ సేవచూడవలెనంటే తోమాలసేవను చూచితీరవలసినదే.

వసంతోత్సవమునకు రెండువేల రూపాయలు, సహస్రకలశాభిషేకమునకు రూ 1005లు; తోమాలసేవకు రూ 18 లు, అర్చనకు ఏడు రూపాయలు, హారతికి ఒకరూపాయి యాత్రికులదగ్గిర వసూలుచేస్తారు.

అర్చనాదికములు

మూలవిరాట్టుసవిధసీమకు సమీపముననే శ్రీభోగ శ్రీనివాసమూర్తి వేంచేసి ఉంటారు. వారికి అభిషేకము, అర్చన, ఆరాధన, జరిగిన తర్వాత తోమాలసేవ, వేదపారాయణము, దివ్యప్రబంధపారాయణము జరుగును. ఈసమయమున గద్వాలసంస్థానాధీసులు నేతి దివిటీలు, మైసూరు మహారాజాగారు చామర కైంకర్యమూ జరిపిస్తారు. మంత్రపుష్పము హారతి తోమాలసేవ అయినతర్వాత శ్రీభోగ శ్రీనివాసమూర్తి కులశేఖరపడినుండి వెండికుర్చీలో బంగారువాకిలి దాటి ముఖమండపమునకు విజయముచేస్తారు. కొలువమరిన శ్రీనివాసునికి సువర్ణఛత్రము, రజతచామరముల సేవ జరుగుతుంది.

నువ్వులు వేయించి, శొంఠి పొడిచేసి, బెల్లం కలిపి శ్రీస్వామివారికి నివేదనచేస్తారు. శ్రీవారికి పంచాంగశ్రవణం చిరావర్జా వినిపించడం జరుగుతుంది. నవనీతహారతి, ప్రసాదము సమర్పిస్తారు. అనంతరం శ్రీవారు లోపలికి దయచేస్తారు.

తర్వాత తులసిసహస్రనామార్చన, హారతి, లఘుశుద్ధి, నివేదన జరుగును. సాధారణముగా ఉదయము, మధ్యాహ్నము, సాయంత్రము అధికారుల ఏర్పాటుప్రకారం యాత్రికులకు ధర్మదర్శనం లభిస్తుంది. ధర్మదర్శనం జరుగుతూండగా స్వామివారికి చెల్లింపబడిన ముడుపులను పారుపత్యందారు లెక్కలు వ్రాసుకుంటారు. మరల గర్భాలయముచు శుద్ధిచేసిన మీదట అష్టోత్తరశతనామార్చన, నివేదన జరిపి ఆలయంతలుపులు మూస్తారు. సాయంసంధ్యవరకు కల్యాణమండపమున స్వామికి భక్తులు జరిపించు ఉత్సవములు జరుగును.

పవళింపు సేవ

సంధ్యాకాలమున ఏకాంతార్చన, ధర్మదర్శనము, ముడుపులెక్కలు అయినమీదట స్వామివారికి ఏకాంతసేవ జరుగుతుంది. స్వామి శయనార్థము వెండిగొలుసుల ఊయలమంచము శ్రీపాదచందనము, పాలు, పండ్లు గర్భాలయమున ఉండు శ్రీరాముల సన్నిధిన ఉంచి పట్టుపరుపుపై భోగ శ్రీనివాసమూర్తిని శయనింపచేసెదరు. ఏకాంతసేవానంతరము పునఃఅరుణోదయమువరకూ స్వామిదర్శనము లభింపదు.


వేడుకలు

వసంత నవరాత్రులందు, శరన్నవరాత్రులందు స్వామివారికి జరుగు వసంత బ్రహ్మోత్సవములు అత్యంతము దర్శనీయములు. గురువారం పూలంగి కన్నులపండువుగా ఉంటుంది. ఏడుకొండలస్వామి వజ్రకవచముతోసహా వరుసగా ఒక్కొక్కసారి సర్వభూపాలవాహనము, కల్పవృక్షవాహనము, శేషవాహనము, సూర్యప్రభ, పల్లకివాహనములు, పుష్పరథము, ముత్యాలపందిరి, గరుడవాహనము, చంద్రప్రభ, ఏనుగవాహనం, గుర్రపువాహనం, సింహవాహనం, హంసవాహనములపై ఊరేగింపు వెడలినపుడు భక్తుల జయజయధ్వానములు, భజనలు, పరమానందకరముగా, నేత్రపర్వముగా ఉంటుంది.

దేవాలయ వైభవము


తిరుపతి వేంకటేశ్వరుని క్షేత్రము హేమమండపగోపురప్రాకారములతోడను, పాపనాశనము, ఆకాశగంగ, గోగర్భము, మున్నగు అష్టోత్తర పుణ్యతీర్థములతోడను సంపంగి, విమాన, వైకుంఠప్రదక్షిణములతోడను, అలరారుచున్నది. వరాహపురాణమునందును, భవిష్యపురాణమునందును, స్కాందపురాణమునందున మార్కాండేయపురాణమునందును, బ్రహ్మపురాణమునందును ఈ క్షేత్ర ప్రసక్తి ఉన్నది. కలియుగారంభమున నారాయణ పురాధీశుడుగానుండిన ఆకాశరాజు తమ్ముడుఅగు తొండమాన్ చక్రవర్తి ఈ దేవాలయమును గోపురప్రాకారసహితముగా కట్టించి వేంకటేశ్వరుని మహోత్సవ వైభవాదికములతో నీ దేవాలయములలో నిలిపెన[illegible] బ్రహ్మపురాణము తెలుపుచున్నది. భారతీయ శిల్పకళావైభవమును జగత్ప్రశస్తముచేసి ఆంధ్రదేశమున స్వర్ణయుగమును సృష్టించిన అఖం[illegible] సామ్రాజ్యనిర్మాత శ్రీకృష్ణదేవరాయలు దేవా[illegible]యమును పునరుద్ధరించి అనంతశిల్పకళా వైదగ్ధ్యముచే అలరారునట్లు చేసెను. బంగా[illegible] వాకిటిముందు వున్న తిరుమహామండపము, ఇత[illegible] మండపములు బయటనున్న వెయ్యికాళ్ళమండప[illegible] హిందూరాజుల కైంకర్యములు, శ్రీవెంకటేశ[illegible] ఆలయ సింహద్వారమునకు 'పడికావ[illegible]' అని పేరు. అనుదినమును, ప్రాతఃకాలమ[illegible] 'హరికొలువు అను మంగళవాయిద్య మయినపి[illegible]

(14-వ పేజీ చూడుడు)




దేవాలయసింహద్వారము

★ తిరుపతి




పదిలక్షల కిమ్మతుచేయు స్వా

వేంకటేశ్వ



వజ్రకవచముతో ఏడుకొండలవాడు



ఉత్సవ సమయమున అమ్మవార్లత



మివారి రత్నకిరీటం.




స్వామి పుష్కరిణి

పుణ్యతీర్థం ★

ముఖచిత్రం
తిరుపతిలో శ్రీ కృష్ణదేవరాయలు, దేవేరుల, విగ్రహాలు

రాలయ




లో శ్రీ వేంకటేశ్వరుడు



శ్రీ గోదాదేవి

అమెరికాలో పండిట్ నెహ్రూ



ఆర్లింగ్టన్‌లోని జాతీయ శ్మశానవాటికలను ప్రధానమంత్రి 12-వ తేదీన దర్శించి అచటి అజ్ఞాతవీరుని సమాధివద్ద గౌరవపురస్సరంగా పుష్పాంజలిని అర్పించిరి.



అక్టోబరు 13-న పండిట్ నెహ్రూ వాషింగ్టన్‌లోని జాతీయ చిత్రాలను సందర్శించారు. ఆ కార్యక్రమం ముగించుకొని బయటికి వస్తున్న పండిట్ నెహ్రూ. ప్రధానమంత్రికి వీడ్కోలిస్తున్న చిత్రశాల పాలనాధికారి హారి. ఎ. మాక్‌బ్రైడ్.



ఐదురూపాయలకు అష్టైశ్వర్యములు

శ్రీ కడియం లక్ష్మీనారాయణ

అనగనగా నొక పల్లెలో నిరువు రన్నదమ్ము లుండిరి. వారికి నింటివద్ద నేమియు పని లేకుండుటవలన విదేశముల కేగి ధన మార్జింపవలె నని నిశ్చయించుకొని, యొకనా డిరువురును నొక రాచబాటవెంబడి బయనము సాగించుచుండిరి. పెద్దవానివద్ద నధిక ధనముండెను. చిన్నవానివద్ద నైదు రూప్యములుమాత్రమే యుండెను.

వా రివ్విధమున బయనము జేయగా నొకచో వారి కొక కుటీరము గాన్పించెను. ఆ యింటి తలుపుపై, "అయిదు రూపాయలకు అష్టైశ్వర్యము లివ్వబడును" అని ప్రకటింపబడి యుండెను. పెద్దవా డది గాంచి నిర్లక్ష్యముతో వెడలిపోయెను. చిన్నవానికి దానివిషయమై తెలుసుకొనవలె నని అధిక అభిలాష యుండుటచే నా కుటీరము లోనికి పోయెను. అచ్చట అతని కొక వృద్ధవనిత గాన్పించెను. ఆత డామెకు నైదు రూప్యము లిచ్చి, "అష్టైశ్వర్యము లిమ్ము" అని అడిగెను. అంత టామె, "నాయనా! నీకు నేను మూడు సలహాలను చెప్పెదను. వాటిని నీవు పాటించినట్లైన నీకు త్వరలో నష్టైశ్వర్యములు కలుగును." అని చెప్పి, ఆ సలహాల నిట్లు చెప్పెను. మొదటిది, "మొదట నీ వనుసరించిన మార్గమును వీడరాదు; రెండవది, నీకు సంబంధించని విషయములలో మధ్యగా నీవు కలుగజేసుకొనకుము; మూడవది, ఏ పని నైన నేడాలోచించి రేపు చేయుము." వీటిని నితరుల కెవ్వరికిని, నుడువకు మని హెచ్చరించెను.

అతడు వాని సోదరుని కలుసుకొని వానితో కలసి పయనము సాగించుచుండెను. మార్గమధ్యలో "అష్టైశ్వర్యము లే" వని అన్న తమ్ము హేళన చేసెను. తమ్ముడు మారు వల్కక నూరకుండెను.

వా రీ రీతిగా కొన్ని దినములు పయనము చేసిరి. ఒక చోట మరొక మార్గము వచ్చి వీరిబాటను కలుసుకొనెను. పెద్దవా డా బాట ననుసరించి వెళ్ళిపోయెను. రెండవవాడుమాత్రము తన పూర్వపుమార్గముననే ప్రయాణము చేయుచుండెను. కొలదిద వ్వేగిన తదుపరి పెద్దవానిని చోరులు హత్యచేసి ధనము నపహరించి రని బాటసారుల వలన చిన్నవాడు వినెను. అతని కీ దృష్టాంతమువలన వృద్ధురాలి సలహాలపై నమ్మకము హెచ్చెను.

తుద కత డొక రాజప్రాసాదము చెంతకు చేరెను. అచ్చ టుచితముగ నాహార మిడెద రని వినుటచే లోపలి కేగి, తృప్తితీరునటుల భుజించెను. ప్రయాణపుబడలికచే యానాటి రాత్రి యచ్చటనే నిద్రించి విశ్రాంతిపొందెను. మరునాడు ప్రాతఃకాలమున నా సమీపమున నున్న కొలనుకడకు ముఖప్రక్షాళనార్థమై యేగి, యా కొలనులో రక్తయుతమై, ఖండింపబడియున్న నొక మానవుని శిరస్సును చూచెను. అతనికి భయాశ్చర్యము లొక్కసారిగ గల్గి, "ఇ దేమి ట"ని తనలో ప్రశ్నించుకొనెను. కాని యాతనికి రెండవ సలహా స్ఫురణకు వచ్చుటచే తక్షణమే యచ్చటనుండి వెడలిపోయెను.


అచ్చటకు వచ్చినవా రెవ్వరైన యా శిరమువిషయమైయెవరినైన నడిగినట్లైన వారి తలను ఖండిపమని, అట్లడుగని వానిని దన కొలువునకు దీసుకొనిరండని యచ్చటి భటుల కా పట్టణపు రాజు శాసించియుండెను.

రాజాజ్ఞప్రకార మచ్చటి భటు లీతనిని తీసుకొని రాజదర్బారున కేగిరి. రా జాతనిని జూచి, "నీ కా సత్రవులో సుఖముగ నున్నదా?" అని ప్రశ్నించెను. అందుల కాతడు "దేవరవారి దయవలన సుఖముగనే యున్నది మహాప్రభూ!" అని వినయముతో ప్రత్యుత్తర మిచ్చెను. "నీ వా శిరస్సు విషయమై యేల తెలుసుకొనలేదు!" అని రాజు తిరిగి ప్రశ్నించెను. ఆతడు, "నాకు సంబంధించని విషయములలో నేను జోక్యముచేసుకొనను మహారాజా!" అని జవాబిచ్చెను. ఇంకను రా జనేక ప్రశ్న లడుగగా వాటి కన్నిటికి చక్కని సమాధానములను తెలివితేటలతో చెప్పెను. ఆ భూపతి యాతని తెలివికి మెచ్చుకొని, యాతనిని తన కొలువులో నొక యున్నతోద్యోగిగా నియమించుకొనెను.

అప్పటి కాతడు తన గ్రామము వీడి పదునారేండ్లు గడచినవి. అతడు వచ్చునప్పటి కతనికి నారుమాసముల పుత్రుడుండెను. తన కుటుంబము తీసుకొని వచ్చుటకై రాజువద్ద శెలవుదీసుకొని తన గ్రామమువచ్చెను. ఆతడు వానియూరికి వచ్చునప్పటికి రాత్రివేళ యగుటచే నట్టిసమయమున తాను దన యింటికి వెళ్లినను తన బంధువులు గుర్తుపట్టలేరని తలచి తన యింటిప్రక్కవారింట నతిథిగా నుండెను. ఆ రాత్రి యందఱు నిదురించినపిమ్మట నాతడు తాను పరుండిన గదిలోని గవాక్షముద్వారా తన యింటిలోనికి జూచెను. తన భార్య, మరియొక యువకుడు నొక మంచముపై పరుండుట గని, తన భార్యప్రవర్తన చెడిన దని తలచి యాగ్రహావేశపూరితుడై వారిని చంపుటకు కత్తిని దీసెను. కాని మూడవ సలహా జ్ఞప్తికి వచ్చుట వలన కత్తిని ఒఱలో నుంచివైచెను.

మరునాడు తన గృహాము కేగి, ఆ యువకుడు తన పుత్రు డని తెలుసుకొని, యధికానందభరితు డయ్యెను. తన కుటుంబమును తీసుకొని రాజనగరుకు పోయి, అష్టైశ్వర్యములతో తులతూగుచు తన జీవితశేషమును సుఖముగా గడపెను.

కథ కంచికి మనము యింటికి



న్యూయార్కులో, అధికారసన్మానాన్ని అందుకోవటానికి బయలుదేరేముందు వాల్డర్ఫ్—ఆస్టోరియాహోటలులో బాలబాలికలు కోరగా తన చేవ్రాలు చేసి యిస్తున్న భారతప్రధాని నెహ్రూ.

బాలానందం :

కవలపిల్లలు

శ్రీ లింగం లక్ష్మణరావు

అనగాఅనగా ఒక ఊళ్లో ఇద్దరు అన్నదమ్ములు ఉండేవారు. అన్న చాలా ధనవంతుడు, తమ్ముడు చాల బీదవాడు. కట్టెలుకొట్టుకొని జీవించేవాడు. తమ్ముడి కిద్దరు కవలపిల్ల లున్నారు. వారు చాలా అందంగా వుండేవాళ్లు. వాళ్లు పొద్దున్నే ముష్టికి పోయేవారు. వాళ్లను చూసి ఊళ్లోవాళ్ళు చాలా జాలిపడి అందరూ అన్నంవేస్తుండేవాళ్లు. వాళ్లు అది యింటికి తెచ్చి తండ్రి తెచ్చిన డబ్బుతో హాయిగా కాలక్షేపం చేస్తూయుండేవారు. అన్న కిది చూచి కన్నుకుట్టి, ఒక నాడు జోతిష్యుని వేషము వేసుకొనివచ్చి "నీ పిల్లలు నీదగ్గర యింక వారమురోజులవరకు ఉంటే నీవు చచ్చిపోతావు" అని చెప్పేడు. చావు దాటించమని జ్యోతిష్యుని ప్రార్థించగా వారిని అడవికి పంపించేయమనెను. తమ్ముడు ఒక రాత్రి పిల్లలను అడవిలో వదలివేశి వచ్చెను.

పిల్లలు అడవిలో పండ్లు కాయలు తింటూ కాలముగడపగా కొంతకాలానికి 18 ఏళ్లువయస్సు వచ్చింది. వాళ్లు యింక దేశసంచారమునకు బయలుదేరినారు. అలాగా వెళుతూవుంటే ఒక పులి కనిపించింది. వాళ్లు దానిని జంపడానికి వెళ్తే అది "నన్ను చంపకండి, నాకు రెండు కవలపిల్ల లున్నాయి వాటిని మీ కిచ్చుకుంటానని చెప్పింది. సరే నని వారు ఒప్పుకున్నారు. పులిపిల్లలను పట్టుకొని కొంతదూరం వెళ్లేసరికి ఒక ఎలుగుగొడ్డు కనిపించింది. అదీ పులిలాగే రెండు పిల్లల నిచ్చి వెళ్లింది.

ఆలాగే వాళ్లు వెళ్తూవుండగా ఒక కుక్క కనపడి వాళ్ళకి రెండు కుక్కపిల్లలను ఒక తాబేలు కనపడి తన రెండు పిల్లలను యిచ్చెను. వాళ్లు ఒక్కొక్కళ్లం ఒక పులిపిల్లను, ఎలుగుపిల్లను, కుక్కపిల్లను, తాబేలుపిల్లను పట్టుకొని వెళ్తూవుండగా రెండు దారులు కనిపించినయ్. వారిద్దరు ఒక సంవత్సరమునకు కలుసుకొనుటకు గడువుపెట్టుకొని చెరియొక వేపు వెళ్ళిరి.

అన్న ఆలా వెళ్తూయుండగా ఒక రాజ్యము చేరుకొనెను.ఆపూరివారంతా దుఃఖించుచుండిరి. వారిని కారణ మడగగా వారు "ఈపూరిసమీపమున ఒక రాక్షసుడు ఉన్నాడు. వాడికి రోజూ ఒక మనిషిని ఆహారముగా ఇంతవరకు పంపించుచున్నాము. ఈరోజు రాజకుమారివంతు వచ్చింది. రాజు, రాజకుమారిని రక్షించేవారికి అర్ధరాజ్యమిచ్చి రాజకుమారిని పెండ్లిచెస్తా నని చాటించినాడు. కాని ఎవరూ రక్షించెదమని రాలేదు. అందుచేత రాజు' మేము విచారించుచున్నాము" అని చెప్పిరి. అన్న వారిని రాక్షసుడెక్కడ ఉన్నాడో చెప్పమన్నాడు. వారు ఆ కొండపైన వున్నాడని చూపించారు.

వెంటనే అన్న అక్కడకు తన పులి, ఎలుగు, కుక్క, తాబేలుతో కలసి ఆ కొండవద్దకు వెళ్ళి దాగుకొనెను. రాక్షసుడు ఇంట్లో ఉండెను. యింతలో రాజకుమారి రాక్షసునికాహారముగా వచ్చెను. అన్న రాజకుమారిని అక్కడే ఉండమని చెప్పి పులిని, ఎలుగుబంటిని, పంపించెను. అవి రెండూ రాక్షసునిచంపి వచ్చేసినవి. ఇది యంతయు రాజకుమారిని తెచ్చిన బండివాడు చూసేడు. వాడికి ఆశ పుట్టింది. దేనికి తెలుసా? అర్ధరాజ్యం వస్తుందని. అన్న రాక్షసుని చంపినతర్వాత, అతని కాలిగోళ్లు చేయిగోళ్లు కత్తిరించి జేబులో పెట్టుకున్నాడు.

అప్పుడే చీకటిపడింది. అందుచే అన్న ఒక గదిలో రెండు మంచాలు ఏర్పాటుచేసి రాజకుమారిని ఒక మంచంమీద, తానొక మంచంమీద పడుకొన్నాడు. అప్పుడు రాజకుమారి తన చేతిరుమాలు అన్న కిచ్చింది. అది జాగ్రత్తచేసి, పులి, ఎలుగు, కుక్క, తాబేలును జాగ్రత్తగా కావలికాస్తూ ఉండమని చెప్పి పడుకొన్నాడు. పులి ఒక జాము కాసింది. తరువాత, ఎలుగు, తరువాత కుక్క వరుసగా కాసేయి. కాని పాపం తాబేలుకు నిద్రవచ్చి నిద్రపోయింది. అప్పుడు రాజకుమారి బండివాడు వచ్చి అన్నను చంపి, రాజకుమారిని రాజుదగ్గరికి తీసుకుపోయేడు. రాజు చాలా సంతోషించాడు. కాని రాజకుమారిమాత్రం పెళ్ళికి యిష్టపడక 12మాసములు గడువుపెట్టింది.

ప్రొద్దున, అన్నచచ్చిపోవడము పులి, ఏలుగు ఇవి చూసి తాబేలును చంపివేస్తామని భయపెట్టినవి. అప్పుడు తాబేలు సంజీవిపుల్ల తెచ్చి అన్నను బ్రతికించెను. అన్న అన్నాతమ్ములు అనుకొన్నట్లు గడువు పూర్తియైనది. కావున అన్న తమ్ముడు కలుసుకొనవలసిన చోటుకు పోయి చూచెను. అచ్చట తమ్ముడు లేడు. అందుచే ఆతడు రెండవదారి యందు వెళ్లుచుండగా ఒక ఇంటావిడ అతనిని పిలిచెను. అన్న తెల్లబోయి అచ్చటికి వెళ్లెను. వాళ్లు అల్లుడొచ్చేడని అందరితోను చెప్పేరు. అప్పుడర్థమైంది అన్నకు. తమ్ముడు ఇక్కడకు వచ్చి, ఈవిడకూతురుని పెళ్లాడాడని. తనూ, తమ్ముడూ కవలపిల్లలుకనక ఒకేలాగ వున్నారని. వెంటనే అతడు, భార్యను పిలిచి, "ఓసే! నేను మొన్న ఏదారంబట వెళ్లేనోచెప్ప"మని అడిగేడు. ఎందుకంటే తమ్ముడు ఆదారిని వెళ్లిఉంటాడని తలచేడు. అప్పుడు భార్య ఆదారిని వెళ్లేరని చూపెట్టింది.

అలా వెళ్తుండగా అతనికి ఒక ముని కనిపించేడు. అతని దగ్గరకు వెళ్లి నమస్కరించాడు. అతను "ఎందుకు ఇక్కడికి వచ్చావు" అని అడిగేడు. అతను సంగతంతా చెప్పాడు. వెంటనే ముని దివ్యదృష్టితో చూచి తమ్ముడు ఒక రాక్షసిమాయవల్ల రాయి అయి అయిపోయాడని చెప్పి ఒక కత్తినిచ్చేడు. అది పట్టుకొని, తమ్ముడు వెళ్లినదిక్కుకెళ్లగా ఒక రాక్షసి కనిపించింది. వెంటనే దానిని చంపి. తమ్ముని మార్చి తమ్ముని, తమ్ముడి పులి, ఎలుగు, కుక్క, తాబేలును పట్టుకొని అత్తవారింటికి బయలుదేరేరు. ఇద్దరు వెళ్లేసరికి ఇద్దరు ఒకేలాగు వున్నారు. అప్పుడు తమ్ముడి భార్య, అన్నకుక్కను పిలిచెను. అది కొత్త కాబట్టి ఆవిడవద్దకు వెళ్లలేదు. తమ్ముడికుక్క వెంటనే వెళ్లింది.

అప్పుడు తమ్ముడు తమ్ముడి పెళ్లాం, అన్నా కలిసి రాజకుమారిరాజ్యం వెళ్లారు. అచ్చట ఒక [illegible]డో రా విన్నారు. ఏమనంటే రాజకుమా[illegible] యిచ్చిన రుమాలు ఎవరివద్దనుందో అతనిని పెళ్లిచేసుకుంటాను అని ఎందుచేతనంటే ఆరోజుతో 12 మాస ములగడువు పూర్తియైనది. లేకపోతె బండివాడిని వివాహమాడాలి. అందుచేత అన్న తనవద్ద రుమాలు రాజక[illegible] చూపెట్టి రాజకుమారిని వివాహమాడేడు. బండి వాడికి ఉరిశిక్ష వేశారు. తండ్రిదగ్గరకు వచ్చి, తండ్రి[illegible] తీసుకొని, రాజకుమా[illegible] రాజ్యం వచ్చి అన్నను రాజుగాను, తమ్ముడిని యు[illegible] రాజుగాను పట్టాభిషేకం చేసుకొ[illegible] హాయిగా రాజ్యం చేస్తూవున్నార[illegible]

అంధబాలురకు విద్య



అంధులైన బాలబాలికలకు విద్యాగంధాన్ని కలిగించటానికి అమెరికాలో జరుగుతున్న ప్రయత్నం. గ్రామఫోను గ్రంథాలు. అమెరికా ఫెడరల్ ప్రభుత్వం, అంధులకు ఈ ప్రత్యేక రకం గ్రామఫోనులను ఉచితంగా ఇస్తుంది.



అంధులైన బాలబాలికలకు విద్యాగంధాన్ని కలిగించటానికి అమెరికాలో జరుగుతున్న ప్రయత్నం. అంధులకొరకు ప్రత్యేకంగా తయారుచేయబడిన గ్రంథాలు–కుడిచేతి చూపుడు వ్రేలితో అక్షరాలను స్పృశించి చదువుతూ వుంటారు. ఎడమచేతి చూపుడు వ్రేలితో తరువాతి పంక్తివున్న స్థలాన్ని గమనించుతారు. ఇలా ఈ గ్రంథాలు చదవటం ఉపాధ్యాయులు దగ్గరవుండి నేర్పుతారు.

'మరుగుజ్జు'

ఆధారం:
శ్రీమతి షోవనాదేవి

రచన:
శ్రీ ఓగేటి శివరామకృష్ణ

వాలాసంవత్సరాలక్రితం ఒక భాగ్యవంతుడైన వర్తకుడు, తన బంధుమిత్రులతో ఒకచోట నివసిస్తూఉండగా ఒక రాక్షసుడా ప్రదేశానికి వచ్చి అక్కడ స్థిరనివాస మేర్పరచుకొన్నాడు. అప్పటినుంచీ ఆ రాక్షసుని అదృష్టం తిరిగింది.

ఆ రాక్షసుడు వర్తకుని బంధువుల్ని ఒకరితర్వాత ఒకరుగా అందర్నీ తినేశాడు. చిట్టచివరకు మన వర్తకుడు మిగిలాడు. ఏదో కొద్ది అదృష్టంవల్ల, అతని భార్య, కొడుకయిన మరుగుజ్జు (పొట్టివాడు)తో అంతకు ముందే ఆమె సోదరుని యింటికి వెళ్ళి, అపాయంనుంచి తప్పించుకొన్నారు.

వర్తకునీ, అతని బంధువులందర్నీ పొట్టపెట్టుకొన్నతర్వాత ఆ రాక్షసుడు తానుండే ఆ ప్రదేశమంతా వదలి నివాసం యిక్కడకు మార్చుకొని నిర్మానుష్యమైన ఆ ప్రదేశాన్ని తాను పరిపాలిస్తున్న రాజ్యమంతా తనదే అన్నట్లుగా పరిపాలించటం మొదలుపెట్టాడు. విధవఅయిన వర్తకునిభార్య, తన మరుగుజ్జుబిడ్డతో అన్నవద్ద ఉండసాగింది.

తెలివిగల ఆ మరుగుజ్జుపిల్లవాడు తన మేనమామసంరక్షణలో పెరుగుతూ, తన వయస్సులో ఉన్న స్నేహితులతో ఆడుకొంటూవుండేవాడు.

ఒకానొక సమయంలో, మరుగుజ్జుతో ఆడుకొంటూ అతని స్నేహితులు, మేనమామయింట్లో ఉంటున్నందుకు హేళనచేశారు. మరుగుజ్జు దుఃఖంతో తల్లిదగ్గరకు వెళ్లి తల్లి కా సంగతి తెల్పాడు.

'నాయనా' ఆ సంగతి విని అతడితల్లి చెప్పసాగింది. 'నీ తండ్రి చాలా భాగ్యవంతుడైన వర్తకుడు. కాని ఒక క్రూర రాక్షసుడు వచ్చి, ఆయన్ని తినేశాడు. అప్పటినుంచీ ఆ క్రూరుడు మన యింటియందే నివసించుతున్నాడు. వాడు బ్రతికిఉన్నంతకాలం మనం తిరిగి అక్కడకు వెళ్ళగూడదు. ఆ యిల్లు మన స్వంతం అవదు.

అలా అన్నతర్వాత, అంతవరకూ తల్లివంటపనుల్లో సహాయంచేసే ఆమరుగుజ్జు, ఆ రాక్షసునివద్దకు బయలుదేరి వెళ్ళి, తనను వంటమనిషిగా తీసుకోవలసిం దని అతన్ని కోరాడు.

'ఏమిటీ'— ఆ మాటలు విని రాక్షసు డనసాగాడు: "సింహంనోట్లో ప్రవేసించుదా మనుకొంటున్నావా? నే రాక్షసుడ్ని. కాని నాకు సరిపోయే ఆహారాన్ని నువ్వు తయారు చేయగలవా?

'ఓ నన్ను చంపకండి, ఓ రాక్షసా' రెండు చేతులూ జోడించి, ఆ పిల్లవాడు అనసాగాడు—"మీరు నన్ను ఆహారంగా తీసుకోడానికి నేను చాలా చిన్నవాణ్ణి కాని మీరు నా ప్రాణాలు నిల్పినట్లయితే మీకు కావలసిన విధంగా పదార్థాలు చక్కగా రుచిగా వండి యివ్వగల్ను.'

'ఆలాగయితే సరే' - కొంచెం కాలం ఆలోచించి రాక్షసు డనసాగాడు—"నీలాంటివాళ్లు డజనుమందినయినా ఒక్క గుటకలో మింగెయ్యగల్ను. కాని నిన్ను తిన్నానా ఆకలి తీరదు. అందువల్ల నువ్వు చెప్పిన షరతులకు నే నంగీకరించాను - కాని నువ్వు వండే వంట రుచిగా లేనట్లయితే నీ ప్రాణాలు నాశనము అవటం తప్పదు"

ఆ మరుగుజ్జుపిల్లవాడా విధంగా ప్రాణము - మరణము షరతున కొప్పుకొని, అతనికి వంటచేయటం ప్రారంభింగాడు. ఇదివరకు రాక్షసుడు తినే భోజనపదార్థాలకన్న మరుగుజ్జు కుఱ్ఱవాడు తయారుచేసే పదార్థాలు రుచిగా ఉండేవి.

ఆవిధంగా ఆ పిల్లాడు రాక్షసునివద్ద జీవిస్తూ ఉండేవాడు. ప్రతీదినం మధ్యాహ్నం భోజన మవటంతోటే, రాక్షసుడు బయటకు వెళ్లి, రాత్రి భోజనం వేళకు తిరిగివచ్చేవాడు.

ఒకదినం ఆ పిల్లవాడు తగు ధైర్యం సంపాదించుకొని రోజూ రాక్షసు డెక్కడకు వెళ్లుతున్నది తెల్పవలసిం దని అడిగాడు.

'నే నెక్కడి కెళ్లి వస్తున్నానో నీ కెందుకు?' అని జవాబిచ్చాడు రాక్షసుడు.

'మీ వ్యాపారానికి ఆటంకం వద్దామని కాదు **రాక్షసా**! ఆ పిల్లవాడు అనసాగాడు—"మీరు ప్రతీదినం ఎక్కడకు వెడుతున్నారో తెలుసుకొంటే, మీ వంట అంతకన్న రుచికరంగా వేడివేడిగా సమయానికే తయారు చేయచ్చు."

విధినిగురించి ఆలోచించే దేవునిదగ్గర ఉంటున్న సేవకుడను' రాక్షసుడు ఆలోచింపకుండా అనసాగాడు. 'నాయొక్క వ్యాపార మేమంటే ఆయనిచ్చిన పేర్లు జాగర్తచేయటం, భూలోకంలో రోజులుదగ్గరకు వచ్చినవా ళ్లెంతమందో లెక్కచేయటం.'

'రాక్షసా, నాయందు దయ యుంచి' ఆ పిల్లవాడు అనసాగాడు—"నా యీ చిన్న కోరిక తీర్చాలి. మీ యజమాని, విధిదేవుని అడిగి నా కెంతకాలం ఆయుర్దాయము విధించబడినదీ తెలుసుకోండి.'

తన గృహమునకు తిరిగి వచ్చిన తర్వాత రాక్షసుడిని విధిరాజు తన ఆయువునుగురించి యేమని చెప్పా డని మరుగుజ్జు ప్రశ్నించాడు.



ప్రధాని నెహ్రూ న్యూయార్కు, లాగార్డియా విమానకేంద్రంలో దిగగానే, ఒసంగబడిన అధికార స్వాగతం.

'విధిదేవుడు నిండుగా శతాబ్దం బ్రతుకుతా వని చెప్పాడు' అని ప్రత్యుత్తరం యిచ్చాడు రాక్షసుడు.

'దయయుంచి మరో మారు నా యీ చిన్న కోరిక తీర్చండి.' పిల్లవాడనసాగాడు—"నా జీవితాయుర్దాయంలో ఒక సెకనో, నిముసమో తగ్గించటాని కేమయినా అవకాశ ముంటుందేమో, వారి నడిగి తెలుసుకురండి."

మర్నాడు, రాక్షసుడు తిరిగివచ్చిన తర్వాత, మరుగుజ్జు దేవు డేం చెప్పాడో వినాలని ఆరాటపడ్డాడు. రాక్షసు డీవిధంగా జవాబిచ్చాడు. "దేవుడు నిర్ణయించిన ఆయుస్సుకు తిరిగి యెవ్వరూ కూడా మార్పుచేయ్యలేరు. నీవు నిక్కచ్చిగా శతాబ్దకాలం బ్రతకవలసిందే ఒక నిముసం ఒక సెకనుకూడా తక్కువ కాకుండా."

మరుగుజ్జు, తర్వాత వంటగదిలోనికి వెళ్ళి రాక్షసునకు ఆహారం తీసికొనిరావటానికి బదులుగా ఎఱ్ఱగా కాల్చిన యినపఊచలను తీసుకొని అతని ముందుకు పరిగెడుతూ యీ విధంగా అనసాగాడు—"ఏమిటీ? నిర్ణయించిన కాలం ముందుగా యెవరూ నా జీవితాయుర్దాయం తీయలేనప్పుడు నీ వంటేను, మరీ నీలాంటివా రంటేనూ నే భయపడ్డం యెందుకూ?"

ఆవిధంగా, మరుగుజ్జువల్ల ఆపదలో పడి రాక్షసుడు కొంచెం తెలివి నుపయోగించి కాలి మడమలకు బుద్ధి చెప్పాడు.

మరుగుజ్జూ అతని తల్లీ! తిరిగి తమ యిల్లు చేరుకొన్నారు. తర్వాత ఒకరి తర్వాత ఒకరుగా యిరుగుపొరుగువారూ బంధువులూ, తిరిగి వచ్చి తమ గృహాల్లో నివసించసాగారు. తిరిగి రాక్షసుడు ఆ ప్రాంతంలో చూడ్డానికయినా కనపడలేదు.

లాలిపాటలు - జోలపాటలు

శ్రీమతి ఇల్లిందల సరస్వతి

లాలిపాటలు, జోలపాటలు సాధారణంగా ఏడాదిలోపుబిడ్డలకు పాడే పాటలు. వీటిలో లాలిపాటలు మారాముచేసి ఏడ్చే బిడ్డలను సమాధానపెట్టూ, లాలిస్తూ పాడేవి; జోలపాటలు బిడ్డలను నిదురబుచ్చేటందుకు పాడేవీను.

"శిశుర్వేత్తి, పశుర్వేత్తి, వేత్తిగానరసం ఫణిః" అన్నట్లుగా పసిబిడ్డలు గానమాధుర్యానికి ముగ్ధులయి ఆకర్షింపబడుతారు. ఈ పాటలు మానవసంఘము ఉత్పత్తిఅయిన దగ్గర్నుంచీ అనుశ్రుతంగా వస్తూఉన్నాయి. పండ్లురాని పసిబిడ్డలకు ప్రబోధకరమైన విషయాలను జోలపాటరూపములో నిత్యమూ పాడి బోధనచేయాలని వీటి ముఖ్యోద్దేశ్యము.

విభిన్నకాలములలో - కాలానుగుణములయిన మార్పులను చేయటానికి అవతారమెత్తిన పరమాత్మకు - ప్రకృతిమాయలోబడి విధ్యుక్తధర్మాన్ని మరచిపోకుండా ఉండటానికి బాల్యములో, దేవతలచే ప్రేరితులయిన తలిదండ్రులు వెనుకటి అవతారఘట్టాలను పాడి జ్ఞాపకము చేసినట్లు కొన్ని పాటలవల్ల తెలుస్తున్నది. పాటలద్వారా విజ్ఞానబోధ, తత్వబోధకూడా, జరిగినట్లు తెలుస్తున్నది. నిద్రపొయ్యే మనస్సు, శాంతిని కోరుతుందనీ, గాఢసుషుప్తిలో ఏకత్వసుఖము శాంతి ఉంటాయి గనుక - ఆ సమయములో బిడ్డల ఆత్మను ప్రబోధిస్తూ, దేహధారియైన జీవుడు పరమాత్మలోని ఒక అంశమని, కర్తవ్యము నిర్దేశిస్తూ గానము చేయటము ఆచారమయినది. అదిగాక బిడ్డలు నిద్రించేటప్పుడు గాలి ధూళి బిడ్డలకు సోకకుండానూ, వారి అంతఃకరణమును ప్రజ్వలింపజేయటానికి, అఖండమైన ఆత్మసంస్కృతి కలుగజేయటానికికూడా యీ పాటలు తోడ్పడుతాయి. అందుకొరకే వీరగాథలు పురాణగాథలు ఈ పాటలలో యిమిడి ఉన్నాయి.

ఈ పాటల్లో తత్వబోధ ఏవిధంగా ఉన్నదో చూడండి—

జో అచ్యుతానంద జోజో ముకుందా-
రార పరమానంద రామగోవింద
తొలుత బ్రహ్మాండంబు తొట్టి గావించీ
నాలుగూ వేదాల గొలుసు లమరించీ
బలువైన ఫణిరాజు పాన్పు గావించీ
చెలులు డోలికలోన చేర్చి లాలించీ జోజో
తొమ్మిదీవాకిళ్ల తొట్టిలోపలనూ
క్రూరులగు ఆర్గురూ సాధులయిదుగురూ
అందులో ముగ్గురు మూర్తులున్నారూ
పట్టవలె ఆర్గురుని పదిలంబుగానూ
కట్టవలె ముగ్గిరిని కదలకుండగనూ
ఉంచవలె ఒక్కరిని హృత్కమలమందూ
....
ఓంకారమనియేటి ఒక తొట్టిలోనూ
తత్వమసి అనియేటి చలువలం బరచి
వేడ్కతో పాపడిని ఏర్పాటుచేసీ
ఏడుభువనములవా, రేకమై పాడా జో! జో!

అఖండమైన ఆత్మసంస్కృతి కలుగచేయటానికి మధురస్వరంతో మంగళకరమైన రాగంతో మృదుమధురగాథలు వినిపించటము, జోజో అనటములో 'నీ వెవరనుకుంటున్నావో, పరమాత్మవేసుమా!' అని హెచ్చరించటమ్ము, మానవనైజములోని బలహీనతను అరికట్టే మార్గాలు బోధిస్తూ ఆధ్యాత్మికశిక్షణను ఆ పసిపాపలకు యివ్వటములో-మనదేశములో ఆధ్యాత్మికముతో కూడిన ఈశ్వరీయజ్ఞానము బాల్యములోనే ప్రారంభిస్తారని సువ్యక్తమవుతున్నది.

తెలుగుభాషలో లాలిపాటలు. జోలపాటలు నందలాదిగా గ్రంథస్థమయి ఉన్నాయి. అయితే యీపాటలు లక్షణకర్తలచేత అంతగా ఆదరింపబడినట్లుగాని లాక్షణికసుప్రసిద్ధకవులచేత పరిగ్రహింపబడినట్లుగాని కానరాదు. ఇవి జానపద వాఙ్మయముక్రిందను, శిశుపోషణ స్త్రీలమీద ఆధారపడి ఉండటమువల్ల స్త్రీల వాఙ్మయము క్రిందను పరిగణింపబడుతున్నవి. జటిలమైన సంస్కృతవృత్తాలలో గాక దేశీయచ్ఛందస్సులలోనే నడిచిన వీ పాటలు. వీటిలో కొన్ని కేవలము మాత్రాగణాలలోనే నడిచినవి. అందువల్లనే ఎక్కువ బిగువులేకుండా పాడటానికి అనువుగా ఉంటాయి. ఇందులో కవితాదృష్టి ఎక్కువలేని మాట నిజమే. రచయితసంస్కారమునుబట్టి, అభిరుచులను బట్టి, ఈపాటలను వ్రాసేవారు మనోహర భావాలను చక్కని శైలిలో వ్రాసి ఇముడుస్తూ వచ్చారు. వేదాంత సత్యాలతోపాటు, ఉపమానోపమేయాలు - శబ్దచిత్రులు కూడా చాలా పాటలలో ఉన్నాయి. జీవద్భాషలో, ప్రగతిగల జాతులలో, క్రొత్తక్రొత్తపాటలు బయలుదేరుతునే ఉన్నాయి. పరమపదించిన మహాత్మునిగురించి లాలిపాటలుకూడా బయలుదేరాయి.

కాలసూచకరాగమయిన ఆనందభైరవిలోను, నిద్రకనుకూలమైన శ్రీరాగములోను, ఈపాటలు ఎక్కువగా పాడ్తారు. సామరాగము, మధ్యమావతి, మొదలైన సాత్వికరాగాలలోకూడా పాడ్తారు. ముఖ్యంగా ఆనందభైరవిలో ఆర్త భావము కనబడుతుంది.

లాలిపాటలు జోలపాటలు అన్ని కాలములలో, అన్నిజాతులలో ఉంటూనే ఉన్నాయి. ఇంగ్లీషులో వీటిని లలబీస్ (*Lullabies*) అంటారు. పాదము చివర *Lulla* పదము, లాలి పదమును మనము చేర్చినట్లే చేరుస్తారు.

అప్పకవి వీటికి కొన్ని ఉదాహరణలు యిచ్చాడు. వాటినిబట్టిచూస్తే లాలిపాటలు జోలపాటలు ఎక్కువగా ద్విపదభేదాలుగాను, క్వచిత్‌గా సీసపద్యము పోలికలోను కనబడుతాయి.

"అతురహారి విక - చాంబురుహాక్షా
యతుపపఖునత - యదుకులదక్షా"

ఈతీరుగా ఉన్న చరణాలలో ద్విపదలలోని చివర లఘువును గురువుగా మార్చినట్లు కనబడుతున్నది.

బమ్మెరపోతరాజుగారు భాగవతములో శ్రీకృష్ణునికి—

"జోజో కమలదళేక్షణ,
జోజో మృగరాజమధ్య జోజో కృష్ణా,
జోజో పల్లవకరపద,
జోజో పూర్ణేందువదన జోజో యనుచున్."

అని కందములో జోలపాట పాడారు.

త్యాగరాజుగారు, రామదాసుగారు, తూము లక్ష్మీనరసింహదాసుగారు మహాభక్తులు గనుక తమ భజనగేయాలలోను కీర్తనలలోను జోల పాటలు లాలిపాటలు కొన్ని రచించారు. సుప్రసిద్ధ వాగ్గేయకారుడైన సారంగపాణిపదాలలోను ఈ పాటలు చాల ఉన్నాయి.

ప్రబోధకరమైన విషయాలు ఈ పాటలలో ఇముడ్చవచ్చును గనుక ఈ కాలానికి అనుగుణ్యమైన మరికొన్ని యీ వాఙ్మయములో చేర్చబడినవి.

ఏడువకు పసిబాల ఏడువకు తండ్రీ
ఏడిస్తే నిను భరతవీరు డనరయ్యా
ఇంక నిద్దురబోర నా చిట్టితండ్రీ
వేళాయెరా సభకు నేనేగవలెను.

అని ప్రచారోద్దేశమైన పాటలుకూడా వింటున్నాము.

వీటికి ఫణితి, సరళత్వము, రాగధోరణి ముఖ్యములు.

కవితావస్తువుఅంత ముఖ్యము కానట్లు కనబడుతున్నది కనుక నే—

చిన్న మా అమ్మాయి చీరకేడ్చింది
వేయరా సాలీడ నేత్రావపట్టు
మురుస్తు సాలీడు మూణ్ణెల్లు నేసె
అరుస్తు చాకలి ఆర్నెల్లు ఉతికె.
అని పిల్లల కుతూహలము గీతించారు.

ఈ పద్ధతులన్ని బిడ్డలను నిదురబుచ్చటానికే అయినప్పటికీ భ్రమరకీటకన్యాయంగా పసిబిడ్డలకు వీరగాథలు అవతారఘట్టాలు, మానవధర్మాలు మొదలైనవి పాడుతూ ఆ వాతావరణము కల్పించి పాటరూపములో, బిడ్డలను వీరులనుగా తయారు చేయాలని మన పెద్దలు యీ పద్ధతి ఆరంభించారు.

ఈ పాటలు జటిలమయిన కవిత్వముగాకుండా సరళశైలిలోఉంటే సౌలభ్యమూ; ఆనందకరమూనైన రాగములో ఉంటే శ్రోత్రపేయమూను.

కాని, ఈ పాటలకు మానవజీవితములో యింత ప్రాముఖ్యమున్నా, ఈ కాలములో ఎక్కువగా ఆదరణ పొందటములేదు. ఇది శోచనీయమే. దేవాలయములలో మాత్రము స్వామికి పవళింపుసేవచేస్తూ జోలపాటలు పాడటము మన భారతీయులలో ఈనాటికీ నిలిచిన నాగరికత!

[హైదరాబాదు రేడియో సౌజన్యముతో]

కవిత - జనత

శ్రీ పి. సత్యనారాయణమూర్తి

సామాన్యంగా అందరకూ జీవితంలో ఏవో కొన్ని అనుభూతు లుంటూనే ఉంటాయి. కాని అవి సామాన్యహృదయాలలో శాశ్వతముద్రను వేయనూలేవు, వారి హృదయంనుండి బహిరంగమయే అవకాశములూ ఉండవు. కాని అవే కళాకారుని సున్నితహృదయాన్ని తాకితే, అతని హృదయంలో సునిశితమైన శాశ్వతముద్రను వేసుకొంటాయి. తన యీ అపూర్వానుభూతుల వలన కలిగిన హృదయస్పందనాన్ని బహిర్గతం చేసి, కళాకారుడు, యితరుల హృదయంలో తాదాత్మ్యమైన స్పందనాన్ని సృజింప ప్రయత్నించినపుడే కళోత్పత్తి జరుగుతుంది. ఈ ప్రయత్నములో కళాకారుడు అనుగమించే వివిధ పంథాలే కవిత్వము, సంగీతము, చిత్రలేఖనము, నాట్యమూను. కనుక ఇవన్నీ కళయొక్క వివిధ రూపాలే నన్నమాట!

ఇవన్నీ ఒకే కళాస్వరూపాలే అగుటవలన వీటిలో తరతమభేదాలుండుట హాస్యాస్పదమే కాని, ఎందువలననో అనాదినుండీ కవిత్వానికి అమితగౌరవ ముంది. ఇది ఒక్క మన భారత భూమిలోనే కాదు ప్రాచ్య, ప్రాశ్చాత్యదేశాలన్నిటిలోనూకూడ ఇదే పరిస్థితి. ఇంతేకాదు—

'కవిని గన్నతల్లి గర్భంబు ధన్యంబు'
....
'తమ్మిచూలి కేలుదమ్మినిగల నేర్పు
'కవి' కలంబునందె కలదు......'

ఇత్యాది సూక్తులు ఎన్నో, ఏనాటినుండో ఈనాటివరకూ విశ్వవ్యాప్తమై, వాడుకలో ఉన్నాయి. వీటినిబట్టి చూస్తే కవిత్వంలోఉన్న ఏ ప్రత్యేకవిశిష్టతో ప్రజాహృదయంలో అత్యున్నతస్థానాన్నందుకోగలిగిందనీ, కవితకూ జనతకూ అనిర్వచనీయమైన ఆత్మీయత ఉందనీ గ్రహించవచ్చు. అయితే ఈ ఆత్మీయతకు కారణమేమిటి? అని విచారిస్తే 'కవిత' వలన 'జనత'కు ఏదోఒక ప్రయోజనం సిద్ధిస్తోందనీ 'కవిత'కు అమితాదరాభిమానాలు లభిస్తున్నాయనీ గ్రహించవచ్చు. 'కవిత' వలన 'జనత'కు సిద్ధించే ప్రయోజనం ఏమిటి?

కళారూపకమైన 'కవిత' ద్వారా ప్రజల మనస్సు క్షాళితమౌతుంది; మనస్సులోని మాలిన్యాన్ని 'కవిత' కడిగివేసి జీవితానికి నవజీవనాన్నిస్తుంది. అంటే, కవితపై ఆ కాలపు జనత పురోగమ తిరోగమనాలాధారపడి ఉంటాయన్నమాట! 'జనత' సాధారణంగా తీసికొని 'కవిత' సాగుతుంది. ఇదే 'కవిత'కూ 'జనత'కూ గల సంబంధం.

అనాదిలో, అనగా, చరిత్ర క్రీస్తుశెఖలకందని రోజుల్లో మహోత్తమప్రచారకుడూ, ఆధ్యాత్మికతత్పరుడు అయిన వ్యాసభగవానులావిర్భవించారు. అప్పటికి దేశంలో తర్కము బహుళవ్యాప్తమై, 'విస్సన్న చెప్పినదే వేద' మన్నట్లు తార్కికుడు చేసిన విషయనిర్ణయమే స్థిరీకరింపబడి, నిజముగా ధర్మమేదియో అధర్మమేదియో తెలియక ప్రజలుబాధలుపడుతున్నారు. అట్టి పరిస్థితిలో వ్యాసుడు పురాణములను రచించి ధర్మాన్ని సుస్థిరంచేసి పతితముకాబోయే హైందవజాతిని సముద్ధరించాడు. వ్యాసుని 'కవిత' అనాటి 'జనత'కి యుగప్రవక్తయై నాటినుండి నేటివరకూ అమిత గౌరవాన్నందుతూనే ఉంది. "వ్యాసుడు ఆధ్యాత్మిక చింతనతో తపస్సు చేసికుంటూ కూర్చోలేకనే పురాణాలు లిఖించాడా?" కాదు. ఆయనకు సార్వర్థపరత్వమే ఉంటే తాను ఒక్కడూ ముక్తిపొందే ఏ సులభోపాయాన్నో గ్రహించి ముక్కు మూసుకు నే కూర్చునేవాడు. కాని అతడు స్వార్థపరుడుకాడు. తన జాతికి నైతికపతనం కలుగుతోందంటే, తన సోదరులు అధర్మమార్గావలంబులై నశించి పోతున్నారంటే చూస్తూ ఊరుకోగలడా? అందులకే తన జాతికి ధర్మప్రబోధనుచేశాడు. హైందవజాతిపతనాన్ని అరికట్టాడు. అతడు చేసిన మహోపకారానికి ప్రతిఫలంగా హైందవజాతి వ్యాసునికి, వ్యాసుని కవితకూ కైమోడ్పు చేసింది.

దాస్యశృంఖలాబద్ధమైన దేశంలో తన గీతికల ద్వారా స్వాతంత్ర్యశంఖాన్ని పూరించి, విస్మరించబడిన దేశస్వాతంత్ర్యాన్ని జ్ఞప్తికి తెచ్చిన 'విశ్వకవి'కి అతని 'కవిత'కు అంజలి ఘటించాము. "విశ్వకవి మా భారతీయుడు"ని గర్వంగా చెప్పుకుంటున్నాము.

ఇదేవిధంగా ఏ దేశచరిత్రను తిలకించినా, పతితము కాబోయే సమాజాన్నీ, సంస్కృతినీ సముద్ధరించినవారూ, యుగప్రవక్తలవలె విశ్వశ్రేయస్సుకై పాటుపడినవారూ కవులే! "ఈనాడు కవులకన్న రాజకీయనాయకులే ప్రజాహృదయాన్నమితంగా చూఱగొన్నార"ని భ్రమిస్తాము. కాని ప్రజాహృదయాలలో రాజకీయనాయకులు శాశ్వతస్థానాన్ని సంపాదించడం అరుదు. ఈనాడు ప్రజాహృదయాన్నందుకొన్న నాయకుడు, రేపు త్యజీకరించబడతాడు. ఈనాడు గౌరవించబడిన నాయకుడు మరునాడు అగౌరవాన్నందుతాడు. ఇది రాజకీయాలు చేసే విలాసచేష్ట! కాని కవులపట్ల ప్రజాహృదయమల్లాగ ప్రవర్తించదు. ఏకవి, 'కవిత' యైనా 'జనత' హృదయాన్నందుకుంది అంటే అది ఇంక శాశ్వతమే! దానికిక చలనం లేదు.

తరతరాల, వరసరాల జీర్ణించిన అవినీతి నశించాలన్నా, యుగయుగాలుగా పతనం చెందిన నైతికశక్తి సముద్ధరింపబడాలన్నా, విస్మరింపబడిన కర్తవ్యాన్ని ప్రజలకు జ్ఞప్తిచెయ్యాలన్నా కలాలబలాలే పనిజేస్తాయి. ప్రజాహృదయంతో సమ్మిళితమై, వారి జీవితాలపై ఆధారపడి జీవితాని కతీతమైన అనుభవానికి 'కవిత' సాధన మౌతుంది.

అందుకే 'జనత' కి 'కవిత'పై అంతటి మమత! 'కవిత'కూ'జనత'కూ ఏనాటినుండో ఈనాటివరకూ అనిర్వచనీయమైన ఆత్మీయత ఉంది. ఎన్ని దుష్టశక్తులు విజృంభించినాసరే 'కవిత' కూ 'జనత'కూ గల యీ అనుబంధాన్ని త్రెంచలేవు! సృష్టియున్నంతవరకూ 'కవిత'కూ జనతకూ గల యీ గాఢానుబంధం అవిరళంగా సాగిపోవలసిందే! ఇది సత్యం!! యుగయుగాలుగా స్థిరీకరించబడిన సత్యం!!!

స్థానిక :

కరటకమూర్తి

శ్రీ డి. యస్. పరమేశ్వరరావు

అతడు చూస్తే పెద్దమనిషి.

ఆ పెద్దమనిషి, షైక్ ఫిలింకంపెనీతో చేసిన రెండురోజుల పరిచయంతో.

'ఏమండీ! ఆర్డర్లు, బుక్ చేయిస్తూంటాను. కాన్వాస్ చేస్తాను. అయినా ముందు దీనికి ప్రాపగాండా వాల్యూ '

'సరే, ఆర్డర్లు బుక్ చేయించి, అడ్వాన్సులు పట్టుకురండి. కొంత అలవెన్సు యిస్తాము. అయినా యింకో పదిహేనురోజులు...'

'కాని ప్రస్తుతం.. '

'అదే నే నసేది. ప్రస్తుతం . ఉద్యోగం ఉండదు. సత్యనారాయణపురంలో, యిదిగో యీఅడ్రసుఆయనకు, ఓ మనిషి కావాలట వెళ్ళి, కనుక్కోండి.'

'నిజంగా మీ పరిచయభాగ్యం కలగటం నాకు చాలా సంతోషంగా వుంది ; వెళ్ళొస్తా.'

– జేబూ నిండుకున్నా, ఉద్యోగం వస్తే, బతిమాలి యజమానిని ప్రార్థించి పైకం తీసుకుని, రిక్షాకు యివ్వొచ్చనే ఊహాసౌధం నిర్మించి, ఆ పెద్దమనిషి కంపెనీమెట్లు దిగుతూంటే, గుటకలు మింగుతూ, ఆశాహృదయంతో యీయన్ని చూస్తూ, ఆహ్వానించాడా రిక్షావాడు.

'ఎక్కడికి బా[illegible]'

'సత్యనారాయణ పురం, గుడివద్దకు పోనియ్య !'

గుడిపక్కన కనుక్కుంటే, అక్కడ వున్నవాళ్లు ఈఅడ్రసుఆయన కొత్తగుళ్లవద్ద వున్నాడని చెప్పారు.

'ఒరేయి! రిక్షా త్రిప్పు!' అనే ఆజ్ఞ విని రిక్షావాడు 'బాబూ' ఎక్కండి' అన్నాడు.

కొత్తగుళ్ల వద్ద కనుక్కుంటే, యజమానిగారు, మైలుమూరంలో వున్న తోటలో వున్నారని ఆ పెద్దమనిషికి తెలిసింది.

అక్కణ్నుంచి ఆ రిక్షా, రయ్యమని తోటవద్దకు పరుగెత్తింది. ఆ యజమాని అడిగారు.

'అదివరకు ఏం చేశారు ?'

'రన్నర్, సర్వర్, టీచర్ !'

యజమాని తెల్లపోయాడు.

'రేపు రండి...మాట్లాడదాం.'

ఇంట్లోకి వెళ్లి, గంటన్నరకు ఆ యజమాని బయటకు వచ్చాడు.

'ఇంకా ఇక్కడే వున్నారేం ?'

'ప్రస్తుతం...'

'ప్రస్తుతం వీల్లేదు. రేపు రమ్మన్నా.'

'చిత్తం. కాని ప్రస్తుతం ఒక్కకానీ లేదండి. ఒక్క రూపాయి యిస్తే, రేపు వచ్చేటప్పుడు తిరిగి తెస్తాను. దయయుంచి...'

'...ఊహుం, పొండి, వెళ్లండి, వెళ్లిపొండి!'

మధ్యాహ్నం ఒంటిగంటవరకు ఆ పెద్దమనిషి, రిక్షావాడు అన్నం లేక మాడుతున్నారు. అక్కడే వున్నది షైక్ ఫిలింకంపెనీ ప్రొప్రయిటరుగారిల్లు. ఈపాటికి యింటికి వచ్చివుంటారు

'ఒరేయి రిక్షా! అటు పద.'

'బాబూ ఆకలేస్తోంది.'

'..............'

'..............'

'ఆఁ ఇదే మేడ...ఆపు. ఇక్కడుండు ఇప్పుడే వస్తా.'

ఆ పెద్దమనిషి సరాసరి ఇంట్లోకి వెళ్లాడు. అక్కడ తద్దినంబ్రాహ్మలు లేచారు. వడ్డన జరుగుతోం దని తెలిసింది. ఇంట్లోకి వెళ్లి, నూతివద్ద స్నానం మొదలుపెట్టాడు. ఈ వింత చనువూ, చొరవా, చూస్తే ఆ ప్రొప్రయిటరుగారికి ఆశ్చర్యం వేసింది.

'ఏమండోయి !'

'మీ పరిచయభాగ్యం నన్నిక్కడకు...'

'ఇంతకూ మీరు భోంచెయ్యలేదా ?'

'లేదండి'

'సరే భోంచేద్దురుగాని రండి.'

తాంబూలం నములుతూ వచ్చి, తిరిగి రిక్షా ఎక్కాడు. ఈ మేడా, గాంధీనగరంలో వున్న కంపెనీ వీరిదేగా వుంది, బహు గొప్పోరు' అనుకున్నాడు రిక్షావాడు. అతడికీ ఆకలిగా వుంది.

'బాబూ' ఆకలేస్తోంది డబ్బిప్పించండి పోతా !'

'ఎక్కడికి?'

'గాంధీనగరం...ఇంటి కెళ్లి బువ్వ తింటా బాబు.' 'పద; నేనూ అక్కడికే మళ్లీ వెళ్లాలి. మరి ఊళ్ళోకి పోవాలే'

'ఊళ్ళోకి రానండి. పన్నెండణాలు అయిందండి యిప్పటికి'

'...........'

గాంధీనగరంలో ఒక ఖాళీరిక్షా పోతూంటే, దాన్ని పిలిచాడు ఆ పెద్దమనిషి.

'ఒరేయి ! వీడికి తొందరగా వుందిట. పోతాడట. నాదగ్గర చిల్లర లేదు. వందరూపాయిలనోటుంది. వీడికి ఒక ముప్పావులా యిస్తే, యిదీ, నీకు యిహ అయ్యే బాడుగా, పూళ్ళో మార్చి యిస్తా.

బాబుగారి పాపుడైసుపట్టు, గ్లాస్కో పంచె, చూసి ఈ రిక్షావాడు ఆయనో గొప్ప వాడని నమ్మి, మొదటివాడికి ఆ ముప్పావులా యిచ్చి పంపి, 'ఎక్కండి బాబూ !' అన్నాడు.

'ఎక్కడికి సామీ ?'

'సామారంగంచౌకు.'

సామారంగంచౌకులో సైకిల్ షాపులో ఒక గంటసేపు మాట్లాడి 'పో రా ఫూల్' అని ఘాటుగా అనిపించుకున్న మాట, ఆ రిక్షావాడికి ఎక్కడ వినపడుతుందో అని భయపడి, ఏం తోచక మళ్లీ రిక్షా ఎక్కాడు.

'గవర్నరుపేటమార్కెటుకు పోనియ్య.'

అక్కడ పొగాకుకొట్టుమనిషి 'ఏం బాబు ! క్షేమయిన పుగాకు, నాణ్యమైనరకం మొన్ననే వచ్చింది' అన్నాడు, ఆహ్వానిస్తూ.

'అది కాదుగాని, యీ కలం నీదగ్గరుంచుకుని ఒక్క రెండురూపాయిలు యియ్య. ఇప్పుడు ప్రస్తుతం...'

కొట్టుమనిషి తెల్లపోయి, 'నాదగ్గర వద్దు బాబు; కెవ్వేలకద్దకు పొండి.' అన్నాడు.

ఆ పెద్దమనిషికి కడుపులో దిగులు పుట్టింది. మళ్లీ రిక్షా ఎక్కాడు.

'ఏం బాబు చాలాసేపు అయింది. పొద్దు కుంకుతోంది. నేను పోతాను డబ్బు యిప్పించండి.'

'పద. ఇక్కడికేగదరా! గాంధీనగరం షైక్ ఫిలింకంపెనీలో యీనోటు మార్చి నీ కిచ్చేస్తా. ఆ విషయం మరిచిపోయాను.'

షైక్ ఫిలింకంపెనీలో మూరాడు.

'ఒక్క రెండురూపాయిలు బదులు ఇవ్వండి. రేపు తిరిగి ఇచ్చేస్తాను. ఈ రిక్షావాడి కివ్వాలి.'

'డబ్బులు లేకుండా రిక్షా ఎందుకు ఎక్కారు ?'

'ఉద్యోగం వస్తే, అడ్వాన్సు బతిమాలి తీసుకుందా మని..'

'ఎక్కడకు వెళ్ళారు, రెండురూపాయిల బాడుగకు ?'

'........ ......'

ప్రొప్రయిటరుగారు లోపలకు వెళ్లి, గోపాలరావుగారితో సంప్రతించారు.

'రెండురోజుల్లో, యిదేం పరిచయమండీ, యీ చొరవ ఎక్కడా చూడలేదు ! ముందు దొరుకుతుం దని డబ్బు లేకుండా రిక్షా ఎక్కటమేమిటి ! పిలవని పేరటం అన్నట్లు, మీ యింటికి భోజనానికి రావడం ఏమిటి ? రెండు రూపాయిల బాడుగ ఏమిటి.. సరే కాని వ్వండి...'

—ఎవరో పిలుస్తున్నారు.

గోపాలరావుగారు ఆ పిలుపు విని, మేడ మీదనుంచి క్రిందకు చూశారు.

'ఎవరు ?'

'బాబూ, చాలా ఆలస్యమైంది. వంద రూపాయిలచిల్లరనీ రిస్తారట.వార్ని రమ్మనండి.'

'ఎవర్ని ?'

'ఇప్పు డొచ్చినవారే......పొద్దు కుంకుతోంది ! నేను పోతాను రమ్మనండి.'

'ఈ పెద్దమనిషి, చూడగా అందర్ని ఎక్స్ప్లాయిట్ చేస్తున్నాడల్లే వుంది. పొమ్మనండి. మనం యివ్వవద్దు.'

ఆ పెద్దమనిషితో ప్రొప్రయిటరుగారు లేదన్నవెంటనే, ఆయన కుర్చీలో కూలబడ్డారు. పావుగంటవరకు లేవలేదు. చిల్ల రిస్తానన్నాయన వెళ్లిపోయాడు. రిక్షావాడు రెండుసార్లు కేకేసి, మళ్లీ దిగి, రిక్షాను గడప కడ్డంగా లాగి, చిరిగిన చొక్కా చేతులు పైకి మడుస్తూ, దానిమీద కూర్చుని బైఠాయించాడు.

చివరకా పెద్దమనిషి క్రిందకు దిగివచ్చి, దీనవదనంతో 'రేపు రా యిస్తా' నన్నాడు.

రిక్షావాడికి మండింది. 'వీల్లేదు. యిప్పుడు పగెయి రెండున్నర !' అన్నాడు.

'కాదురే రేపు రా...'

రిక్షావాడు ఆయన్ని తెగతిట్టాడు. అరిచాడు. చివరకు కాలర్ పట్టుకున్నాడు.

మరి కాసేపటిలో, ఆ నగరవీధిలో, దాదాపు ఒక వందమంది ప్రజలమధ్యలో నిలబడి వున్నాడు ఆ పెద్దమనిషి.

'నాలుగు వెయ్యరా చూస్తా వేం ?'

'వేస్తే, వాడి రెండున్నర ఎట్లా వస్తుంది ?'

'నా సొంతడబ్బు ముప్పావులా కూడా వదిలించాడు సామి !'

'మధ్యాహ్నం రెండింటినుంచి, యిప్పటిదాకా తిప్పాడుట పాపం వాణ్ణి !'

'కలం లాక్కోరా !'

'నే నేం చేసుకుంటాను బాబూ '

'గుడ్డలు విప్పించండి'

'చొక్కా చాలు'

'ఊహుం వాడి బాడుగకురీదుకు చొక్కా యింకా ఇట్లా ఎప్పుడూ చెయ్యకుండా శిక్షకు పంచె'


ఆ ప్రజాసమూహమంతా నవ్వింది.

'ఇదిగో యీ చిరిగిన తువ్వాలు కట్టుకో మను !'

ఆ ప్రజలు, చొక్కా పంచె విప్పించారు. ఆ తువ్వాలు ఆయనకు చుట్టబెట్టారు.

ఆయనమొహాన నెత్తురుచుక్క లేదు. కాని చివరకు ఆయన వెళ్ళిపోయేపద్ధతి, [ఆ]నపక, ఆ వాలకంచూస్తే, తన ప్రవర్తనకు ఏమాత్రం పశ్చాత్తాపం పడ్డట్టులేదు.

'యీ వెధవ ఇట్లా సత్రంలో రాళ్లు కొట్టటానికి యిది అయిదవసారి' అనే మాటలు వెళ్లిపోయేగుంపులోనుంచి వినపడ్డతరువాత, షైక్ ఫిలింకంపెనీ ప్రొప్రయిటరుగారు, మరింత ఆశ్చర్యపడ్డారు.



న్యూయార్కు శిశు చికిత్సాలయంలో తరిఫీదుపొందిన నర్సులు—తమ ఆవాసాలనుంచి, చికిత్సాలయానికి వస్తున్నారు.

స్వప్నసుందరి

(8-వ పేజీ తరువాయి)

రాజు : ఏం చేస్తావేమిటి ?

విదూ : ఏం జేస్తానా ! చూడు నా మజా ! మేఖలని నేను నలుగురిలోనూ నవ్వులపాలు చెయ్యకపోతే నా పేరు నారాయణుడు కాదు.

రాజు : నువ్వేదో కొంపముంచేటట్టున్నావు. అదేదో కాస్త నా చెవిని పడవెయ్యి.

విదూ : అయితే విను ! ఉండు ! ఈ సమీపంలో ఎవరూ లేరుగదా !

రాజు : లేరులే ! భయంలేదు చెప్పు.

విదూ : మన కళావతిసోదరుడు నాగవర్మని ఎరుగుదువా ?

రాజు : ఆఁ ! అవును తెలియకేం !

విదూ : మేఖల నాగవర్మకోసమని ఇల్లాగ విలవిల్లాడిపోతూంది !

రాజు : నీ కెవరు చెప్పారు ?

విదూ : నాకు దీని వ్యవహారం తెలియ దను కున్నావా ? కళావతే చెప్పింది !

రాజు : సరేనయ్యా, నువ్వు చెప్పిందే నిజ మనుకో. మీ రిద్దరూ మేఖల నేం జెయ్యగలరు ?

విదూ : చెబుతున్నానుగా. పెదవి దాటితే పృథివి దాటుతుంది సుమా !

రాజు : ఎంత మాటన్నావు.

విదూ : (రహస్యంగా) ఇదీ ఎత్తు.

రాజు : లాభంలేదు. దేవికి దొరికిపోతారు చివరికి !

విదూ : అవుననుకో,. అయితే నీ సలహా ఏమిటి ?

రాజు : చెప్పనా. ఈ సలహా నేను చెప్పానంటే-మన ఇద్దరి కుత్తుకలూ ఉత్తరించుకు పోయాయన్నమాటే.

విదూ : నన్ను పొత్తిగా వట్రివాడికింద జమ కట్టేశావా ?

రాజు : (చెవిలో రహస్యంగా) ఇల్లాగ చేస్తే దేవికి తెలియడం కష్టం.

విదూ : సెబాష్. వరహా విలవైన సలహా చెశావు.

రాజు : దేవికి నేను సలహాఇచ్చి చేయించినట్టు తెలియగూడదుసుమా ! ఎవరో వచ్చేవారు ? మన మాటలు ఈ ప్రాంతంలో ఎక్కడా పొంచుండి వినలేదుకదా !

విదూ : ఏమో ! ఏం చెప్పగలం ? ఆ వచ్చేది చతురిక. ఇదీ దేవిగారి ఆప్తవర్గంలోనిదే ! (చతురిక ప్రవేశం)

రాజు : ఏమి చతురికా ! ఇల్లాగ వచ్చావు ?

చతు : ప్రభూ ! శ్రీ లాటదేశ యువరాజులుంగారు ఈ వేళ గోధూళికానంతరం వీణాగోష్ఠి జరపనున్నారు. తమర్ని సపరివారంగా అక్కడికి విచ్చేసి, తమ వీణాగోష్ఠిని అనుగ్రహింప వలసిందని అర్థిస్తున్నారు !

రాజు : యువరాజులుంగారికి ఇది మేము మామీద చూపిన ఒక ప్రత్యేకానుగ్రహంగా భావించుకున్నామని విశదపరచు.

చతు : చిత్తము.

విదూ : వయస్యా ! యువరాజులుంగారికి, వీణాగోష్ఠి అంటే ఉన్న ఉత్సాహం వీరవిద్యల్లో కనబడదే !

రాజు : నువ్వేదో మహా వీరాధివీరుడిలాగ మాట్లాడుతున్నావే !

విదూ : నేను చేసిన మహాయుద్ధాల సంగతి నీ కేమి తెలుసును !

చతు : మే మెప్పుడూ మీ వీరకృత్యాలు విననైనా వినలేదే.

విదూ : నేను దధ్యోదనం, పర్వతాలు పర్వతాలు గుటకాయస్వాహా చేసివేశాను. పాయస నదులు ఊహూని ఊదివేశాను. లడ్డూ సైన్యాలు, ఉండ్రాళ్ల బలాలు ! ఒకటేమిటి ! సమస్తమూ కనుచూపుమాత్రంలో నురుమాడినాను. మాత్రావశేషం చేసివేశాను. నేను భోజనయుద్ధంలో ఎప్పుడైనా వెన్నిచ్చానా ?

చతురిక : అసలు మీరు - ఈశ్వరు డిచ్చిన ఉదరమేగాని, ఇంక వెన్నెక్కడిది ? (అందరూ నవ్వుతారు)

౪

(అంతఃపురంలో రాత్రి - చతురిక, మదనిక మాట్లాడుకుంటూంటారు. తర వాత పాట వినిపిస్తుంది.)

పాట

చిమ్మ చీకటినైనా
కొమ్మరో ! బెదరుదునే !
కమ్మవిలుకాడు వాడి
యమ్ముల సాయమ్మగదే !
పొమ్మ ! మాటలేల !
విననూ, సుమ్మిక నీవేమనినా !
నెమ్మేన భరింప వేగ !
సొమ్ములు తేవే ! లలనా !
అమ్మ చెల్ల ! వాని యావ
నమ్మ నిలువుదోచినదే !
అమ్మలక్క లేమనినా !
నెమ్మన మిక నిలుచునదే !
చిమ్మ చీకటినైనా
కొమ్మరో బెదరుదునే !
కమ్మ విలుకాడు వాడి
యమ్ముల సాయమ్మగదే !

మద : ఏమే ! చతురికా ! మంచి హుషారుగా ఉన్నావు. ఏమిటి కథ ?

చతు : నీ కింకా తెలియనే లేదా !

మద : అదేమిటే, నే నేమీ వినలేదే ?

చతు : ఉండు ! ఉండు ఈ శారికాపంజరం తీసి ఇంకొకచోట ఉంచివస్తాను. లేకపోతే ఈ మైనకోరుకంక, మనం అనుకున్న మాటలన్నీ విని, మళ్లీ ఇంకొకళ్ల దగ్గర ఏకరువు పెట్టగలదు. (వెళ్లి వచ్చిన ధ్వని)

చతు : ఇదిగో, ఏం జరిగిందనుకున్నావు ! (నవ్వు)

మద : అబ్బ ! చెబుదూ ! నవ్వక.

చతు : మేఖల పని......(నవ్వు) మేఖల పని మాబాగా అయిందిలే ! (నవ్వు)

మద : ఏం జరిగిందే ?

చతురిక : మన మేఖలసంగతీ, నాగవర్మ సంగతీ తెలుసునా ! నీకు ?

మద : ఎవరే నాగవర్మ.

చతు : అబ్బ, కళావతి అన్నే, అచ్చం కళావతిలానే ఉంటాడు, అతనే.

మద : ఆఁ. అవునవును. ఇప్పుడు జ్ఞాపకం వచ్చింది. అయితే ఏం జరిగింది ?

చతు : పాపం మేఖల నిన్నరాత్రి ఎవరి దగ్గరో ఏడువారాల నగలూ ఎరువు తెచ్చుకుని, అలంకరించుకుని—

మద : అబ్బా. నగలు తెచ్చుకున్నాక, అలంకరించుకోకేమిటే ? త్వరగా తెమలనిద్దూ.

చతు : అబ్బా. నీ కంత కంగా రెందుకే. చెప్పనీ-అల్లాగ అలంకరించుకుని మాలతీలతా మంటపంలో అతనికోసం కళ్లు వాచిపోయేటట్లు అల్లానే కనిపెట్టుకుని కూర్చుందిట.

మద : ఆ తరవాత ?

చతు : సరే. ఇంచుమించుగా అర్ధరాత్రివేళ నాగవర్మ వచ్చాడు.

మద : ఏడవలేకపోయాడు ! అంత అర్ధరాత్రిదాకా ఏంజేస్తున్నాడే.

చతు : అబ్బ. మధ్య నీకు కంగారు పట్టుకుం దేమిటి ? కొసదాకా చెప్పనీ.

మద : సరే ! పోనీలే ! కానీ.

చతు : అతన్ని చూసేసరికి, మేఖల అతన్ని కౌగలించుకుని 'హృదయేశ్వరా, మీకోసం నే నిలా ఎదురు తెన్నులు కాసి చూస్తూంటే, మీ రిలాగ జాగుచెయ్యడం న్యాయమేనా ?' అని బుడిబుడి దీర్ఘాలు తియ్యడం మొదలుపెట్టింది.

మద : బాగుంది ఇక ఇప్పుడా ఈ భాగోతం అంతాను.

చతు : వినవే. అప్పుడే ం జరిగిందను కున్నావు. నాగవర్మ ఒక్కనిమిషం ఊరుకుని లోలోపల నవ్వుకోడం మొదలుపెట్టాడు.

మద : వీళ్లిద్దరికీగాని మతిపోలేదుకద.

చతు : మధ్యని నీకు పోతోంది. మరి !

మద : లేకపోతే వాళ్లకి అదేంపనే. శుభమల్లే మేఖల బుడిబుడి దీర్ఘాలు తియ్యడమూ బాగానే ఉంది. ఆ అబ్బి నవ్వడమూ బాగానే ఉంది. అతనికి అదేం పొయ్యేకాలమే.

చతు : చెబుతూంటేనే-అప్పుడు పాపం మేఖల బిక్కమొహం వేసుకుని అతనికేసి చూడడం మొదలు పెట్టింది.

మద : ఇంకా నయం ! ఏడవడం మొదలు పెట్టిందన్నావు కావు ! తరవాత ఏం జరిగిందో ! త్వరగా చెప్పవేమే !

చతు : తీరా తేరిపారచూస్తే అది నాగవర్మ కాదు.

మద : అయితే ఒట్టి సచ్చు నాగన్నన్న మాట. (నవ్వు)

చతు : నాగన్నైనా బాగానే ఉండును.

మద : నాగన్న కాకపోతే నాగమ్మన్న మాట.

చతు : ఆఖరికి అదికూడా కాదు.

మద : అయితే ఎవరు ?

చతు : కళావతి.

మద : చిత్రం ! కళావతి ఎంత జాణ !! తర వాత ఏం జరిగింది ?

చతు : ఇం కేముంది, జరగడానికి. కళావతి అక్కడినించి రివ్వున పారిపోయింది. పాపం, మేఖల అక్కడే ఏడుస్తూకూచుంది.

మద : దానికి అల్లాగ శాస్తి జరగవలసిందే. ఇల్లాంటి అపభ్రంశపు పనులు ఇంకెప్పుడూ చెయ్యకుండాను !

చతు : ఇంకా శాస్తి పూర్తికాలేదు వినుమరి.

మద : ఇంకేం జరిగింది.

చతు : ఇంతలో నారాయణుడు అక్కడికి వచ్చి మేఖలని ఓదార్చడం ప్రారంభించాడు.

మద : బాగానే ఉంది. ఏదో సామ్యం చెప్పినట్టుంది ఈ సరసం.

చతు : ఆ తరవాత మేఖలకి మరింత ఉడుకు మోతుతనం ఎక్కువైంది. ఆ ఉడుకుమోతుతనం పట్టలేక మరింత బిగ్గరగా రాగాలు తియడం మొదలుపెట్టింది.

మద : ఇంకా ఏడవడం కూడానా. సిగ్గూ బిడియం లేకపోతే సరి.

చతు : విను. ఇంతలో మహారాజుగారు 'నారాయణా' అనిపిలుస్తూ అక్కడికి వచ్చారు. ఇంక మేఖల ఆయనముఖం చూడలేక దేవిగారి దగ్గరకు వెళ్లిపోయింది.

మద : ఇకనేం. ఆమెతో గోరంతలు కొండంతలుగా చెప్పడానికి వెళ్లిందన్నమాట !

చతు : అవును. అంతే. దేవిగారికి అన్నీ పూసగుచ్చినట్టు చెప్పి, రాగాలు మొదలుపెట్టిందట. మరి ఆమె ఏమి చెప్పిందోగాని ఆమె మహారాజుగారే ఇదంతా చేయించారని కారాలూ, మిరియాలూ నూరుతున్నారట.

మద : చూశావా, మరి. మనం ఈ మాటలు చెప్పుకుంటూన్నట్టు తెలిస్తే ఆమెకు మనమీద కూడా కోపం రావచ్చును. నడు. నడు. ఈపాటికి పోదాము.

(ఇద్దరూ వెళ్లిపోతారు)

౫

(లాటయువరాజు మృగాంకవర్మ ప్రాసాదం మృగాంకవర్మ ఎదురుగా బంగారుచిలక పంజరం వేలాడుతూంటుంది. మృగాంకవర్మ పాట.)

పాట

చిలకా. ఒకపరి చెప్పరాదటే !
చెలువునితో ఈ మాట
కలకాలమ్మెదలో దాచినదీ
తెలుపు వరాలమూట !
చెలితో చలికెదుగానీ ! వినుమొక
పలుకే ! మాట ! మాట !
పులకండము పెట్టెదనే ! ముద్దులు
గులికే కెంపులనోట !
చిలకా ఒకపరి చెప్పరాదటే
చెలువునితో ఈ మాట.

(మీరు కోరితే చిలకేం భాగ్యము ! చిలకల్లాంటి చేటికలే వలతారు !)

మృగా : ఎవరిది ?

(ధ్వని 'ఒక చిలక' అని కళ్లు మూస్తుంది.)

మృగా : ఎవరది ? వొదలండి ! కళావతీ ! నువ్వా ! ఎంతసేపయింది వచ్చి ?

కళా : నేను మీ వెనుకనే ఉన్నాను.

మృగా : నిజంగా ?

కళా : అవును.

మృగా : ఎంతసేపయింది వచ్చి ?

కళా : ఎంతసేపయితేనేం ! మీరు వెనక ఉన్నవారిని కూడా కనుకోలేని స్థితిలో ఉన్నారుగదా !

మృగా : అబ్బే ! అదేమిటి. ఊరికే ఉబుసుపోక పాడుకుంటున్నాను ! కళావతీ !

కళా : ఉత్తది. నాకు తెలియదనుకున్నారా ? అన్నీ తెలుసును !

మృగా : ఏమిటి. మహా బెదిరిస్తూ మాటలాడుతున్నావు. నీకు తెలిసిందేమిటో చెప్పు. చూస్తాను !

కళా : చెప్పమన్నారా. చెబితే ఒప్పుకుంటారా ?

మృగా : ఆఁ.

కళా : ఖరారేనా ?

మృగా : అవును.

కళా : చాలా చిన్నప్పటినుంచీ మీ మనస్సెక్కడో లగ్నమై ఉంది.

మృగా : కాదు !

కళా : మీ తండ్రిగారు శత్రుభయంవల్ల మిమ్మల్ని ఇక్కడికి పంపించినా అది మీ రహస్య మనోరథసిద్ధికే కారణం అయింది ?

మృగా : (గద్గదతో) ఉత్తది !

కళా : ఎందుకు నాదగ్గర దాస్తారు. మీరు దాస్తే మీ గద్గదిక దాచనిస్తుందా ? అసలు మీరు మీరు కాదు.

మృగా : ఇదేదో మెట్టవేదాంతం మాట్లాడుతున్నావేం ?

కళా : మెట్టవేదాంతం కాదు, మీ గుట్టు వేదాంతమే.

మృగా : అవురా ! నెరజాణ ! నీ కివి అన్నీ తెలిశాయి.

కళా : ఈమాత్రం ఎరక్కపోతే ఈ అంతఃపురాలలో మెలగగలమా ?

మృగా : అంతఃపురాల్లోనే గాదు ! అంతరాంతరాల్లో మసలగలిగిన మాయలాడివి, నీవు. నాకే తెలుసుననుకున్న విషయం నీ కెలా తెలిసిందో ?

కళా : మీకు తెలియనివీ - తెలుసుకోవాలని కుతూహలపడుతూన్నవీ కూడా నాకు తెలుసును.

మృగా : కళావతీ, అన్నీ తెలిసినదానవు ! ఇంక నీతో ఏమని చెప్పను. నాకు మాత్రం ఎటు చూచినా దారి కనపడకుండా ఉంది.

కళా : నేను దారి చూపిస్తాను. నా కొక్కదానికే ఆదారి తెలుసును.

మృగా : మహా రాజమందిరంలోకే !

కళా : అవును.

మృగా : ఎవరన్నా చూస్తే—

కళా : ఎవరూ చూడలేనిది. రహస్యమైన సొరంగమార్గం ఒకటి ఉంది. చెబితే నా కేమిస్తారో ?

మృగా : ఏమిస్తే నీ ఋణం తీరుతుంది కళావతీ !

కళా : ఇంత వేదన మనస్సులో ఉన్నా ఇంత సన్నిహితురాలిని నాతో ఒక్కమాటైనా చెప్పారుకారు గదా !

మృగా : అన్నీ తెలిసినదానవు. చెప్పగలిగితే వేదన ఎల్లా అవుతుంది కళావతీ !.

కళా : ఎంతతీవ్రమైన వేదన, మీది !

(సశేషం)

కులాసా కబుర్లు

"బహు నాయకం"

[జి. యస్. సూరి]

ఆంధ్రదేశంలో అందరూ నాయకులే నని చమత్కరించేవాడు గాంధీమహాత్ముడు. వార్డునాయకులు, ఫిర్కా నాయకులు, తాలూకా నాయకులు, జిల్లానాయకులు - అంతా నాయకుల మయం. అయితే ఇందరు నాయకులు ఉన్నప్పటికీ అందరూ మహాత్ముడి శిష్యులే కావటంవల్ల అట్టే ఇబ్బందిలేకుండా వెళ్లిపోయింది. ఆయన అవతారం చాలించనంత వరకు బహునాయకపు బాధలు మనకు ఏవిధంగానూ కనబడలేదు. ఇప్పుడిప్పుడే అవి తెలిసి వస్తున్నవి.

దేవుడిని అయేది, మానవుడిని అయేది; ఏదో ఒక్కడిని నమ్ముకుంటే ప్రయోజనం ఉంటుంది కాని అటు పోలేరమ్మకు జాతరచేయిస్తూ, ఇటు ఆంజనేయస్వామికి అప్పాలు పోయిస్తూ మరొకవైపు మస్తాన్ సాహేబుకు మిఠాయి చదివిస్తూ ఉంటే ఫలితం దక్కదు సరిగదా ఆ దేవుళ్లలో దేవుళ్లకే అభిప్రాయభేదాలు అవతరించితీరుతవి. అదేవిధంగా నాయకులు అధికమైనకొద్దీ ప్రజలకు ఎంతమాత్రమూ కలిసిరాదు. అందుకనే బహునాయకం పనికిరాదన్నారు మన పూర్వులు. వైద్యులు తర్జనభర్జనలు జరిపితే బాధపడేవాళ్లు రోగులు.

ఇతరరాష్ట్రాలవాళ్లు ఈ విషయంలో వివేకంతోనూ, జాగ్రత్తతోనూ ప్రవర్తించారు. మనకు జ్ఞాపకం ఉన్నంతవరకూ గుజరాతీలకు సర్దారు వల్లభాయిపటేలు ఏకైకనాయకుడు. ఆయనను నమ్ముకున్నందువల్ల గూర్జరులకు అన్నివిధాలా మేలే కలిగింది. ఆ ధీరనాయకుడి చలవవల్ల బొంబాయి పట్టణం న్యాయంగా మహారాష్ట్రులకు సంక్రమించకుండా గుజరాతీవ్యాపారస్థుల ఆధీనంలో ఉండేటట్లు ఏర్పాటు జరిగింది. చాలకాలంనుంచీ తమిళనాడుకు శ్రీమాన్ చక్రవర్తి రాజగోపాలాచార్యులవారు పీఠాధిపతిగా వ్యవహరించుతూ వచ్చాడు. గవర్నర్ జనరల్‌గా ఢిల్లీలో సింహాసనం ఎక్కటానికి వెళ్లవలసి వచ్చినప్పుడు ఆ హోదా కామరాజనాడార్ భుజస్కంధాలపైకి ఎగిరింది. అంతదూరాన నిగనిగలాడే సోఫాలమీద ముఖమల్ బాలీసులపై సుఖాసీనుడై నానాదేశప్రతినిధులతో విందులు ఆరగిస్తున్నప్పటికీ శ్రీవారిప్రాణం యావత్తూ మైలాపూర్ సేతూ మధ్యదేశంమీద గుటగుటలాడుతున్నది. ఆయనపుణ్యమా అని మన చన్నపట్నం సాంబారులో కలిసిపోతున్నది. ఈ విషయంలో రాజాజీ సర్దారును అతిశయించాడని ఒప్పుకోక తప్పదు.

స్వాతంత్ర్యసమరపురోజులలో ధీమాగా మనం నాయకులని చెప్పుకోగలిగినవాళ్లు అనేకులు ఉండేవాళ్లు. "వేదాంతములతోడ వెక్కిరింతలతోడ" తెలుగు జనాభాను ఉక్కిరిబిక్కిరి చేసిన ఆంధ్రరత్న దుగ్గిరాల గోపాలకృష్ణయ్యగారు తారాజువ్వవలె అంతరిక్షానికి ఎగిరిపోయినాడు. లక్షలాదిగ డబ్బు దీక్షతో సమకూర్చ ఆంధ్రావనికి జీవంపోసిన దేశోద్ధారక నాగేశ్వరరావు పంతులుగారు శివసాన్నిధ్యంచెందాడు. ఆంధ్రోద్యమానికి మూలపురుషుడై అపారమైన దేశభక్తితో రాష్ట్రాన్ని ఉజ్జ్వలం తలూగించిన దేశభక్త వెంకటప్పయ్యపంతులు రాష్ట్రసిద్ధికి ప్రార్థిస్తూ పరమపదించాడు.

అద్వితీయమైన కార్యదక్షత కలిగి అన్ని విధాల నాయకత్వం వహించవలసిన గొల్లపూడి సీతారామశాస్త్రిగారు గాంధీమతంలో మునిగిపోయి జటాజినములు ధరించి ఆశ్రమవాసి అయి రాష్ట్రసాధనకు సత్యాగ్రహం చేదామంటున్నాడు. సాంఘిక రాజకీయసారస్వతాదులలో అసమానమైన ప్రతిభను చూపిన ఉన్నవ లక్ష్మీనారాయణపంతులు శారదానికేతనపు భారం మోసి మోసి కుంగిపోయినాడు. అతిరథ మహారథులలో ముఖ్యుడైన సాంబమూర్తి మహర్షి సహవాసదోషంవల్ల రాజకీయరంగంనుంచి కొంతకాలం వైదొలిగి ఇటీవలనే మూడవ కన్నును విప్పిచూస్తున్నాడు.

డాక్టరు భోగరాజు పట్టాభిసీతారామయ్య పంతులుగారి విషయం వింతగా పరిణమించింది. ప్రాచీన గ్రీసు నాటికలలోని నాయకుడి మాదిరిగా తయారయింది ఆయన పాత్ర. ఆంధ్రదేశంలో ఏకైకనాయకుడుగా ఉండవలసిన వ్యక్తిఆయన. నాయకుడికి ఉండవలసిన సరుకు సరంజామా యావత్తూ ఆయనలో ఉన్నది. వాగ్ధాటి, తంత్రాంగం, ప్రతిభ, పర్సనాలిటి మొదలైనవన్నీ ఉన్నవాడు. అయితే పదిమందినీ కూడగట్టుకుని ముందుకు నడిచే లక్షణం ఆయనలో లోపించింది. అదే మనకు కొంపతీసింది. ఆంధ్రోద్యమానికి ప్రాణం పోసినవారిలో ఆయన ముఖ్యుడు; ఏ విషయంలోనైనా సరే తెలుగువాళ్లు చెప్పుకొని గర్వపడవలసినవాడు; ఒకటికి రెండుసార్లు పోటీచేసి కాంగ్రెసు గద్దెను ఎక్కగలిగిన ప్రథమ ఆంధ్రుడు; అటువంటి నాయకుడు రాష్ట్రపతి అయిన మరునాటినుంచీ మనకు దూరం కావటం మొదలుపెట్టాడు. రాజాజీ పటేల్ ప్రభృతుల మంత్రాంగంలో బోల్తాపడి చెన్నపట్నానికి హస్తోదకాలు ఇచ్చి మనల నందరిని అందుకు ఒప్పుకొనేట్లు చేయడానికి విశ్వప్రయత్నం చేస్తున్న మహానుభావుడు ఆయన. ఆఖరుకు బొంబాయిమాదిరిగా చెన్నపట్నాన్ని కూడ ప్రత్యేకరాష్ట్రం ఎందుకు చేయకూడదో సకారణంగా ఈ నాటికీ వివరించక ఆంధ్రదేశములో పర్యటన చేయటానికి గూడ విముఖుడై పోయినాడు. రాష్ట్రాన్ని గురించి మొన్న ఒక ప్రకటనచేస్తూ సిద్ధించబోయే ఆంధ్రరాష్ట్రాన్ని వందలమైళ్ల దూరంనుంచి, సముద్రాలను గూడ దాటి శ్రేయోభిలాషిగా గమనిస్తూ ఉంటానే గాని వ్యక్తిగతంగా నాకు ఎటువంటి బాంధవ్యమూ లేదని నిజం ఒప్పుకున్నాడు. ఇటువంటి వ్యక్తి మరెవరైనా అయితే నవ్వవలసి ఉండేది. పట్టాభిగారు అయినందువల్ల విచారించవలసి వచ్చింది.

తెలుగుదేశపు భవితవ్యం ఇప్పుడు ఇద్దరు నాయకులమీద ఆధారపడిఉన్నది. ఆంధ్రకేసరి ప్రకాశంపంతులు, ఆచార్య రంగా. మనలను పాలముంచినా నీటముంచినా వీరిద్దరికే తగుతుంది. ఆంధ్రదేశంమొత్తంమీద వీరి ఉభయులకు ఉన్న పలుకుబడి మరొకరికి లేదు. ఆత్మవిశ్వాసంలోగాని, శక్తిసామర్థ్యాలలోగాని ప్రజాబాహుళ్యాన్ని కట్టుకుని నడవటంలోగాని వీరికి మించినవారు లేరు. దేశసేవలో పండి పరిపక్వమైనవాడు ప్రకాశంపంతులు. అత్యంతమైన ఉత్సాహంతో ముందుకుపోతున్న యువకుడు ఆచార్యరంగ. అధికమైన ప్రజాదరణను చూరగొన్నవాడు ఆంధ్రకేసరి. కాంగ్రెస్ హైకమాండు ఉదాసీనం చేయటానికి వీలుగానివాడు ఆచార్యుడు. వీరిద్దరు సీజర్ పాంపేలవలె ఒకరినొకరు ప్రతిఘటించకుండా చేదోడు వాదోడుగా వ్యవహరిస్తే ఆంధ్రులకు నెరవేరని వాంఛ ఏదీ ఉండదు.

వచ్చేనెల సగపడేకమునుపే, మద్రాసు రాజధానివాళ్లు ఏకోవిధంగా తేల్చి చెప్పనున్నారు హైకమాండువారు. కాంగ్రెసు త్రిమూర్తుల పథకం అన్నివిధాలా అనుకూలంగా ఉంటున్నది కాబట్టి తమిళరాష్ట్ర కాంగ్రెసుకమిటీవాళ్లు దానిని ఆమోదించి తీరుతారు. కామరాజనాడార్ హుకుములకు అనుగుణ్యంగా ప్రవర్తించే రాష్ట్రప్రభుత్వంవారు ఆ పద్ధతినే అవలంబించి తీరుతారు. ఇక మిగిలినది ఆంధ్రరాష్ట్రకాంగ్రెసు కమిటీ. అటు వర్తమండలంవారికి ఇటు సర్కారులవారికి తృప్తికరంగా వ్యవహరించి యావదాంధ్రుల అభీష్టాన్ని నెరవేర్చాలంటే మనరాష్ట్ర కాంగ్రెస్ కమిటీ ఆ పథకాన్ని త్రోసిరాజు అని తీరాలి. త్రోసిరాజు అన్నందువల్ల మనం ఇంతకంటె చెడిపోయేది లేదు. భయపడవలసినది అంతకంటే లేదు. అవసరం వస్తే మన వృద్ధనాయకులందరూ ఒక్కసారి ముందుకు దూకుతారు. సీతారామశాస్త్రి, సాంబమూర్తి, లక్ష్మీనారాయణ, కాశేశ్వరరావు మొదలైనవాళ్లు చివరసారిగా విజృంభించి తీరుతారు. ప్రకాశంపంతులు, ఆచార్యరంగా, అనంతశయనం అయ్యంగారు మొదలైన ప్రముఖనాయకులు నిబ్బరంగా నిలబడి తమ నిశితాభిప్రాయాన్ని వెలిబుచ్చితే ఎంతటి హైకమాండుఅయినా లొంగి తీరుతుంది. బహునాయకం ఏకనాయకంగా వ్యవహరిస్తే ఆంధ్రులను అరికట్టటానికి ఎవరికీ శక్యం గాదు. ఇటువంటి పరిస్థితిలో మన నాయకులు ఏవిధంగా ప్రవర్తించి తమ విధ్యుక్తధర్మాన్ని నెరవేరుస్తారో త్వరలో తేలిపోతుంది.

డాక్టరు జ్ఞానానందస్వామి

(1-వ పేజీ తరువాయి)

యేటనే సర్వమూ పరిత్యజించి, సన్యసించడానికి హృషీకేశము వెళ్లెను. చదివినది హైస్కూలు చదువైనా స్వామీజీకి హైస్కూలు చదువువల్లవచ్చిన విజ్ఞానమేమీ లేదు. నేడు ఆయనకు గల విజ్ఞానమంతయూ కేవలం తనహృదయకుహరమునుండి పొర్లుకొనివస్తూన్న విజ్ఞానమే. ఆయన తన హృదయప్రేరేపణవల్లనే గొప్ప కవిత్వమును చెప్పగలిగెనని తెలిసినవారు చెప్పుదురు.

స్వామీజీ అనేక ఉద్గ్రంథములను రచించెను. వానిలో "ధార్మికమహాప్రవచనము," "ప్రాణసూత్రములు," "ప్లానెట్ డిజైన్."

"ఫిలాసఫీ ఆఫ్ యోగ" మొదలగు ముఖ్యగ్రంథరాజములు పేర్కొనదగినవి.

పిచ్చినమ్మకాలు, మూఢవిశ్వాసాలు, ప్రజోపయోగంలేని ప్రక్రియలు అనిన స్వామీజీకి చికాకు. వీరు ఉపదేశించు మతప్రబోధము అంధవిశ్వాసాన్ని అనుసరించియుండక ఎక్కువగా హేతువాదముపై ఆధారపడియుండును. కొందరు వ్యక్తులు భగవంతునిపేరుతో చేయు వింతలు, విచిత్రాలు, చెప్పు అర్థరహితమైన బోధనలు స్వామీజీ అంగీకరించరు. ఇటువంటి మూఢబోధనలు చేయుటవల్ల ప్రజలకు ఉపయోగము లేకపోవుటయేగాక ప్రజలను మరింత మూఢవిశ్వాసములలోనికి తీసికొనిపోయినవారమగుదుమని స్వామీజీనమ్మకం. తమ జీవితాలలోని ఎంతటి గొప్పసంఘటనలనైన అవి ప్రజలకు చెప్పుటవల్ల వాటివల్ల ఉపయోగమేమీ లేనప్పుడు అట్టివాటిని వెల్లడిచేయుట అనవసరమని స్వామీజీ అభిప్రాయము. మతమునకును, ఆధునిక విజ్ఞానశాస్త్రమునకును, అవినాభావసంబంధము కలదని వీరు ప్రబోధము చేయుదురు. మతము, విజ్ఞానము- రెండును మానవుని హృదయము, మేధస్సులవంటివనియూ, మతము, విజ్ఞానమూ రెండును ఒకదానిపై మరొకటి ఆధారపడియున్నవనియూ, ఈ రెంటి కలయికవల్లనే మనము సద్వినియోగ మగు సత్ఫలితములను పొందగలమనియూ, స్వామీజీ ఒక పర్యాయము చెప్పిరి. విజ్ఞానసంబంధములేని మతప్రచారం కేవలము నిష్ప్రయోజనమని కూడ స్వామీజీనమ్మకము.

స్వామీజీ జ్ఞానానందునకు ఆంధ్రదేశములో పేరుపొందిన అనేకమంది శిష్యులు కలరు. వారిలో హిమాలయం, కైలాసం, అనేకమారులు వెళ్లివచ్చి, అనేక నూతనపరిశోధనలను సల్పి, కలకత్తావిశ్వవిద్యాలయంవారిచే గౌరవింపబడినస్వామిప్రణవానంద ఒకరు. చిన్నతనమునుండియు ఆధ్యాత్మికచింతనము, దేశసేవలలోనే మునిగి, వారి జీవితమునంతనూ సన్యాసాశ్రమమునకే అర్పితముచేసి హిమాలయపర్యటనము కూడ చేసి ప్రస్తుతం పసివేదలగ్రామంలో ఆశ్రమము స్థాపించి ప్రజాసేవ చేయుచున్న స్వామి ప్రజ్ఞానానంద ఒకరు.

విదేశవిఖ్యాతి చెంది భారతదేశమునకు నూతన పరిశోధనాసందేశమును ఇవ్వప్రయత్నిస్తూన్న స్వామి జ్ఞానానందవంటి మహాపురుషులు ఆంధ్రులై జన్మించడం ఆంధ్రజాతి గర్వించవలసిన విషయము.

మనరాష్ట్రం, మనదేశం:

(9-వ పేజీ తరువాయి)

సంఘం ప్రతిపాదించవచ్చని చెప్పబడియున్నది. "ఇతరవిధాయకమైన మార్పులు" అని చెప్పుటలో ఇదికూడ లాంఛనరూపకమైనదని స్ఫురించుటకు అవకాశమున్న దని తలచి 'ఇతర' అనే మాటను తీసివేయించితిమి. ఈ సవరణకు రచనా సంఘఅధ్యక్షుడు అంగీకరించిరి. ఈ అభ్యంతరము తీరినది.

అయితే 1 టవ షెడ్యూలుకు సంబంధించిన సవరణల మాట ఏమవుతుందనేది మరొక అభ్యంతరము. ఇవన్నీ కూడ క్రమవిరుద్ధమని త్రోసివేసి చర్చను నిరోధించుట తన ఉద్దేశ్యము గాదని ఈ షెడ్యూలులో దేశంలో ప్రస్తుతం వున్న రాష్ట్రములనే పేర్కొంటిమని పరిహద్దులను నిర్ణయించిన తరువాత షెడ్యూలులో చేర్చుటకు వీలుగా సభా కార్యక్రమము మార్చబడినదని అధ్యక్షుడు ప్రకటనలో స్పష్టపరచి సందేహములను తీర్చివేసినారు.

14 వ తేదీకి నాడు సంస్థలనుండి అభిప్రాయములు వచ్చిన 14, 15, 16, తారీఖులలో సవరణలప్రతిపాదన పూర్తిఅయి 16 తారీఖు సాయంత్రముకల్లా అంధ్రరాష్ట్రము సఫలమవుతుంది. ఈ గడువు 2? తేదీలోగా ఆంధ్రరాష్ట్రము సాధ్యమవుతుందని చెప్పుటకే ఆ సమయము దాటిన పిమ్మట ప్రజలు తమ ఇష్టము వచ్చిన సరిహద్దులు కోరవచ్చును. రాష్ట్రము తీసుకొనవచ్చును. అందులో సాధ్యాసాధ్యములు భవిష్యదర్శనములో వున్నవి.

ఆంధ్ర తమిళనాడు కాంగ్రెసు కమిటీల అభిప్రాయముతో ప్రసక్తిలేకుండా, పరిపాలనా సాధ్యత మున్నగు సమస్యలతో సంబంధములేకుండా మద్రాసు మంత్రివర్గమువారు స్వతంత్రముగా తమ యభిప్రాయము తెలుపవలెనని వర్కింగ్‌కమిటీవారిని కోరిరి. మద్రాసు ప్రధాని బాహుళ్యమైన విచారణ జరుపవలెనని గూడ వర్కింగ్‌కమిటీవారు వాంఛించలేదు. విచారణఘట్టము ముగియుటచేతనే ఆంధ్రరాష్ట్ర నిర్మాణమునకు వెంటనే గడంగవచ్చునని జవహర్లాల్, వల్లభాయ్, పట్టాభి నివేదిక తెల్పెను. ఈ లాంఛనముల నన్నిటిని వారు ఆదివరకే పూర్తిచేసిరి. ఆంధ్రరాష్ట్రమును నిర్మింప ఇండియాప్రభుత్వమువారు త్రికరణశుద్ధిగా వాంఛించుచున్నారను విషయమును ప్రజలు నమ్మకున్నారు.

నవంబరు 11 వ తేదీ సభలో ఆంధ్రరాష్ట్రీయ కాంగ్రెస్ సంఘమువారు ఏట్టి నిర్ణయము గావింతురన్న నేను చెప్పలేను"ఆంధ్రరాష్ట్రీయ కాంగ్రెస్ సంఘజాతకచక్రమును నేను వేయగలిగినయెడల అసలు రాష్ట్రము వచ్చునా యను విషయమై దానికెట్టి అనుమానములుండవని మాత్రము నేను చెప్పుదును. యిందువిషయమై హామీ ఒసంగబడినది. ఇవన్నియు నవంబరు 14 తేదీన అనగా ఆం. రా. కాం. సంఘసభ జరిగిన మూడురోజులకు ఈ వాగ్దానములు నెరవేర్చబడును. రాష్ట్రమును పుచ్చుకొనుటా? పుచ్చుకొనకపోవుటా? అనువిషయము ఆంధ్రరాష్ట్రీయ కాంగ్రెస్‌పై ఆధారపడియున్నది. సభ్యులసమష్టిబుద్ధికతెలివితేటలను, వాస్తవికపరిజ్ఞానములోను నాకు విశ్వాసము కలదు. రాష్ట్రము వచ్చిన యెడల చిరకాలవాంఛాసిద్ధిని చాలాదూరము నుండి సంతోషముతో తిలకించెదను. ఆంధ్రరాష్ట్రనిర్మాణములో నాకు గల శ్రద్ధ ఒక రాజకీయవేత్తకుగల శ్రద్ధ కాదు. తండ్రికి కుమారుని యెడల గల శ్రద్ధవంటిది."

రుద్రమదేవి

(6-వ పేజీ తరువాయి)

కునియొద్ద శివదీక్ష గ్రహించెను. తదాది గణపతిదేవునికి విజయపరంపరలు సిద్ధించెను. సామంతులందరు నొకరి తరువాత నొకరు వశులైరి. శత్రువశమైన నిజభూభాగమె కాక శత్రురాజుల భూభాగములుకూడ కొన్ని యా మహారాజు వశమయ్యెను. ఇట్లాతడు తెలుగుభాష మాట్లాడు విశాలాంధ్రదేశమున కంతటికి నిష్కంటకముగా నేకచ్ఛత్రాధిపతి యయ్యెను. అతని రాజ్యము దక్షిణమున కాంచీపురమువరకును, ఉత్తరమున సింహాద్రిదాటి మాల్యవంతమువరకును, పశ్చిమమున కల్యాణకటకమువరకును తూర్పున సముద్రమువరకును విస్తరించెను. ఒక్కొక్కసీమను జయించినప్పుడెల్ల అతడనేకము లగు శివాయతనములు ప్రతిష్ఠించి, తన నామముతో గణపేశ్వరము లను పురములను నిర్మించెను. అతడు త్రవ్వించిన తటాకములకు కట్టించిన గ్రామములకు వేయించిన రాజమార్గములకు నడిపించిన కాలువలకు లెక్కలేదు. రాజధానీనగరము నోరుగల్లుకు మార్చెను. ఇట్లాతడు బహుదీర్ఘకాలము సమర్థతతో రాజ్యపరిపాలన మొనర్చెను.

ఇందరు రాజన్యులను ఇన్ని రాజ్యములను గణపతిదేవుడు జయింపగలిగెనుగాని వార్ధక్యమునుగాని మృత్యుదూతయగు వ్యాధినిగాని, జయించు శక్తి యాతనికి లేకపోయినది. ముదిమి పెరుగుచున్నకొలది పాలనలో పటుత్వము తగ్గజొచ్చినది. దానికి తోడాతనికి పురుషసంతతి లేకపోయెను. స్త్రీసంతతికైనను పురుషసంతతి కలుగలేదు. అందుచే నీ వృద్ధరాజు ననంతరమున రాజ్యశాసకు డెవడగునని ప్రశ్న తీరక యెల్లప్పుడు వచ్చుచుండెను. రాజబంధువులలో భేదాభిప్రాయములు వ్యక్తమగుచుండెను. అవి సామంతులకును మండలేశ్వరులకును సూక్ష్మసూక్ష్మముగా ప్రాకసాగెను. ఇక్కలి విశాలమగు నాతని రాజ్యాంచలములలో కదలికలు ప్రారంభించెను. ఒక వంక కాంచీపురచోళులు స్వతంత్రులై నెల్లూర గణపతిసామంతుడగు మనుమసిద్ధిని రాజ్యపదభ్రష్టు నొనర్చిరి. తొండమండలమునుండి కొప్పెరుంజింగడు మరికొంత భూమిలో ప్రవేశించి దాక్షారామమువరకు నెత్తిరా నుంకించుచుండెను. సామంతుడగు మనుమగండగోపాలుడు విద్రోహ మొనర్చెను. కళింగగాంగులు ఈశాన్యమున కోల్పోయిన భూభాగమును తిరిగి కబళింప యత్నించుచుండిరి. అంతలో నప్పటి యాదవరాజగు మహాదేవరాజు దండెత్తివచ్చుటకు మహాసైన్యములు సమకూర్చుచుండెనని వార్తాహరులు తరుచుగా తెలుపుచువచ్చిరి.

కాకతీయ ప్రజాజీవనములో మతభేదములచే సామరస్యము నశించెను. శైవవైష్ణవులకు తమలో తమకును ఉభయులకు జైనులతోడను ద్వేషములు తీవ్రము కాజొచ్చెను. వానికి తోడు ఒకవైపున వీరశైవమును మరొకవైపున వీరవైష్ణవమును జనులను మతావేశముతో నున్మత్తప్రాయుల నొనర్చుచుండెను. వారుభయులకు జైనులతో తరచుగా వాదోపవాదములు సాగుచుండెను. రాజ్యమునకు మూలాధారమగు గ్రామములలో కరణములుగా విశేషముగా జైనులే యుండిరి. పట్టణములలో గూడ పలువు రుద్యోగులు జైనులే. రాజకోశమునకు అధిపులుగా నున్నవారిలో పెక్కురు జైనులే. అందుచే ఆనాడా రాజ్యములో జైనులపలుకుబడి బలముగా పాదుకొనియుండెను. రాజధానీనగరమునను పెద్దపట్టణములను శైవవైష్ణవము కెంత శీఘ్రముగా ప్రాకుచున్నను గ్రామములలో నవి యంత శీఘ్రముగా వ్యాపింపలేకుండెను.

కాకతీయసామంతులను దండనాథులందును అన్ని కులములవారును గలరు. వారిలో కొందరు బ్రాహ్మణులు. కొందరు చాళుక్య క్షత్రియులు. కొందరు కదంబ గాంగ పల్లవ కాకతీయాది వంశముల క్షత్రియులు. మరికొందరు పద్మనాయకులు. ఇంకను కొందరు బహువంశముల రెడ్లు. వెండియు గొందరు కాయస్థులు. వారెన్ని భిన్నకులములవారైనను పూర్వము ప్రభువునెడ సమానముగా భక్తి కలవారై యుండిరి. ఇప్పుడు భిన్నమతాభిమానములచే వారిలో నందరకు నేకభావన లేక అనేక పక్షములుగా నంతరంగములలో చీలియుండిరి. భవిష్యద్రాజనిర్ణయములో నీ చీలికలు గాఢమగు సూచన లున్నవి. స్పృశించినంతనే చిటికిపోవు బుడగవలెను, ఒత్తిడి తగిలినంతనే ప్రేలిపోగల శతఘ్నివలెను, పరిస్థితు లున్నవి. అది బుద్ధిశాలి యగు గణపతిదేవునకు తెలియకపోలేదు. అందుచే నా ప్రస్తావన రానీయకుండ ఇప్పటివర కెన్నియో సంవత్సరములు గడిపెను. కాని యెన్నాళ్లు గడపగలడు!

ఈ సంవత్సరము నవరాత్రదీక్షకు తాను కూర్చుండుటకుగూడ నోపిక లేని యవస్థ వచ్చినది. ఏదో ఒక నిర్ధారణ చేసితీరవలసిన తరుణము వచ్చినది. ఇక నాలసింప సాధ్యము కాదు!

పలువురు సామంతులును దండనాథులును రాజబంధువులును రాజధానికి వచ్చియున్నారు. కాని మహారాజుకు భుజదండములవంటి మండలేశ్వరులు కొందరింకను రాలేదు. ఇందులూరి అన్నమదేవుడును కొలని రుద్రదేవుడును ఎంత ప్రయత్నించినను రాలేకపోయిరి. గోదావరియు దాని యుపనది యగు శబరియు పొంగి వరదలు విపరీతముగా వచ్చినందున అనేకగ్రామముల జనములు నిరాధారులై ప్రాణాపాయస్థితిలో నుండిరి. వారలు దగ్గరనుండి అవసరమగు ప్రతిక్రియలు చేయింపనిచో ప్రజాబాధ దుర్భరమగును. అందుచే తాము విదియతదియలకుగాని రాలేమని గణపతిదేవులకు వినతు లంపుకొనిరి.

మరియు జన్నిగదేవుడును అంబదేవుడును అను కాయస్థ దండనాథు లిరువు రుండిరి. వారు రాజధానికి రాలేదు. వారెందుకు రాలేదోకూడ తెలుపలేదు. వారు రాకున్నందుకు గణపతిదేవునికి ముందు కోపము వచ్చెను. ఈనాడు వత్తురు. ఈనాడు వత్తురని నిరీక్షించెను. కోపము చిరాకు నెక్కువగుచుండెను. మహాలయఅమావాస్యకు కూడ రాకుండుటయేగాక వార్తకూడ వారు పంపలేదని తెలిసి గణపతిదేవుడు కుప్పకూలినట్లయ్యెను. ధైర్యమును ఆగ్రహమును తెచ్చుకొనెను. మరల నధైర్య మావేశించును.

గణపతిదేవునకు చాలకాలమువరకు ముందు సంతతియే కలుగలేదు. రుద్రమదేవి గర్భములో నుండగా జ్యోతిష్కులు భావిరాజ్యాధిపతి పుట్టునని ప్రశ్నలు చెప్పిరి. అందుచే పుత్రజననమగునని పేరాసతో నిరీక్షించెను. కాని తుదకు పుత్రిక యను వార్త తెలిసినది. వెంటనే యాతడు మనోనిశ్చయము చేసికొని మహారాజులకు పుత్రోత్పత్తి కలిగెనని ప్రకటింపజేసెను. ఆ కుమార్తె కాతడు రుద్రదేవుడనియే తన తాత పేరుపెట్టి పురుషవేషము వేయించి వ్యవహరింపజొచ్చెను. కాని యట్టి యంతఃపురరహస్యమెంతకాల మాగగలదు? నిజవార్త యానోట నానోట బడి వ్యాపింప జొచ్చెను. ఆమెకు పదేండ్లు దాటకముందె కన్యక యని రాజ్యములో నలుమూలల నది తెలిసిపోయెను. రాజాజ్ఞలయెడ భయముననైన నది ప్రజలచే రహస్యముగా నుంచునట్లు చేయుట యసాధ్యమయ్యెను. ఆ సందర్భమున నున్న విషయము మరుగుపరచి కల్లోలములు పెంచుట కతని కిష్టము లేకపోయెను.

అంతలో మరియొక భార్య గర్భవతి యయ్యెను. ఈమారైనను పుత్రుడుదయించునా యని యాశపడెను, మరల పుత్రికయే కలిగెను.

ఆసమయమున రుద్రమదేవి పూర్ణయౌవన యయ్యెను. ఖడ్గాద్యాయుధవిద్యల నామె ప్రవీణ. దండనీతి యామెకు హస్తగతము. వనిత ఎంత విద్యావతి యైనను శాశ్వతముగా కన్యకగా నుండ సాధ్యమా? ఆమెకు వివాహము చేయక తప్పినది కాదు.

గణపతిదేవు డాలోచించెను. వీరాంగన యగు నామెకు వీరాధివీరునే భర్తగా జేయనాతడు నిశ్చయించెను. అంతట నామె కతడు వీర్యశుల్కము నిశ్చయించి కులీనులగు దండనాథులకును సామంతులకును ఆహ్వానము లంపెను. రుద్రమదేవిని ఖడ్గయుద్ధమునను ధనుర్విద్యయందును ఆమెను జయింపగలవాని కామె నిచ్చి వివాహము చేసెదనని చక్రవర్తి నిర్ణయము చేసి యావిధముగా వార్త లంపెను.

అట్లాహూతులయిన క్షత్రియవీరులు పలువురు రాజాజ్ఞ పాలించి రాజధానికి వచ్చిరి. కాని వారిలో పెక్కురకు రుద్రమదేవిని వివాహమాడుట యిష్టము లేదు. కొందరు రాజపుత్రికయందు భయభక్తులు చూపి యామెతో యుద్ధము చేయ నియ్యకొనలేదు. కొందరు యుద్ధములో పాల్గొని, ప్రయత్నపూర్వకముగా నోటమి యంగీకరించిరి. పురుషునివలె వ్యవహరించు స్త్రీని వారు భార్యగా స్వీకరించుట కిష్టము లేమినే వారట్లు ప్రవర్తించుచుండిరని గణపతిదేవు డూహింపక పోలేదు.

మరి చాళుక్యవీరభద్రేశ్వరుడో, మిగిలిన సామంతులవంటివాడు కాడతడు! రాజ్యభ్రష్టుడై యాతడు యౌవనదశలో బహుకాల ముత్తరదేశములలో సంచరించెను. అప్పుడచ్చట విజృంభించుచున్న ఇస్లాముమతావేశము నతడు కన్నులార జూచెను. శిథిలప్రాయములగు బౌద్ధసంఘారామములను వీడి దేశాటనము చేయుచున్న బౌద్ధభిక్షువుల నెందరినో యాతడు సందర్శించి సంభాషించియుండెను. వారి యుపదేశములచే దేశమంతట నైకమత్యము లేకుండ వేరుచేసిన సంఘవర్ణవ్యవస్థయే యను విశ్వాస మాతనికి స్థిరపడెను. ఇట్టి కాలములలో స్త్రీలు అంతఃపురములలో కుములుచుండుట శ్రేయస్కరము కాదనియు నూహ యాతనికి ప్రబలెను. అతని రాజ్యము హరించిన జ్ఞాతులవలననుండి తన వేంగీమండలమును గణపతిమహారాజుసాహాయ్యముననే తిరిగి యాతడు సంపాదించుకొనగలెను.

వీరభద్రరాజు చాళుక్యక్షత్రియుడు! అనాదిగా వారు చంద్రవంశజులమని చెప్పకొనుచుండిరి. కాకతీయులక్షత్రియత్వము వారి ప్రభుత్వముతోపాటు ఈమధ్య పెరిగినది. చాళుక్యులు కాకతీయులతో వివాహసంబంధములు చేయుట హీనముగా భావించి యందు కుద్యుక్తులు కాకుండిరి. కాని వీరభద్రేశ్వరున కట్టిపూర్వాచారములయందు విశ్వాసము లేదు. అదిగాక అతడిప్పటికే యొక క్షత్రియకన్యను వివాహమాడియుండెను. తానిప్పుడు రుద్రమదేవిని వివాహమాడినచో నాంధ్రసామ్రాజ్యమునకే ప్రభుత్వము సంపాదింపగలుగును. పూర్వము మధ్యదేశమునంతయు పాలించిన చాళుక్యవంశప్రభ మరల కర్ణాటాంధ్రములలో తాను వెలిగించి యుద్ధరింపవచ్చునని యతని కాశ కలిగెను. అందుచే నాతడు ప్రయత్నించి ఖడ్గయుద్ధమునను ధనుర్విద్యయందును రుద్రమదేవి నెదుర్కొని జయించి యామెను వరించి వివాహమాడి గణపతిదేవులకు ప్రియతము డయ్యెను.

గణపతిదేవుని ద్వితీయపుత్రిక గణపాంబ. ఆమెను ధాన్యకటకపాలకుడగు కోట బేతరాజున కిచ్చి వివాహ మొనర్చెను. పుత్రులు తనకు గలుగకున్నను నాశ యడుగంటినతర్వాత దౌహిత్రులైన గలుగుదురేమో యని యాతడాశించెను. కాని దౌహిత్రులుకూడ కలుగు భాగ్యమాతనికి లేకపోయెను. రుద్రాంబిక కొక పుత్రిక కలిగెను. గణపాంబకు సంతతియే లేక బేతరాజు గతించెను. భర్తరాజ్యమును గణపాంబయే పాలించుచుండెను.

రుద్రాంబపతికి హరిహరుడు మురారిదేవుడను నిరువురు కుమారు లుండిరి. వారును వీరభద్రరాజుతోపాటు గణపతిదేవుని శ్రద్ధాభక్తులతో సేవించుచుండిరి. వారిరువురును దండనీతి విశారదులు. రాజలక్షణలాంఛితులు. గణపతిదేవునకును రాజపురుషులకును వారు ఆదరపాత్రులుగా నుండిరి. వారిలో పెద్దవాడగు హరిహరుడే గణపతిసామ్రాజ్యమునకు అనంతరపాలకు డగునని యందరు దలంచుచుండిరి. గణపతిదేవుడుగూడ నదియే యాలోచించుచుండెను. గాని ప్రత్యక్షముగా నెన్నడు నా మాట చెప్పలేదు. మర్యాదాదికములన్నియు మాత్ర మట్టి యూహనే బలపరచుచుండెను.

ఇట్లుండగా ఇప్పటికి నాలుగేండ్లక్రిందట నొక విశేషము జరిగినది. రుద్రమదేవికుమార్తె యగు ముమ్మడమ్మ మహాదేవరాజును వివాహమాడియుండెను. మహాదేవరాజుకూడ గణపతిని భక్తిభావముతో కొలుచుచు చక్రవర్తి యనుగ్రహము సంపాదించుచుండెను. ఆ దంపతులకు నాలుగేళ్లనాడు కుమారుడు కలిగెను. ఆ కుమారుడు పుట్టినదియు ఏకశిలానగరముననే.

దౌహిత్రజననవార్త రుద్రమదేవి వినగానే పుత్రజననమైనట్లె యానందించెను. వెంటనే యా వార్త గణపతిదేవుల కెరిగించిరి. పాలిపోయియున్న చక్రవర్తి ముఖమున రక్తపు జీరలు చిమ్మి కమలమువలె వికసించెను. రాజజ్యోతిష్కులను సాముద్రికులను శాకునికులను రాజసన్నిధికి పిలిపించిరి. జ్యోతిష్కు లీ కుమారుడు మహాచక్రవర్తి యగునని చక్రములు వేసి గుణించి నిశ్చయించిరి. సాముద్రికులు పసివానిశరీరము పరీక్షించి చక్రవర్తిచిహ్నములు కలవాడని యా మాటనే దృఢపరచిరి. శాకునికులు భవిష్యచ్చక్రవర్తి పుట్టెనని నిర్ధారణ చేసిరి.

గణపతిదేవుని యాశాంకురము హృదయములో విచ్చెను. కాని దాని నాతడు పైకి పొక్కనీయలేదు. ఈ వంశాంకురము వృద్ధియై స్వతంత్రముగా నిలువగలుగునంతవరకు తాను జీవించునా? ముందుగా తన యూహ తెలిసినచో పసివానిజీవితమున కెంత ప్రమాదము! ఐనను ప్రియపుత్రిక దౌహిత్రునిపై ప్రేమ మాపుట వింత కాదుకదా! ఆ విధముగనే అతడా పసికందును అంగీకరించెను.

నామకరణోత్సవము మహావైభవముగా జరిగెను. ఆనాడు పరిషత్తులో రుద్రమదేవి పురుషవేషము ధరించి కుమారుని చేతులలో తీసికొని 'ఇడుగో నా కుమారుడు!' అని గణపతిదేవుల పాదములకు మ్రొక్కించెను. మహారాజు ప్రీతిపూర్వకముగా నాశీర్వదించి ప్రతాపరుద్రదేవుడని నామకరణము చేయ నాదేశించెను. మహాదేవరాజు 'మహాప్రసాద' మని ముత్యా లుంచిన బంగారుపళ్లెములో మణిఖచితాంగుళీయకముతో నర్భకుని కా వ్యవహారనామము వ్రాసి శ్రీకారము చుట్టి వినిపించెను. జయజయఘోషములు భూసురాశీర్వచనములు మంగళవాద్యనాదములతో చెలరేగెను.

తదాది దినదినము గణపతిదేవునకు ఆ యర్భకునిపై మమకార మతిశయింపసాగెను. ఆ యర్భకుడును రుద్రమదేవిని తల్లిగను గణపతిదేవుని తండ్రిగను భావించుచున్నట్లు పెరిగెను. బహుమానముగా మహాదేవరాజునకు మహామండలాధిపత్యపదవీలాంఛనము చక్రవర్తి ప్రసాదించెను.

గణపతిదేవుడు తన సామ్రాజ్యమునకు ప్రతాపరుద్రదేవునకే యౌవరాజ్యపట్టము కట్టవలెనని నిశ్చయము చేసెను. అంతవరకు హరిహరుడే రాజగునని యందరు దలంచుచుండిరి. ఇప్పుడు ప్రజాహృదయములలో హరిహరమూర్తిని తొలగించి యాస్థానమున ప్రతాపరుద్రదేవమూర్తిని ప్రతిష్ఠించుటెట్లు?

ముదిమి వచ్చినది. దేహదార్ఢ్యము తగ్గినది. బుద్ధిలో తైక్ష్ణ్యముకూడ ఉజ్జ్వలముగా లేదు. అన్నిటికి తోడు వ్యాధి ప్రవేశించినది. జీవితశేష మెక్కువ లేనట్లు గోచరించుచున్నది. ఇట్టి స్థితిలో తన పుత్రికాదౌహిత్రుని రాజ్యమున స్థిరమొనర్చుటెట్లు?


ఇట్టి సందర్భములలో నవరాత్రోత్సవము జరుపవలసివచ్చినది. ఆ యుత్సవ మెవరిమీదుగా జరిపించిన, వాడు భవిష్యత్ప్రభువు కాగలడని చక్రవర్తి నియమించినట్లే!

అందుకై యీ మహాలయామావాస్యనాడు గణపతిదేవరాయలు ఆంతరంగికమహాసభ చేసెను.

అమెరికాలో పండిట్ నెహ్రూ




డార్ఫ్ ఆస్టోరియా హోటల్ విందులో పండిట్ నెహ్రూతో, ఐక్యరాజ్యసమితి అమెరికన్ ప్రతినిధి ఫిలిప్ సి. జెసప్.



వాల్‌డార్ఫ్ — ఆస్టోరియా హోటల్లో ఐక్యరాజ్యసమితి అధ్యక్షుడు కార్లోస్ రోమ్యులో, రోమ్యులో సతి, పండిట్ నెహ్రూ



మాసచుసెట్స్ టెక్నికల్ ఇన్‌స్టిట్యూట్‌ను సందర్శించినప్పుడు పండిట్ నెహ్రూ, కళాశాలాధ్యక్షుడు జేమ్స్ కిరియన్.



న్యూయార్కు పౌరసన్మానంలో : మేయరు ఓడయ్యర్‌తో కరచాలనం చేస్తున్న నెహ్రూ.

హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో : పండిట్ నెహ్రూ, విశ్వవిద్యాలయాధ్యక్షుడు జేమ్స్ జి. కోనాంట్.





ఐక్యరాజ్యసమితి కార్యాలయంలో '4.వ సంఘం' సమావేశ చర్చలను ఆలకిస్తున్న నెహ్రూ.

Regd, M. No. 4479

ఉత్తమ శైవమత గ్రంథము

పండితారాధ్యచరిత్ర

వెలరు 5-0-0 లు.

ప్యాకింగు పోస్టేజి రూ, 1—4—0.

పాల్కురికి సోమనాథకవి రచించిన ఉత్తమ ద్విపద కావ్యము. డా॥ చిలుకూరి నారాయణరావుగారిచే పరిష్కరింపబడినది. దీక్షా, పురాతన, వాద, మహిమ, పర్వతము లను అయిదు ప్రకరణములును ఒకే సంపుటమున గలవు. ఇంత నిర్దుష్టముగ ఈ గ్రంథము నిదివర కెవ్వరును ప్రచురించి యుండలేదు. నారాయణరావుగారు రచించిన అమూల్యమైన పీఠికకూడ కలదు.

ఆంధ్రగ్రంథమాల, పోస్టు బాక్సు నెం. 212, మదరాసు 1.

తెలుగుమెఱుగులు

గ్రంథకర్త: వేటూరి ప్రభాకరశాస్త్రిగారు

తెలుగుదనము, తెలుగుసంప్రదాయాలు, తెలుగుభాష అవతరించిన విధము, తెలుగు తేటదనము, తెలుగు కవితా పారమ్యము, ప్రాచీన గ్రంథాల పలుకుబడికి మనపై చెల్లుబడి, విలక్షణమైన మన అరసున్న చరిత్ర, వింత వింత నిఘంటువులు, మన గ్రంథాలలో గ్రంథులు, అవీ ఇవీ, ఇంకా తెలుగులో ఉన్న ఎన్నో మెఱుగులను చూపెట్టుచున్న వ్యాసముల సంపుటి. శాస్త్రిగారి పాతిక ముప్పయి సంవత్సరాల సాహిత్య కృషి ఇందులో మూర్తీభవించియున్నది. ఆంధ్రాభిమానముగల వారందరు అవశ్యము చదువవలసిన గ్రంథము. ప్రతులకు త్వరపడవలెను.

వెల ౨ రూ. తపాలాఖర్చులు ౭ అణాలు.

ఆంధ్రగ్రంథమాల

గాంధీ మహాత్ముని

ఆత్మకథ

రెండు సంపుటములు

[చతుర్థముద్రణము]

శతావధాని వేలూరి శివరామశాస్త్రిగారి

అనువాదము

ఖద్దరు బైండు

ప్రతిసంపుటము పోస్టేజితో సహా వెల రూ. 5-9-0

ఒకేసారి 2 సంపుటములు పోస్టేజితో ,, 10-12-0

ఆంధ్ర గ్రంథమాల, పోస్టుబాక్సు నెం. 212, మదరాసు 1

శ్రీమద్భగవద్గీత



సంస్కృత మూలము, తెలుగున టీకాతాత్పర్య విశేషార్థ వివరణములు గల 400 పుటల గ్రంథము. గీతాధ్యయన పరులకు మిక్కిలి ఉపయుక్తమైనది.

ఖద్దరు బైండు.

వెలరు 4-0-0 లు.

తపాలా ఖర్చు అ. 0-9-0.

ఆంధ్రగ్రంథమాల

పోస్టుబాక్సు 212 మదరాసు 1.

Edited, Printed & Published by S. Sambhu Prasad, at the Andhra Patrika Press, 7, Thambu Chetty St., G. T. Madras.